ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

బుధవారం 26 ఆగస్టు 2026 | సంపుటి: 1 సంచిక: 70 పేజీలు 12 వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

## అమెరికా చదువులపై విద్యార్థుల్లో అనాసక్తి

ఉద్యోగార్థుల్లోనూ పెరుగుతున్న నిరాశ

ట్రంప్ ఆంక్షలతో విసుగెత్తుతున్న భారతీయులు

చదువుల కోసం వెళ్లేవారి సంఖ్య గణనీయంగా తగ్గుదల

2





2

భవిష్యత్ తరానికి బాధ్యతలు

## అప్పగించాల్సి ఉంది

గడ్కరీ వ్యాఖ్యలతో రాజకీయ కలకలం

కేంద్రంలో కొత్త తరానికి అవకాశం

# కాంగ్రెస్‌లో చేరికలతో చీలికలు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వలసల పర్వం కొనసాగుతోంది. బీఆర్ఎస్, బీజేపీ నుంచి పెద్ద ఎత్తున నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇంకా కొన్నిచోట్లు ఆ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే ఈ వలసలే ఇప్పుడు కాంగ్రెస్‌కు కొత్త తలనొప్పిగా మారాయి. వలసలు జరిగిన ప్రతి నియోజకవర్గంలోనూ పాత, కొత్త నాయకుల మధ్య ఆధిపత్య పోరుతో పార్టీ రెండుగా చీలిపోతోంది. ఇది పార్టీకి లాభం కంటే నష్టమే ఎక్కువ చేస్తోంది.

(ఖమ్మం బ్యూరో - సింగిడి )



**భద్రాద్రి జిల్లా చర్లలో రెండు కార్యాలయాలు**

ఇందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలమే ప్రత్యక్ష ఉదాహరణ. చర్లలో కాంగ్రెస్ 'ఐ' లో ఐక్యత పూర్తిగా లోపించి ఏకంగా రెండు పార్టీ కార్యాలయాలు వెలిశాయి. పాత కాంగ్రెస్ శ్రేణులు ఒక కార్యాలయంలో, పాత, కొత్త నాయకులు కలిసి మరో కార్యాలయంలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతో కార్యకర్తలు ఎటు వెళ్లాలో తెలియక అయోమయంలో పడ్డారు. పార్టీ ఆఫీసులకు వెళ్లడానికి జంకుతున్నారు. అటువెళితే ఇటు, ఇటువెళితే అటు లీడర్ల నుంచి వార్నింగ్స్ వస్తున్నట్లు సమాచారం.

## పాత, కొత్త నాయకుల మధ్య ఆధిపత్య పోరు

## వలసలు జరిగిన ప్రతిచోట ఇదే తలనొప్పి

**ఎన్నికల్లో ఓడించారు..**
**అధికారం రాగానే అదే పార్టీలో చేరారు**

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే పోదెం వీరయ్యను వ్యతిరేకించిన కొందరు కాంగ్రెస్ నేతలే లోపాయికారిగా బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావుకు సపోర్ట్ చేసి గెలిపించారనే ఆరోపణలు ఉన్నాయి. దానికితోడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే బిఆర్ఎస్ నుంచి గెలిచిన తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరగా, ఆయన గెలుపు, వీరయ్య ఓటమి కోసం అహర్నిశలు శ్రమించిన బిఆర్ఎస్ నాయకులు అంతా వెంకట్రావు వెంట కాంగ్రెస్‌లోకి వచ్చేశారు. వన్ మాన్ ఆర్మీగా ఉన్న వీరయ్యకి వెంకట్రావు పక్కలో బల్లెంలా తయారైనాడు. భద్రాచలంలో తాజా, మాజీ ఎమ్మెల్యేల ఆధిపత్య పోరు కింది క్యాడర్‌కి తలనొప్పిగా తయారైంది. పాతవాళ్ళు వీరయ్యని సమర్థిస్తుంటే కొత్తవాళ్ళు ఎమ్మెల్యే వెంకట్రావు వెంట అడుగులేస్తున్నారు. ఇక మరో ఆసక్తికర విషయం ఏమంటే కొందరు తెలివైన రాజకీయ నాయకులు ముందుచూపుతో బిఆర్ఎస్ నుంచి బయటకు రాకుండానే ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుని తమ అవసరాలకు ఉపయోగించుకుంటున్నారు. ఎమ్మెల్యే మావాడు. మేము డబ్బులు ఖర్చుచేసి, రేయింబవళ్ళు కష్టపడి గెలిపించుకున్నాం

కనుక తమ పనులు చేయాల్సిన బాధ్యత ఆయనకు ఉంది. ఓ విధంగా అధికార పక్షం, ప్రతిపక్షం మాదే అని బాహాటంగా చెబుతున్నారు.

### రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి

చర్లలోనే కాదు, వలసలు ఎక్కువగా జరిగిన ఖమ్మం, నల్గొండ, మహబూబ్ నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోని అనేక నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఎన్నికలప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పదవులు ఇస్తామని హామీ ఇచ్చి తమను వాడుకున్నారని, ఇప్పుడు పలకరించడం లేదని కొత్తగా వచ్చిన నాయకులు వాపోతుంటే, సంవత్సరాల తరబడి పార్టీ జెండా మోసిన తమకు అన్యాయం జరుగుతోందని పాత నాయకులు ఆవేదన చెందుతున్నారు. ఇలాంటి ద్వంద్వ వైఖరి, రెండు వర్గాల పోరుతో క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలహీనపడుతోంది. రానున్న స్థానిక సంస్థల (పరిషత్) ఎన్నికల నాటికి అధిష్టానం జోక్యం చేసుకుని సర్దుబాటు చేయకపోతే నష్టం తప్పదని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

## త్వరత్వరగా మూసీ భూసేకరణ

న్యాయపరమైన చిక్కులు లేకుండా నిర్వహణ

అధికారులకు సిఎం రేవంత్ ఆదేశం

మూసీ ప్రాజెక్ట కోసం భూ సేకరణను వేగవంతం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ల్యాండ్ పూలింగ్‌పైన స్పష్టమైన విధానం రూపొందించు కోవాలన్నారు. మూసీ ప్రాజెక్టపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణ కోసం స్పష్టమైన విధానం తయారు చేసుకోవాలని సూచించారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా చూడాలన్నారు. మూసీ ప్రాజెక్టు ఫేజ్ 2కి వీలైనంత త్వరగా టెండర్లను పిలవాలని తెలిపారు.

హైదరాబాద్,ఆగస్టు 25 (సింగిడి)



2

## సిఎం రేవంత్ యూఎస్ పర్యటనపై వివరణ ఇవ్వాలి



ఎందుకు అమెరికా పర్యటనో వివరంగా చెప్పాలి

మేయర్ మమ్దానీని ఎందుకు కలవాలనుకున్నారో చెప్పాలి

నిబంధనల మేరకే కేంద్ర విదేశాంగశాఖ నిర్ణయాలు

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టీకరణ

2

## శ్రీశైలం వడ్డెర సత్రంలో దారుణం

ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్య

నెలరోజులుగా సత్రంలోనే ఉండడంపై అనుమానాలు

దర్యాప్తు చేపట్టిన స్థానిక పోలీసులు

2

## తెలంగాణ మోడల్‌లో కులగణన

జనగణనలో కులగణన విధానం సరిగా లేదు

ప్రశ్నావళి మార్చేందుకు అఖిలపక్షం ఏర్పాటు

ప్రధాని మోడీకీ రాహుల్, ఖర్గేల లేఖ

**న్యూఢిల్లీ,ఆగస్టు 25 (సింగిడి):**
జనగణన పద్ధతిపై కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మంగళవారం ఖర్గే, రాహుల్ సుదీర్ఘ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. కులగణలో తెలంగాణ మోడల్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జనగణనలో కులాల నమోదుకు 'ఓపెన్-ఎండెడ్' విధానాన్ని అమలు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.

2



## నగరంలో నకిలీ వైద్యుల దందా

11 మందిని అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్

**హైదరాబాద్,ఆగస్టు 25 (సింగిడి):**
హైదరాబాద్ నగరంలో నకిలీ వైద్యుల ముఠాపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు విరుచుకుపడ్డారు. జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ జోన్ల పరిధిలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో ఏకంగా 11 మంది నకిలీ డాక్టర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతర రాష్ట్రాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల పేరుతో సృష్టించిన నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లను అడ్డుపెట్టుకుని, వీరు నగరంలోని పలు కీలక ప్రాంతాల్లో ఏకంగా క్లినికలు తెరిచి ప్రాక్టీస్ చేస్తున్నారు.

2





ఫీజులే చెల్లించరు..

## విదేశీ విద్య ఎలా వస్తుంది

2

లక్షలాది విద్యార్థుల మానసిక క్షోభ అర్థం కావడం లేదా

ఫీజు చెల్లింపుల సిఎం రేవంత్ రెడ్డిపై బండి విమర్శలు

**హైదరాబాద్,ఆగస్టు 25 (సింగిడి):**
ఫీజు రీయింబర్స్‌మెంట్‌కే దిక్కులేదని.. విదేశీ విద్యను అందిస్తానంటే నమ్మేదెలా అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజరు కుమార్ ప్రశ్నించారు. ఫీజు బకాయిలు అందక ఉన్న కాలేజీలే మూత పడుతున్నాయని తెలిపారు.

# హైకమాండ్ కంట్రోలేంటి..

చిన్నారెడ్డిపై చర్యలకు కమిటీ సిఫార్సు... కొండా సురేఖపై టీపీసీసీకి సమగ్ర నివేదిక

హెచ్చరికలు పని చేయలేదన్న క్రమశిక్షణ కమిటీ

మంత్రి పదవి నుంచి తొలగించాలని సిఫార్సు

ఇక హైకమాండ్ నిర్ణయమే కీలకం



ఏంటో అనుకున్నారు.. ఏదో జరుగుతుందని ఎదురు చూశారు.. చివరికి కాంగ్రెస్‌లో క్రమశిక్షణ కమిటీ నిర్ణయం ఇప్పుడు కొత్త చర్చకు తెరతీసింది. తప్పు చేస్తే చర్యలు తప్పవని సంకేతం ఇచ్చిన కమిటీ.. చిన్నారెడ్డిపై క్రమశిక్షణ చర్యలకు సిద్ధమైంది. మరోవైపు మంత్రి కొండా సురేఖ విషయంలో మాత్రం మరింత కీలకమైన నిర్ణయం తీసుకుంది. పలుమార్లు హెచ్చరించినా వైఖరిలో మార్పు కనిపించలేదని పేర్కొంటూ.. ఆమెను మంత్రి పదవి నుంచి తొలగించాలని కోరుతూ సమగ్ర నివేదికను పీసీసీకి అందించింది. దీంతో ఇప్పుడు అసలు ఉత్కంఠ మొదలైంది. కమిటీ సిఫార్సులపై హైకమాండ్ ఏం చేయబోతోంది? కొండా సురేఖపై వేటు పడుతుందా? చిన్నారెడ్డిపై ఎలాంటి చర్య ఉంటుంది? అన్న ప్రశ్నలు కాంగ్రెస్‌లో హాట్‌టాపిక్‌గా మారాయి.

హైదరాబాద్ బ్యూరో (సింగిడి)

2

## క్యూఆర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్

నిర్మాణానికి వడివడిగా అడుగులు

15 నియోజకవర్గాల్లో టెండర్ పక్రియ పూర్తి

ఈ నెల 27 నుంచి 30 వరకు పారదర్శకంగా లక్కీ డ్రా

సెప్టెంబర్ 3 వరకు దరఖాస్తుల స్వీకరణ

మంత్రి పొంగులేటి

2



## 22ఎ భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణ



పొంగులేటిని వెంటనే బర్తర్ఫ్ చేయాలి

బిఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్

**హైదరాబాద్,ఆగస్ట్25 (సింగిడి):**
మొత్తం 22ఎ నిషేధిత భూముల అక్రమాలపై తక్షణమే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, అసలు ఈ భూములను ఎవరు నిషేధిత జాబితాలో పెట్టమన్నారో నిజాలు బయటపడాలని బిఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్ చేశారు.

2

## విద్యార్థుల జీవితాలతో ఆటలొద్దు



ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

సిఎం రేవంత్‌కు బాధ్యతారాహిత్యం కూడదు

బిజెపి సభలో ఎంపి ఈటల రాజేందర్ విమర్శలు

స్వల్పంగా దెబ్బతిన్న రామచంద్ర రావు ఆరోగ్యం

2

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
బుధవారం
26 ఆగస్టు 2026




## 60 రోజుల బయలాట నాటక శిక్షణ ముగింపు

**నారాయణపేట ఆగస్టు 25 (సింగిడి)**

నారాయణపేట జిల్లా మద్దూర్ మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన 60 రోజుల బయలాట నాటక శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. జూన్ 25న ప్రారంభమైన ఈ శిక్షణ శిబిరంలో కళాకారులకు రెండు నెలల పాటు బయలాట నాటకంపై శిక్షణ అందించారు. అంతరించిపోతున్న జానపద కళలను పరిరక్షించి, వాటిని పల్లె ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, బీజీఏ థియేటర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజీఏ థియేటర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీకాంత్ కాడం ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగగా, ట్రైనర్ కాడం బుగ్గప్ప కళాకారులకు శిక్షణ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళలకు ఆదరణ పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు.

## త్వరత్వరగా మూసీ భూసేకరణ

ప్రాజెక్టలకు అతి తక్కువ వడ్డీకి వచ్చే రుణాలపైన మునిసిపల్ కమిషనర్‌లు దృష్టి సారించాలని సీఎం తెలిపారు. టీడీఆర్‌పై ప్రతి వారం సమీక్ష జరగాలని చెప్పారు. మంచిరేవుల ఓంకారేశ్వరస్వామి ఆలయం టెండర్లు తక్షణం పిలవాలని ఆదేశించారు. కొత్వాల్ గూడా బర్డ్స్ పార్క్‌కు మరింత ప్రచారం కల్పించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచనలు చేశారు. త్వరగా పనులు జరిగేలా చూడాలన్నారు. పనుల్లో ఆలస్యం తగదని, నిర్ణీత సమయంలోగా ప్రాజెక్టుల పూర్తికి ముందుకు సాగాలని అన్నారు. హెచ్ఆర్‌డి బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమీక్షా సమావేశానికి సీఎం కార్యదర్శి మాణిక రాజ్, హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినరు కృష్ణా రెడ్డి, సైబరాబాద్ కమిషనర్ సృజన, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి, ఎంఆర్డీసీఎల్ ఎండీ ఈ.వి. నరసింహ రెడ్డి, ఎంఆర్డీసీఎల్ జేఎండీ గౌతమి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## సిఎం రేవంత్ యూఎస్ పర్యటనపై వివరణ ఇవ్వాలి

**ఎందుకు అమెరికా పర్యటనో వివరంగా చెప్పాలి**

**మేయర్ మమ్దానీని ఎందుకు కలవాలనుకున్నారో చెప్పాలి**

**నిబంధనల మేరకే కేంద్ర విదేశాంగశాఖ నిర్ణయాలు**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ,ఆగస్ట25 (సింగిడి):**

అమెరికా పర్యటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్లారిటీ ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయ కారణాలతోనే తన యూఎస్ పర్యటనను కేంద్రం అడ్డుకుందంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కిషన్ రెడ్డి తోసిపుచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలో ఆయన స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం అని కొట్టిపారేశారు. అనుమతులు లేకుండా ఎందుకు విదేశీ పర్యటనకు వెళ్లారంటూ తెలంగాణ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి.. స్థాయికి తగినట్లుగా ఈ పర్యటన లేదని తెలిపారు. ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనపై తాము కొత్తగా నిబంధనలు పెట్టలేదని గుర్తు చేశారు. స్వాతంత్ర్యనుంచి ఉన్న నిబంధనలే తాము అమలు చేశామని స్పష్టం చేశారు. ఇది సాధారణ ప్రక్రియ.. ఇందులో రాజకీయాలకు తావు లేదన్నారు. భారత్‌పై విషం చిమ్మే వ్యక్తి న్యూయార్క్ మేయర్ మామ్దానీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ కానున్నారంటూ వార్తలు వచ్చాయని వివరించారు. ప్రధాని మోదీని టెర్రరిస్ట్ అని న్యూయార్క్ మేయర్ వ్యాఖ్యనించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మామ్దానీను ఎందుకు కలుస్తున్నారో.. సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో తన విదేశీ పర్యటనను కూడా కేంద్ర విదేశాంగ శాఖ నిరాకరించిందని కిషన్ రెడ్డి తెలిపారు. మన దేశ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని విదేశాంగ శాఖ ఈ నిర్ణయం తీసుకుందని అభిప్రాయపడ్డారు. గుజరాత్ సీఎంకు యూఎస్ పర్యటనకు అనుమతి ఇచ్చి.. తమకు అనుమతి ఇవ్వలేదని సీఎం రేవంత్ వాదించడం వితండవాదమని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ సీఎంగా ఉన్నప్పుడు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన విదేశీ పర్యటనను నిరాకరించిందని చెప్పారు. అయితే సీఎం రేవంత్ రెడ్డికి హార్వర్డ్ బిజినెస్ కోర్సు చదివేందుకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలను కూడా గతంలో రద్దు చేసిందని చెప్పారు. కుల గణన అంశంలో తెలంగాణ ప్రభుత్వం ఫెయిల్యూర్ అయిందని తెలిపారు. హైదరాబాద్‌లో 20 శాతం ఇళ్లలో కులగణన జరగలేదని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి కుల గణనపై అవగాహన లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు.

## తెలంగాణ మోడల్‌లో కులగణన

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కులాల లెక్కింపు విధానాలతో తీవ్ర నష్టం జరుగుతోందని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. 'ఒకే కులం వేర్వేరు పేర్లతో విడిపోయి లక్షలాది కులాల పేర్లుగా నమోదవుతాయని.. దీనివల్ల లెక్కింపు డేటా పూర్తిగా నిరుపయోగంగా మారుతుందని తెలిపారు. ప్రశ్నావళిలో 'వెనుకబడిన వర్గాలు' అనే పదమే లేకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ తరహాలోనే బీసీ, ఓబీసీ కులాల నమోదుకూ 'డ్రాప్-డౌన్ జాబితా' విధానాన్ని ఉపయోగించాలని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే సూచించారు. తెలంగాణ (2024), బిహార్ (2022) సర్వేల్లో వాడిన కులాల జాబితా నమూనాలను ప్రధానికి పంపించారు. ప్రస్తుత గందరగోళ ప్రశ్నావళిని వెంటనే రద్దు చేసి, అన్ని పార్టీలు - నిపుణులతో చర్చించి ఓ కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని ఖర్గే, రాహుల్ డిమాండ్ చేశారు. ఇదిలావుంటే రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను అంతం చేయడానికి మోదీ ప్రభుత్వం కుట్రపన్నిందని, దీనిలో భాగంగానే కేంద్రానికి చెందిన వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 8.2లక్షలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేయడంలేదని కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. మంత్రిత్వ శాఖల వారీగా ఖాళీగా ఉన్న పోస్టులపై మీడియా నివేదికను ఉటంకిస్తూ విమర్శలు సంధించారు. '2015లో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 4.21లక్షల ఉద్యోగాలు భర్తీకాకుండా ఉన్నాయి.2024కు వాటి సంఖ్య 8.24 లక్షలకు చేరాయి. రైల్వేల్లో 2.40లక్షలు, కేంద్ర హోంశాఖ పరిధిలో 1.10 లక్షలు ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉంది. ప్రభుత్వ రంగ సంస్థల్లోని 5.1 లక్షల శాశ్వత ఉద్యోగాలను రద్దు చేశారు. ఇవికాక రక్షణ రంగంలో 2.41 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఖర్గే తెలిపారు. ఒప్పంద ఉద్యోగులు 19శాతం నుంచి 49శాతానికి పెరిగారని వెల్లడించారు. ఇది ఒక్క ఉపాధి సమస్య మాత్రమే కాదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన సామాజిక న్యాయం అంశం కూడా ఇమిడి ఉందనిపేర్కొన్నారు. విద్య, ఉపాధి రంగాల్లో యువ భారతీయుల జీవితాలను మోదీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. దేశంలో 15 నుంచి 29 ఏళ్ల వయసు గల 8.7 కోట్ల మంది యువత చదువులు, ఉపాధికి దూరమయ్యారని, వారికి ఎటువంటి నైపుణ్య శిక్షణలూ అందడంలేదన్నారు. నీతిఆయోగ్ నివేదికను ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో గత 40 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగుల శాతం పెరిగిందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంకా గాంధీ విమర్శించారు.

# భవిష్యత్ తరానికి బాధ్యతలు అప్పగించాల్సి ఉంది

**న్యూఢిల్లీ,ఆగస్టు 25 (సింగిడి):**

కేంద్ర మంత్రిమండలిలో మార్పులు చేర్పులపై గత కొంతకాలంగా ఊహాగానాలు వినిపిస్తున్న వేళ కేంద్రమంత్రని నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు రాజకీయకాకను రేపుతున్నాయి. యువతరానికి బాధ్యతలు అప్పగించాల్సన సమయం వచ్చిందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్తతరానికి బాధ్యతలు అప్పగించాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ మేరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గడ్కరీ తాజా వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. నేను చేయాలనుకున్నంత కాలం పనిచేశాను. ప్రస్తుతం నేను మునుపటిలా పనిచేయలేకపోతున్నా. ప్రజాపనుల్లో ప్రమేయం తగ్గిపోయింది. ఆ పనిని కొత్త తరాలకు అప్పగించాలి. కొత్తవారికి సీనియర్లు మార్గనిర్దేశం చేస్తున్నారు. నేను గత 30 ఏళ్లుగా ప్రజాజీవితంలో ఉన్నాను. ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాను. అవార్డులూ అందుకున్నాను అని గడ్కరీ గుర్తుచేసు కున్నారు. అలాగే అభివృద్ధి కార్యక్రమాల గురించి మాట్లాడారు. భవిష్యత్‌లో అభివృద్ధి పనుల సంఖ్య మరింత పెరుగుతుందని చెప్పారు. మహారాష్ట్రలో ప్రతి ఆదివాసీ గ్రామానికి విద్యుత్ సదుపాయాన్ని కల్పించడమే తన లక్ష్యమన్నారు. త్వరలోనే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగనున్నట్లు కేంద్రమంత్రి రామ్‌దాస్ అఠవాలే వెల్లడించిన సంగతి తెలిసిందే. భాజపా, మిత్రపక్షమైన ఎన్‌సీపీకి చెందిన కొత్త వారిని మంత్రివర్గంలోకి తీసుకుంటారనే ప్రచారం జరుగుతోంది. సంస్థాగతంగానూ భాజపాలో భారీ మార్పులు జరిగిన సంగతి తెలిసిందే. మరోవైపు.. 20శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకాన్ని ప్రోత్సహిస్తోన్న నితిన్ గడ్కరీ ఆ విషయంలో విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ20 పెట్రోల్‌తో తన కుటుంబం లబ్ది పొందుతోందంటూ పలువురు నెటిజన్లు ఆన్‌లైన్‌లో డీప్‌ఫేక వీడియోలు, పోస్టులు పెడుతున్నారని బాంబే హైకోర్టును కూడా ఆశ్రయించారు. తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. ఈ నేపథ్యంలో ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ వార్తల వేళ గడ్కరీ మాటలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో గడ్కరీ మాట్లాడుతూ.. దాదాపు మూడు దశాబ్దాలుగా ప్రజా జీవితంలో కొనసాగుతున్నానని గుర్తు చేసుకున్నారు. గతంలో పార్టీ, ప్రభుత్వం కోసం విస్తృతంగా పని చేశానని.. ఇప్పుడు తన చురుకైన పాత్రను క్రమంగా తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. యువతకు బాధ్యతలు అప్పగించి, వారు పని చేసే అవకాశాన్ని కల్పించాలన్న అభిప్రాయాన్నీ ఆయన వ్యక్తం చేశారు. ఇకపై తీవ్రమైన పాలనాపరమైన ఒత్తిళ్ల కంటే సామాజిక సంక్షేమం, గిరిజన ప్రాంతాలు, రైతుల శ్రేయస్సుపైనే దృష్టి సారిస్తానంటూ నితిన్ గడ్కరీ సంకేతాలు ఇచ్చారు. మహారాష్ట్రలో ఏ గిరిజన గ్రామమూ విద్యుత్ సౌకర్యానికి దూరంగా ఉండకూడదన్న లక్ష్యాన్నీ గడ్కరీ ప్రస్తావించారు. 'చేసినంత కాలం చేశాను.. ఇప్పుడు కొత్త తరానికి అవకాశం ఇవ్వాలి' అని అన్నారు. గడ్కరీ చేసిన ఈ వ్యాఖ్యలు బీజేపీలో జరుగుతున్న తరాల మార్పుపై మరోసారి చర్చకు దారితీశాయి. ఇటీవల పార్టీ సంస్థాగత స్థాయిలో చోటుచేసుకున్న మార్పుల నేపథ్యంలో కేంద్ర మంత్రి తాజా వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.

# క్యూఆర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్

**హైదరాబాద్,ఆగస్ట్25 (సింగిడి):**

హైదరాబాద్ మహా నగరంలోని క్యూర్ పరిధిలో సొంతింటి కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాల కలలను నిజం చేసే దిశగా ప్రభుత్వం మరో కీలక అడుగుముందుకు వేసిందని పేదవాడికి కూడా నగరంలో సొంత ఇల్లు ఉండాలని, ఆత్మగౌరవంతో జీవించాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ కార్యక్రమాన్ని వేగవంతం చేశామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం సచివాలయంలో హౌసింగ్ శాఖ ఉన్నతాధికారుల తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పురోగతి, లబ్ధిదారుల ఎంపిక, లక్కీ డ్రా నిర్వహణ, కొత్త నియోజకవర్గాల్లో దరఖాస్తుల స్వీకరణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే టెండర్లు పక్రియను పూర్తిచేశామని వెల్లడించారు. క్యూఆర్ పరిధిలోని తొలి విడతలో ప్రయోగాత్మకంగా 16 నియోజకవర్గాల్లో 807.40 కోట్ల అంచనా వ్యయంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని ఇందుకోసం జూన్ 20 నుంచి ఆగస్టు 15 తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించగా మొత్తం 60,720 దరఖాస్తులు అందాయని, వచ్చిన .దరఖాస్తులపై 360 డిగ్రీల క్షేత్రస్థాయి పరిశీలన, సమగ్ర విచారణ అనంతరం 40,900 మందిని అర్హులుగా, 19,820 మందిని అనర్హులుగా గుర్తించామన్నారు. అనర్హతకు గల కారణాలను దరఖాస్తుల వారీగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు మంత్రి గారు తెలిపారు ఈ నెల 27, 28, 29, 30 తేదీల్లో ఆయా ప్రాంతాల్లోని ప్రత్యేక ఫంక్షన్ హాళ్లలో ప్రజలు, అర్హులైన దరఖాస్తుదారుల సమక్షంలోనే పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహిస్తామని ప్రతి కేంద్రానికి ఒక ప్రత్యేక పర్యవేక్షణాధికారిని కూడా నియమించామని తెలిపారు. లక్కీ డ్రా ద్వారా లబ్దిదారుల తుది జాబితా ప్రకటించిన తర్వాత ఎంపిక కాని దరఖాస్తుదారులకు వారు చెల్లించిన రూ. 10,000 ఈఎండీ మొత్తాన్ని వెంటనే వారి ఖాతాల్లోకి తిరిగి జమ చేస్తామని మంత్రి గారు స్పష్టం చేశారు. 27వ తేదీన రాయదుర్గం, కెపిహెచ్‌బి కాలనీ, మైలార్‌దేవరపల్లి, రెడ్ హిల్స్, 28న కొకూర్,పాటిగెడ్డ,జల్‌పల్లి, కుల్సుంపుర , 29న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కోలనీ, బోయన్‌పల్లి, బండ్లగూడ ( ఎల్ఐజి కాలనీ), నందిముసలిగుడ, 30వ తేదీన గాజుల రామారం, అంబర్‌పేటలోని సిటీపోలీస్ లైన్స్, గడ్డిన్నారం, ఆర్/బి క్వార్టర్స్,పోచారం ( ఎల్ఐజి కాలనీ)లో లక్కీడ్రా నిర్వహిస్తారని మంత్రి గారు తెలిపారు.క్యూర్ పరిధిలో కొత్తగా మరో నాలుగు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి స్థలాలను ఎంపిక చేశామని తెలిపారు .ఒక్కో నియోజకవర్గంలో 480 ఇళ్ల చొప్పున మొత్తం 1,920 ఇళ్లను నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం లో హయత్‌నగర్ గ్రామంలోని అమంగల్, గోషామహల్ నియోజకవర్గంలోని నాంపల్లి, ముషీరాబాద్ నియోజకవర్గంలోని జమిస్తాన్‌పూర్ (ఆర్టీసీ క్వార్టర్స్), చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని బండ్లగూడలో (ఫలకనుమా సమీపంలో) ఇళ్లు నిర్మించేందుకు వీలుగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ నాలుగు నియోజకవర్గాల పరిధిలోని అర్హులైన ప్రజలు ఇందిరమ్మ టవర్స్ కోసం సెప్టెంబర్ 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మంత్రి పొంగులేటి తెలిపారు. గతంలో 16 నియోజకవర్గాలకు వర్తింపజేసిన నిబంధనలే ఈ కొత్త దరఖాస్తులకూ వర్తిస్తాయన్నారు. ఇందిరమ్మ టవర్స్ ప్రత్యేకత కేవలం అపార్ట్‌మెంట్‌లో ఒక ఇల్లు ఇవ్వడంలోనే లేదని నగరంలో విలువైన భూమిపై ఒక కుటుంబానికి శాశ్వత ఆస్తి, భద్రమైన భవిష్యత్, ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు.

# 22ఎ భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణ

ప్రభుత్వం వెంటనే ఈ వ్యవహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలని, నిషేధిత జాబితాను వెబ్‌సైట్‌లో ఎందుకు బ్లాక చేశారో సమాధానం చెప్పాలని అన్నారు. ప్రజల భూములతో చెలగాటమాడుతున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ముఖ్యమంత్రి తక్షణమే బర్తరఫ్ చేయాలని కోరారు. బాధితుల పక్షాన నిలబడి సెప్టెంబర్ 7న ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తామని, సభను స్తంభింపజేసి అయినా బాధితులకు న్యాయం జరిగేలా పోరాడతామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన తమ్ముడికి మాత్రం వందల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను కట్టబెడతారని, సామాన్య ప్రజల ఆస్తులను మాత్రం 22ఎలో పెట్టి ఇబ్బందుల పాలు చేస్తారని హరీశ్ రావు విమర్శించారు. చివరికి అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్, సీఎం ఇల్లు కూడా 22ఎ నిషేధిత జాబితాలోనే ఉన్నాయంటే ఈ ప్రభుత్వ పనితీరు ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ప్రభుత్వ భూములున్నా హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, హౌసింగ్ బోర్డు భూములతో పాటు పిల్లలు ఆడుకునే వెయ్యి గజాల పార్కును కూడా రేవంత్ రెడ్డి అమ్మకానికి పెట్టారని, ఇలా అమ్ముకుంటూ పోతే రేపు బడికి, గుడికి, చివరకు స్మశాన వాటికకు కూడా భూమి మిగలదని ధ్వజమెత్తారు. కమిషన్ల కక్కుర్తి కోసమే సామాన్య ప్రజల ఆస్తులను ప్రభుత్వం నిషేధిత జాబితాలోకి నెట్టిందని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ ఎం.జే. గార్డెన్స్‌లో 22ఎ భూముల సమస్యలతో సతమతమవుతున్న బాధిత కుటుంబాల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, గోరేటి వెంకన్న తదితరులతో కలిసి బాధితుల ఆవేదనను స్వయంగా అడిగి తెలుసుకున్న హరీశ్ రావు, బీఆర్ఎస్ పార్టీ పక్షాన వారికి పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై పదునైన విమర్శలు గుప్పించారు. 22ఎ కుట్ర వెనుక భారీ కమిషన్ల బాగోతం దాగి ఉందన్న ఆయన, ఈ అక్రమాల్లో ఏ-1గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏ-2గా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారని ఆరోపించారు. 50-50 కమిషన్ల కోసమే లక్షలాది మంది ప్రజలను నిద్రలేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. 98 శాతం భూములను 22ఎ జాబితా నుంచి తొలగించామని మంత్రి పొంగులేటి పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని, అదే నిజమైతే వందలాది మంది బాధితులు తమ గోడు వెళ్లబోసుకోవడానికి ఇక్కడికి ఎందుకు వస్తారని ప్రశ్నించారు.

## విద్యార్థుల జీవితాలతో ఆటలొద్దు

**హైదరాబాద్,ఆగస్టు 25 (సింగిడి):**

20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి అంటే అర్థం ఏంటో తెలుసా అని ప్రశ్నించారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల గురించి ఆలోచించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిదేనని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. 'ఫీజు బకాయి - భాజపా లడాయి' పేరుతో భాజపా చేపట్టిన కార్యక్రమంలో ఈటల పాల్గొని మాట్లాడారు. సీఎం ఒకసారి రాష్ట్రంలోని విద్యార్థుల పరిస్థితి గురించి ఆలోచించాలన్నారు. 20లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడే బాధ్యతను భాజపా తీసుకుందని పేర్కొన్నారు. 'నా విద్యార్థులు, నా యువత క్వాలిటీగా ఉండాలి.. ఆరోగ్యవంతులుగా ఉండాలి' అని కలలు కంటున్న నాయకుడు నరేంద్ర మోదీ అని వివరించారు. పేద తల్లిదండ్రుల పిల్లలు కూడా గొప్పగా చదువుకొని డాక్టర్లు, ఇంజనీర్లు, అడ్వకేట్లు, ఉన్నతాధికారులు కావాలని కలలు కంటున్నారని, అదే నిజమైన తెలంగాణ అభివృద్ధిగా పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం రామచందర్ రావు చేస్తున్న ఈ 48 గంటల దీక్షకు బీజేపీ అండగా ఉందన్నారు. ఫీజుల బకాయిలు చెల్లించే వరకు.. తెలంగాణ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు భాజపా పోరాటం కొనసాగుతుందని తెలిపారు. నిరాహార దీక్ష చేస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అస్వస్థతకు గురయ్యారు. రామచందర్ రావును పరీక్షించిన వైద్యులు.. బీపీ 90/60గా ఉన్నట్లు తెలిపారు.'ఫీజు బకాయి-భాజపా లడాయి' పేరుతో భాజపా నేతలు రెండో రోజు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. రామచందర్ రావు దీక్షకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజిగిరి ఎంపీ ఈటలరాజేందర్, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకట రమణా రెడ్డి, పాయల్ శంకర్, రామారావు పటేల్ పలువురు భాజపా నేతలు మద్దతు తెలిపారు.

## శ్రీశైలం వడ్డెర సత్రంలో దారుణం

**నంద్యాల,ఆగస్టు 25 (సింగిడి):**

శ్రీశైలంలో విషాద ఘటన చోటు చేసుకుంది. శ్రీశైలం వడ్డెర అన్నదాన సత్రంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. గత 3 రోజులుగా రూమ్ నుంచి బయటకు రాకపోవడంతో పాటు దుర్వాసన రావడంతో అనుమానం వచ్చిన సత్రం నిర్వాహకులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని తలుపులు తెరచి చూడగా బాత్రూమ్‌లో ముగ్గురు మహిళలు, ఫ్యాన్‌కు ఇద్దరు పురుషులు ఉరివేసుకొని కనిపించారు. మృతులు సుధాకర్(36), గోగుల ఆదిలకి (50), మల్లేశ్వరి(45), శ్రీదేవి(33), మణికంఠ(15)గా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు. శ్రీశైలం వడ్డెర సత్రంలో సంఘటనా స్థలాన్ని ఆలయ ఈవో శ్రీనివాసరావు, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ రమేష్ నాయుడు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక పరిశీలించారు. సుధాకర్ కుటుంబ సభ్యులు.. గత నెల 28వ తేదీన శ్రీశైలం వడ్డెర సత్రం రూమ్ నెంబర్ 11లో రూ. 800 చెల్లించి అద్దెకు తీసుకున్నారు. రెండు రోజుల తర్వాత ఖాళీ చేయాలని సత్రం నిర్వాహకులు చెప్పినప్పటికీ.. అనారోగ్యంతో వచ్చామని, మరికొద్ది రోజులు ఉండి పూజలు చేయించుకుంటామని సుధాకర్ చెప్పినట్లు సమాచారం. రోజుకు 800 రూపాయలు చెల్లిస్తూ వడ్డెర సత్రంలోనే సుధాకర్ కుటుంబ సభ్యులు ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. మృతులు సత్యసాయి జిల్లా బత్తలపల్లి గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. ఐదుగురి మృతదేహాలను కిందకు దించిన శ్రీశైలం పోలీసులు.. శవ పరీక్షల కోసం సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే, నిబంధనలకు విరుద్ధంగా వడ్డెర సత్రం యాజమాన్యం.. యాత్రికులకు నెల రోజులపాటు రూమును ఎందుకు అద్దెకు ఇచ్చారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతిచెందిన వ్యక్తులు శ్రీశైలంలో నెల రోజులపాటు ఎందుకు ఉన్నారనే కోణంలోనూ విచారణ చేపట్టారు.

# హైకమాండ్ కంట్రోలేంటి..

**క్రమశిక్షణకు కొరడా..**

కాంగ్రెస్‌లో పార్టీ క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యం ఉందని కమిటీ స్పష్టం చేసింది. పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా వ్యవహరించే నేతలపై చర్యలు తప్పవని కమిటీ ఛైర్మన్ మల్లు రవి తేల్చిచెప్పారు. దీంతో ఇకపై పార్టీ లైన్ దాటే నేతల విషయంలో కఠిన వైఖరి ఉంటుందన్న సంకేతాలు వెలువడ్డాయి.

**చిన్నారెడ్డిపై చర్యలు..**

క్రమశిక్షణ ఉల్లంఘనకు సంబంధించి చిన్నారెడ్డిపై చర్య తీసుకుంటున్నట్లు కమిటీ వెల్లడించింది. పార్టీ వ్యవహారాల్లో క్రమశిక్షణను పాటించాల్సిందేనని స్పష్టం చేస్తూ.. ఈ విషయంలో రాజీకి తావులేదన్న సందేశాన్ని ఇచ్చింది. దీంతో చిన్నారెడ్డి విషయంలో తదుపరి ప్రక్రియ ఎలా ఉండబోతుందన్న ఆసక్తి నెలకొంది.

**కొండా సురేఖపై సీరియస్..**

మంత్రి కొండా సురేఖ వ్యవహారంలో మాత్రం కమిటీ మరింత కీలకంగా స్పందించింది. ఆమె వైఖరిపై పలుమార్లు హెచ్చరికలు ఇచ్చినా మార్పు కనిపించలేదని కమిటీ పేర్కొంది. దీంతో ఆమెను మంత్రి పదవి నుంచి తొలగించాలని కోరుతూ సమగ్ర నివేదికను పీసీసీకి సమర్పించింది.

**ఇక నిర్ణయం హైకమాండ్‌దే..**

కమిటీ తన అభిప్రాయాన్ని స్పష్టం చేసింది. నివేదికను పీసీసీకి కూడా అందించింది. ఇప్పుడు తుది నిర్ణయం హైకమాండ్ తీసుకోవాల్సి ఉంది. కమిటీ సిఫార్సులను నాయకత్వం యథాతథంగా అమలు చేస్తుందా? లేక మరోసారి సమీక్షిస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

**వేటు పడుతుందా?**

కాంగ్రెస్‌లో క్రమశిక్షణ విషయంలో ఈ నిర్ణయం కీలక సంకేతంగా మారింది. ఒకరిపై చర్యలు.. మరో నేతపై మంత్రి పదవి నుంచి తొలగింపు సిఫార్సు.. దీంతో పార్టీ అధిష్ఠానం తదుపరి అడుగు ఎలా ఉంటుందన్న ఉత్కంఠ పెరిగింది. కమిటీ కొరడా సిద్ధం చేసింది.. మరి హైకమాండ్ ఝుళిపిస్తుందా? అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న.

## అమెరికా చదువులపై విద్యార్థుల్లో అనాసక్తి

**వాషింగ్టన్,ఆగస్టు 25 (సింగిడి):**

ట్రంప్ తీరుతో అమెరికాలో ఉంటున్న భారతీయులకు, అమెరికా వెళ్లాలనుకుంటున్న విద్యార్థులకు సైతం విసుగు వస్తోంది. పదేపదే ఏదో ఒక ఆంక్ష కారణంగా అక్కడి విశ్వవిద్యాలయాలు కూడా ఆర్థికంగా దెబ్బతింటున్నాయి. భారతీయ విద్యార్థుల రాక తగ్గిందని అక్కడి సంస్థలు ఆందోళన చెందుతున్నాయి. మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, ఆంక్షలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు. దీంతో ఆ దేశానికి వెళ్లాలనుకునే భారత విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. 'కామన్ యాప్' నివేదికల ప్రకారం.. 2024-25 విద్యా సంవత్సరంలో వివిధ అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులలో 3.63 లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు చేరారు. ఇక 2025-26లో అమెరికా కళాశాలల్లో కోర్సులలో ప్రవేశం కోరే భారత విద్యార్థుల సంఖ్య 15శాతం పడిపోయింది. మరోవైపు 2026 సెమిస్టర్‌లో అమెరికా కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అంతర్జాతీయ విద్యార్థుల నమోదులో కూడా 1.1 లక్షల తగ్గుదల కనిపించింది. 2025-26లో ఈ సంఖ్య 11.69 లక్షలుగా అంచనా వేయగా.. ఈ ఏడాది ఆ సంఖ్య 10.57 లక్షలకు చేరింది. కఠినమైన వీసా నిబంధనలు, చదువు పూర్తయిన తర్వాత ఉపాధి అవకాశాలపై అనిశ్చితి, సోషల్ మీడియా వెట్టింగ్ వంటి అంశాలే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. అయితే తాజా ఆంక్షల వార్తల కారణంగా అమెరికాలో ఉద్యోగం చేయాలన్న వారి సంఖ్య క్రమంగా తగ్గుతోంది. అలాగే అక్కడ చదువుకోవాలన్న ఆశను కూడా వదులుకుంటున్నారు. ఓపిటి నిబంధలను కఠినతరం చేయడం, వీసా ఫీజులు పెంచి నిబంధనలు మరింత క్లిష్టంగా మార్చడంతో భారతీయ విద్యార్థులు అమెరికావైపు చూసేందుకు ఇష్టపడడం లేదని సర్వేలు చెబుతున్నాయి. అమెరికా ఫస్ట్ నినాదంతో ట్రంప్ ఊగిపోతున్నాడు. అమెరికన్లకే శిక్షణ ఇవ్వాలని అక్కడి టెక్కీ సంస్థలపై ఒత్తిడి పెంచుతున్నారు. హెచ్-1బి వీసాల పై ట్రంప్ ప్రభుత్వం విధించిన కొత్త రుసుమును అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సమర్థించారు. కంపెనీలు విదేశీ ఉద్యోగులను తీసుకోకుండా.. అమెరికన్లను నియమించుకోవాలని సూచించారు. వారికి మెరుగైన శిక్షణ ఇవ్వాలన్నారు.

## నగరంలో నకిలీ వైద్యుల దందా

ఎటువంటి అర్హత లేకపోయినా రోగులకు అల్లోపతి వైద్యం అందిస్తూ ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. వీరు నగరంలో ఎక్కడెక్కడ క్లినికలునిర్వహిస్తున్నారు ఏయేవిశ్వవిద్యాలయాల నుంచి నకిలీ సర్టిఫికెట్లు పొందుపరిచారు రోగులకు ఎలాంటి వైద్యం, మందులు అందిస్తున్నారు అనే కీలక అంశాలపై పోలీసులు ప్రస్తుతం లోతుగా విచారణ జరుపుతున్నారు. అర్హత లేని నకిలీ వైద్యుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. నకిలీ ధ్రువపత్రాలతో వీరంతా వైద్యులుగా చలామణి అవుతున్నారు. ఇలా 11 మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ జోన్లలో ప్రత్యేక ఆపరేషన్ పేరిట పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అర్హత లేకున్నా క్లినికలుఏర్పాటు చేసి ప్రజలకు సెలైన్లు, ఇంజక్షన్లు, మందులు ఇస్తున్నట్లు గుర్తించినట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ తెలిపారు. పారామెడికల్ కోర్సు చేసిన ఓ మహిళ అనుమతులు లేకుండా నాలుగేళ్లుగా క్లినిక నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. పట్టుబడిన 11 మంది నకిలీ వైద్యులను అదుపులోకి తీసుకుని మందులను స్వాధీనం చేసుకున్నారు.

## ఫీజులే చెల్లించరు.. విదేశీ విద్య ఎలా వస్తుంది

ప్రపంచ ప్రఖ్యాత విద్యా సంస్థలను రప్పిస్తాననడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ సర్కార్‌పై కేంద్ర మంత్రి బండి సంజరు కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. లక్షలాది మంది విద్యార్థులు పడుతున్న మానసిక క్షోభ సీఎంకు పట్టదా అని నిలదీశారు. 'సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీ యాజమాన్యాలు.. విద్యార్థులకు చేస్తున్న అవమానాలు కనిపించడం లేదా ఫీజు బకాయిలు అడిగితే కాలేజీ యాజమాన్యాలను బెదరించడం తప్ప కాంగ్రెస్ సర్కార్ సాధించిందేమిటన్నారు. ఫీజు రీయింబర్స్ బకాయిల వల్ల దళిత, గిరిజన, బలహీనవర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నా పట్టదా ఇందిరమ్మ రాజ్యమంటే దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాల పిల్లలకు ఉన్నత విద్యకు దూరం చేయడమేనా వన్ టైం సెటిల్‌మెంట్ కింద బకాయిలన్నీ చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైంది' అంటూ బండి సంజరు ప్రశ్నల వర్షం కురిపించారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
బుధవారం 26-8-2026




## ప్రజల భూములను 22-ఏలో నిషేధిస్తే..

# ప్రజలు నిన్ను నిషేధిస్తారు

- అకారణంగా 22-ఎ నిషేధిత జాబితాలో చేర్చిన కుత్బుల్లాపూర్ భూములను వెంటనే తొలగించాలి
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి.. తప్పు చేసిన వారిని శిక్షించాలి
- మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావు

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 25 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని భూములను అకారణంగా 22-ఎ నిషేధిత జాబితాలో చేర్చిన అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ జరిపి, అర్హులైన భూ యజమానుల భూములను 22-ఎ జాబితా నుంచి తొలగించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని ఎం.జే. గార్డెన్స్‌లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ 22-ఎ బాధితుల సమస్యలపై బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి హరీష్ రావు, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, గోరేటి వెంకన్న, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ లతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టి. హరీష్ రావు మాట్లాడుతూ తెలంగాణలో 22-ఎ సమస్య కేవలం రిజిస్ట్రేషన్ సమస్య కాదు, వేలాది మంది భూ యజమానుల భవిష్యత్తుకు సంబంధించిన సమస్య"



అని తెలిపారు. ఏళ్ల తరబడి కష్టపడి సంపాదించిన డబ్బుతో భూములు కొనుగోలు చేసి, చట్టబద్ధమైన పత్రాలు, పట్టాలు కలిగి ఉండి, పన్నులు చెల్లిస్తున్న ప్రజల భూములను ఒక్కసారిగా 22-ఎ జాబితాలో చేర్చడం వల్ల వారు తమ భూములను అమ్ముకోలేక, రిజిస్ట్రేషన్ చేసుకోలేక, బ్యాంకు రుణాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**"22-ఎ అంటే కేవలం ఒక నంబర్ కాదు, ఒక కుటుంబం భవిష్యత్తుపై పడే తాళం!**

ఒక కుటుంబం తన భూమిని అమ్మి పిల్లల చదువుకు ఖర్చు చేయవచ్చు, కూతురి వివాహం చేయవచ్చు, వ్యాపారం ప్రారంభించవచ్చు, అనారోగ్య సమయంలో వైద్య ఖర్చులు భరించవచ్చు, ఇల్లు నిర్మించుకోవచ్చని హరీష్ రావు పేర్కొన్నారు. ప్రజల భూములను నిషేధిస్తే ప్రజలు నిన్ను నిషేధిస్తారు" అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 22-ఎ అంశంపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని, తప్పు చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. భూభారతి సాక్షిగా ఈ అక్రమాలు జరుగుతు న్నాయి. 2023 డిసెంబర్ నుంచి 22-ఎ జాబితాలో చేర్చిన, తొలగించిన సర్వే నంబర్లపై పూర్తి వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని ఆయన కోరారు. తప్పు చేయలేదని ప్రభుత్వం చెబుతున్నట్లయితే, సంబంధిత శాఖ బాధ్యత వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీ తప్పు లేకపోతే వెంటనే పొంగులేటిని బర్తరఫ్ చేయండి" అని హరీష్ రావు సవాల్ చేశారు. "మీకు రియల్ ఎస్టేట్ తెలుసు అంటే, మాకు పోరాటాలు తెలుసు, ప్రజల పక్షాన ఎలా పోరాడాలో మాకు తెలుసు" అని హరీష్ రావు స్పష్టం చేశారు. 22-ఎ బాధితుల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సెప్టెంబర్ 7వ తేదీలోగా లక్షలాది మందితో అసెంబ్లీని ముట్టడిస్తాం, అసెంబ్లీలో కొట్లాడుతాం, బయట బీఆర్ఎస్ శ్రేణులు పోరాడుతారు, ప్రజలకు కంటికి రెప్పలా బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హరీష్ రావు స్పష్టం చేశారు. రేపు బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బాధ్యులను గుర్తించి శిక్షిస్తాం" అని ఆయన వివరించారు. ప్రజల భూములపై కన్నేస్తే సహించేది లేదు.. ప్రజల హక్కులను హరిస్తే పోరాటం ఆపేది లేదని ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడమే వన మహోత్సవం లక్ష్యం
జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్





**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 25 (సింగిడి):** వన మహోత్సవంలో భాగంగా జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటి, పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని తారా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, అటవీ శాఖ అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. మొక్కలను నాటడం ఒకరోజు కార్యక్రమంగా కాకుండా, వాటిని నిరంతరం సంరక్షించి పెద్దవిగా పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెట్లు పెరిగితేనే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం అందుతుందని పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు, యువత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటుతున్నారని చెప్పారు. అన్ని మున్సిపాలిటీల పరిధిలో ఇంటి వద్ద ,పరిసరాలలో నాటుకునేలా అవసరమైన మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. దీనివల్ల ప్రతి ఇంటి పరిసరాల్లో పచ్చదనం పెంపొందడంతో పాటు పట్టణాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. జిల్లాలో నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేపడుతున్నామని, తద్వారా మొక్కల వివరాలను నమోదు చేసి వాటి సంరక్షణపై పర్యవేక్షణ కొనసాగిస్తామని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి, భావితరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణాన్ని అందించేందుకు అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాద్ రెడ్డి, డీఆర్డీఓ జ్యోతి, డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ లలితాదేవి, పీసీబీ అధికారి విజయలక్ష్మి, హౌసింగ్ పీడీ చలపతిరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తహసీల్దార్ జయరాం నాయక్, అటవీ శాఖ అధికారులు, కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి పట్టణంలో ఘనంగా వనమహోత్సవం

- పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత
- వన మహోత్సవంలో మొక్కలు నాటిన డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి

**సంగారెడ్డి బ్యూరో , ఆగస్టు 25 (సింగిడి):** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భావితరాలకు పచ్చని పర్యావరణాన్ని అందించడమే లక్ష్యంగా అందరూ శ్రమించాలని డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. వనమహోత్సవంలో భాగంగా మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని 33వ వార్డులో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్,వార్డు కౌన్సిలర్, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఖాళీ స్థలాలలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ, పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి, సకాలంలో వర్షాలు కురవడానికి చెట్లే ప్రధాన ఆధారం అన్నారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటిని సంరక్షించి వృక్షాలుగా మార్చే బాధ్యతను కూడా స్థానిక ప్రజలు, యువత తీసుకోవాలని కోరారు. సంగారెడ్డి నియోజకవర్గాన్ని పచ్చదనంతో నింపేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు . ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజులు లేదా శుభకార్యాల సందర్భాల్లో కనీసం ఒక్క మొక్కనైనా నాటి పర్యావరణ ప్రేమికులుగా మారాలని ఆమె ఆకాంక్షించారు. ఈ



కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ కూన వనిత సంతోష్ ,కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి,టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్,కౌన్సిలర్ లు శ్రీకాంత్ గౌడ్, వంశీ, సంగీత మహేష్, రమేష్,అశ్విన్ , కాంగ్రెస్ నాయకులు శివుడు,గడ్డం రాజు, ప్రవీణ్, మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్‌లను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**నాచారం, ఆగస్టు 25 (సింగిడి):** నాచారం సర్కిల్ హెచ్ఎంటీ నగర్ డివిజన్ అన్నపూర్ణ కాలనీ పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను, సరస్వతి నగర్ కాలనీ పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హెచ్ఎంటీ నగర్ మరియు నాచారం డివిజన్లలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిధులు మంజూరు చేయిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సాయిజెన్ శేఖర్, స్థానిక నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువత మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**వికారాబాద్ ప్రతినిధి, ఆగస్టు 25(సింగిడి):** జిల్లా పరిధిలోని కుల్కచర్ల మండల కేంద్రం లోని రైతు వేదికలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుం బాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్‌కార్డుల ద్వారా లబ్ధిదా రులకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతిని ధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్త లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## రుణాల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాలను వంద శాతం సాధించాలి

- అదనపు కలెక్టర్ పాండు

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 25 (సింగిడి):** జిల్లాలో వివిధ రంగాలకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను వంద శాతం సాధించేలా బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలని అదనపు కలెక్టర్ పాండు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూన్ 2026 మాసాంతానికి పంట రుణాలు, వ్యవసాయ మరియు ప్రాధాన్యతా రంగాలకు సంబంధించి బ్యాంకుల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిని అదనపు కలెక్టర్ సమీక్షించారు. పంట రుణాల పంపిణీలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు అన్ని బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. కొన్ని బ్యాంకులు లక్ష్యాలకు అనుగుణంగా రుణాలు అందిస్తున్నప్పటికీ, మరికొన్ని బ్యాంకులు ఆశించిన స్థాయిలో ప్రగతి సాధించడం లేదని పేర్కొన్నారు. బ్యాంకుల పనితీరును క్రమం తప్పకుండా సమీక్షిస్తూ, తదుపరి సమావేశం నాటికి వంద శాతం లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర సంక్షేమ శాఖలతో సమన్వయం చేసుకుని ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు మంజూరు చేసి స్వయం ఉపాధికి చేయూత అందించాలని తెలిపారు. రుణాలు పొందిన లబ్ధిదారులు యూనిట్లను ఏర్పాటు చేశారా లేదా అనే విషయాన్ని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు పూర్తి స్థాయిలో బ్యాంకు లింకేజీ




రుణాలు అందించాలని, సబ్సిడీ రుణాల మంజూరులో ఎలాంటి జాప్యం చేయవద్దని బ్యాంకర్లకు సూచించారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలలో వీధి వ్యాపారులకు రుణాలు అందించేందుకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా బ్యాంకులకు అందిన రుణ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, అర్హత ఉన్న దరఖాస్తులను వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకర్లు, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందేలా చూడాలని అదనపు కలెక్టర్ పాండు సూచించారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం సుధీర్ కుమార్ మాట్లాడుతూ, జూన్ 2026 మాసాంతానికి జిల్లాలో క్రెడిట్-డిపాజిట్ (సీడీ) రేషియో 196.40 శాతంగా నమోదైందని తెలిపారు. జిల్లా వార్షిక రుణ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, నాబార్డ్ ఏజీఎం కృష్ణ తేజ, పరిశ్రమల శాఖ జీఎం తుల్జా నాయక్, ఆర్.బి.ఐ రీజినల్ మేనేజర్, మెప్మా అధికారులు, వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.



## గ్రేవ్ కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం ఉండాలి

జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



**వికారాబాద్ ప్రతినిధి ఆగస్టు 25(సింగిడి):** జిల్లా పోలీస్ కార్యాలయంలో వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ జిల్లాలోని ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో గ్రేవ్ కేసులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లాలో నమోదైన గ్రేవ్ కేసులకు సంబంధించిన కేసు ఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రతి కేసులో ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు పురోగతి, సేకరించిన ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, నిందితుల గుర్తింపు, అరెస్టులు, పెండింగ్‌లో ఉన్న దర్యాప్తు అంశాలు తదితర వివరాల గురించి అధికారులకు ఆరాదిశారు. ప్రతి గ్రేవ్ కేసులో దర్యాప్తు అధికారులు కేసు యొక్క అన్ని కోణాలను పరిశీలించి, శాస్త్రీయ మరియు సాంకేతిక ఆధారాలను సమర్థవంతంగా సేకరించాలని ఎస్పీ గారు సూచించారు. కేసు దర్యాప్తులో ఎలాంటి జాప్యం లేకుండా, ఆధారాలను పకడ్బందీగా సేకరించి, నిందితులకు శిక్ష పడే విధంగా దర్యాప్తును నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా కేసుల దర్యాప్తులో సీసీటీఎన్స్, ఈ సాక్ష్య, సీడీఆర్, ఐపీడీఆర్, సీసీటీవీ ఫుటేజ్, డిజిటల్ మరియు ఇతర సాంకేతిక ఆధారాలను అవసరమైన మేరకు వినియోగించాలని సూచించారు. నేర స్థల పరిశీలన, సాక్షుల విచారణ, ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసులను ప్రాధాన్యతా క్రమంలో తీసుకుని, ప్రతి కేసులో తదుపరి దర్యాప్తు చర్యలకు స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ రాజేశ్ మీనా,ఐపీఎస్ డీసీఆర్బి, డీఎస్పీ జానయ్య, డీటీసీ డీఎస్పీ శ్రీనివాస్, జిల్లాలోని ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## అధైర్యపడకండి..అండగా ఉంటాను..

పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్చెరు, ఆగస్టు 25 (సింగిడి):** జెపికాలనీ డివిజన్ పరిధిలోని బండలగూడ రైల్వే భూముల అంశంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. స్థానిక ప్రజాప్రతినిగా అండగా ఉంటానని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి నిర్వాసితులకు భరోసా అందించారు. సోమవారం సాయంత్రం మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ నేతృత్వంలోని నిర్వాసితుల బృందం ఎమ్మెల్యే జిఎంఆర్ ను కలిసి న్యాయం చేయాలంటూ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ గత 50 సంవత్సరాల నుండి బండలగూడలో గుడిసెలు వేసుకుని నివాసముంటున్న నిరుపేద ప్రజల నివాసాలను రైల్వే భూముల పేరుతో సంబంధిత అధికారులు ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీ చేయడం తగదని అన్నారు. ఈ అంశంపై సంబంధిత రైల్వే అధికారులతో చర్చించడంతోపాటు.. అవసరమైన పక్షంలో భారీ నిరసన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# గచ్చిబౌలిలో కిడ్నాప్ కలకలం

- 4 గంటల్లోనే కేసు చేధించిన పోలీసులు
- ఇద్దరు చిన్నారుల రక్షణ.. నిందితుడి అరెస్ట్

**ఉమ్మడి రంగారెడ్డి బ్యూరో ఆగస్టు 25 (సింగిడి):** గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఒక కిడ్నాప్ ఉదంతంలో పోలీసులు అత్యంత వేగంగా స్పందించారు. ఫిర్యాదు అందిన కేవలం 4 గంటల వ్యవధిలోనే కేసును చేధించి, నాలుగు సంవత్సరాల లోపు ఉన్న ఇద్దరు చిన్నారులను సురక్షితంగా రక్షించారు. ఈ మేరకు శేరిలింగంపల్లి జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. కొండాపూర్ లేబర్ అడ్డా లేబర్ క్యాంప్‌లో కూలీగా పనిచేస్తున్న డేవిడ్ ముర్ము కుమార్తె ప్రమీల ముర్ము (4), మరో కూలీ కుమార్తె సంగీత హేమరామ్ (3)లు లేబర్ క్యాంప్ వద్ద ఆడుకుంటుండగా ఈ ఘటన జరిగింది. అదే క్యాంప్‌లో నివాసముంటున్న చాకు సోరెన్ (45) అనే వ్యక్తి ఆ ఇద్దరు చిన్నారులను బలవంతంగా తీసుకుని పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు వెంటనే స్పందించి కేసు నమోదు చేశారు. చిన్నారుల ఆచూకీ కోసం ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దించారు. నిందితుడు పారిపోయే మార్గాలపై నిఘా పెట్టి, కోల్‌కతా వైపు వెళ్లే రైల్వే స్టేషన్లకు ప్రత్యేక అప్రమత్తత జారీ చేశారు. ఘట్‌కేసర్, జనగామ, కాజీపేట రైల్వే స్టేషన్లతో పాటు జీఆర్పీ, స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారు. సాంకేతిక విశ్లేషణ ఆధారంగా ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో నిందితుడి కదలికలను గుర్తించారు. రైల్వే



అధికారులు, ఘట్‌కేసర్ పోలీసుల సమన్వయంతో చాకు సోరెన్‌ను అదుపులోకి తీసుకుని, ఇద్దరు చిన్నారులను సురక్షితంగా కాపాడారు. రక్షించబడిన చిన్నారులను గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించి, తదుపరి విధివిధానాల ప్రకారం వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పట్టుబడిన నిందితుడు పశ్చిమబెంగాల్ కు చెందిన చాకు సోరెన్ విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెల్లడించాడు. పశ్చిమ బెంగాల్‌లోని కరం డిఘీ పోలీస్ స్టేషన్‌లో హత్యాయత్నం, అత్యాచారం వంటి రెండు క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. పశ్చిమ బెంగాల్‌లోని ఇస్లాంపూర్ జైలులో ఐదేళ్లపాటు శిక్ష అనుభవించాడు. పిల్లలను కిడ్నాప్ చేసి, వారిని భిక్షాటన లేదా ఇతర అవసరాల కోసం డబ్బులకు విక్రయించే నేరాలకు పాల్పడుతున్నట్లు అనుమాని స్తున్నారు. ఈ కోణంలో అతని పూర్వ చరిత్రపై పోలీసులు లోతైన దర్యాప్తు జరుపుతున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ సంఖ్యలో లేబర్ క్యాంపులు, నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో భద్రతా చర్యలపై పోలీసులు ప్రత్యేక సూచనలు జారీ చేశారు. లేబర్ క్యాంపుల్లో నివసించే కార్మికులు, సందర్శకులు, కొత్త వ్యక్తుల రాకపోకలపై పూర్తిస్థాయి రిజిస్టర్ నిర్వహించాలి. సరైన ధృవీకరణ లేకుండా ఎలాంటి గుర్తు తెలియని వ్యక్తులను క్యాంపులోకి అనుమతించకూడదని సూచించారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాలతో పాటు రద్దీ ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి ఎల్లప్పుడూ పనిచేసేలా చూసుకోవాలన్నారు. రాత్రి, తెల్లవారు జామున సమయాల్లో సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఏదైనా చిన్నారి కనిపించకపోతే లేదా అనుమానాస్పద రీతిలో ఎవరైనా పిల్లలతో బయటకు వెళ్తుంటే సెక్యూరిటీ గార్డులు వెంటనే యాజమాన్యానికి, పోలీసులకు సమాచారం అందించా లని సూచించారు. పిల్లల రక్షణ, నేరాల నిరోధంలో ప్రజలు, కాంట్రాక్టర్లు, లేబర్ క్యాంపుల యాజమాన్యాలు పోలీసులకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
బుధవారం
26-8-2026

# ఎడిటోరియల్

Editorial

## పాంచజన్యం పూరించిన కవిత !

కల్వకుంట్ల కవిత.. ఈ పేరు పెద్దగా పరిచయం అక్కర్లేదు. తెలంగాణలో కవిత అంటే బతుకమ్మ అన్న స్థాయిలో ప్రాచుర్యం పొందారు. తెలంగాణ సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా దివిటీ పట్టి వెలగించారు. తండ్రి కెసిఆర్ ఒడిలో రాజకీయ ఓనమాలు దిద్దుకున్న కవిత.. ఇవాళ తండ్రి పార్టీని ధిక్కరించి.. తండ్రినే ఎదిరించి.. నిలదీసే స్థాయిలో.. కొత్తగా పార్టీని ప్రకటించి పాంచజన్యం పూరించారు. ఒక్కరోజు తేడాలో పాత టిఆర్ఎస్ అవిర్భావ దినోత్సవం జరుగనుంది. దానికి రెండ్రోజుల ముందు కవిత తన పార్టీ కోసం ఎంచుకున్న తేదీ యాదృచ్ఛికం కాకపోయినా... ముహూర్త బలం ఉండేవుంటుంది. ఓ మహిళగా కవిత మహిళా లోకానికి బాగా తెలుసు. బతుకమ్మతో తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటారు. తెలంగాణ ఉద్యమం లో మమేకం అయ్యారు. తెలంగాణ ఏర్పడితే అందరూ బాగుపడతారని నమ్మి అంతా కెసిఆర్ జెండా మోసారు. కానీ తెలంగాణ ఆగమయ్యింది. కెసిఆర్ కుటుంబం బాగుపడ్డది. అవినీతిలో ఆరితేరారు. లక్షల కోట్లు వెనకేసుకున్నారు. ఈ అవినీతి, తెలంగాణ ఆకాంక్షలను పక్కదారి పట్టించిన తీరుతోనే కెసిఆర్ పార్టీని ప్రజలు బొంద పెట్టారు. టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా మార్చాక ఉన్న పేగుబంధం కూడా తెగిపోయింది. బిఆర్ఎస్ అవినీతిని ఎదరించిన రేవంత్ రెడ్డి కూడా ఇప్పుడు అదే దారిలో ప్రయాణిస్తున్నారు. రెండున్న రేళ్లు కావస్తున్నా.. ఒక్కటంటే ఒక్క నిర్మాణాత్మక పని చేయలేదు. రేషన్ కార్డులు ఇచ్చాం.. సన్న బియ్యం ఇచ్చాం.. ఇదే పల్లవి. కానీ ప్రజల బాధ మరోలా ఉంది. ధాన్యం కొనడం లేదు. గిట్టుబాటు ధరలు రావడం లేదు. ఉద్యోగాలు దక్కడం లేదు. అవినీతి పెరిగింది. పైసా ఇవ్వనిదే ఫైలు కదలడం లేదు. కిందిస్థాయి నుంచి మంత్రుల వరకు అవినీతి అంటూ ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పేదల ఇళ్లను కూల్చేస్తున్నారు. వెలుగమట్ల ఘటన ఒక్కటి చాలు.. పేదలను ఎంతగా రాచి రంపాన పెట్టారో అర్థం చేసుకోవచ్చు. 50శాతం ఉన్న మహిళలు. 50 శాతం ఉన్న దళిత,గిరిజన, బహుజనులకు రాజ్యాధికారంలో చోటులేదు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో... తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ ఆవిర్భావం అన్నది ఒక అవసరం. ఆవశ్యకత కూడా ఉంది. ప్రజల పక్షాన పోరాడాల్సిన పార్టీ ఒకటి ఇప్పుడు తక్షణా వసరంగా ఉంది. ఎందుకంటే రాజకీయ పార్టీలన్నీ తమ సొంత ఎజెండాతో పనిచేస్తున్నాయి. సొంత వ్యవహారాల కోసం పనిచేస్తున్నాయి. అన్నింటికి మించి అవినీతి, ఆశ్రిత పక్షపాతంలో కూరుకుపోయాయి. కేంద్రంలో అధికారం లో ఉన్న బిజెపి కూడా తెలంగాణకు చేసిందేమీ లేదు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ ఊదరగొట్టుడే తప్ప నిలబడి తెలంగాణ పురోగతికి చేసిందేమీ లేదు. నిత్యం విమర్శలు తప్ప మరో ఎజెండా దానికి లేదు. అందుకే గత ఏడాదిగా ప్రజల్లో తిరుగుతూ.. వారి సమస్యలను వింటూ.. సమస్యలపై పోరాడుతూ వస్తున్న కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేశారు. గతంలో ఓమారు పార్టీ పెడతామని ప్రకటించిన సమయంలో పార్టీ పేరు గురించి అడిగితే.. అప్రయత్నంగానే టిఆర్ఎస్ పేరు కూడా ఖాళీగా ఉందన్నారు. అయితే అంతా టిఆర్ఎస్ పేరును ఓన్ చేసుకుంటుందని భావించారు. కానీ తెలివిగా టిఆర్ఎస్‌నే ప్రకటించినా.. తెలంగాణ రాష్ట్రసేనగా ప్రకటించి ఆశ్చర్య పరిచారు. ఇది ఓ రకంగా బిఆర్ఎస్ పార్టీకి షాక్ లాంటిదే. టిఆర్ఎస్ పార్టీని పునరుద్ధరించాలనుకున్న ఆ పార్టీకి ఇదో అశనిపాతం లాంటిదే. నిజానికి గత టిఆర్ఎస్‌లో ఉంటూ.. తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి.. పిడికిలి బిగించి కొట్లాడామన్న కవిత మాటలు ముమ్మాటికీ నిజం. జాగృతి ద్వారా తెలంగాణ సాంస్కృతిక దీపాలను వెలిగించారు. తెలంగాణ ఉద్యమకారులకు తెలంగాణ జాగృతి వెలుగునిచ్చింది. తెలంగాణ సమాజానికి కాంతిరేఖగా మారింది. మరోసారి బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసుకున్నామంటే అందులో కవితనే కనిపిస్తారు. నిజానికి తెలంగాణ తెచ్చుకుంటే దరిద్రం పోతుందన్న భావనలో ఉండి పోరాడిన వారంతా ఆగమయ్యారు. ఆ కలలు నిజం కాలేదు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రజల ఆర్తిని అర్థం చేసుకోలేకపోయింది. సామాజిక తెలంగాణ రథ చక్రం విరిగి ముక్కలైంది. కొత్త రాష్ట్రంలో జరగాల్సిన పనులు సరిగా జరగలేదు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించిన వారంతా భంగపడ్డారు. పోరాటంలో ముందున్న కోదండరామ్ లాంటి వారు బయటకు తోయబడ్డారు. ఆయనే మరో పార్టీ పెట్టాల్సి వచ్చింది. కానీ ప్రజల మద్దతుల లేకపోవడంతో ఆయన ఇప్పుడు ఉనికి కోసం పాకులాడుతున్నారు. కాంగ్రెస్ చేస్తున్న అక్రమాలను ప్రశ్నించే శక్తి కూడా లేకుండా పోయింది. తెచ్చుకున్న తెలంగాణలో రైతులకు బేడీలు పడ్డాయి.. లాఠీలు విరిగాయి. ఇసుక దందా వల్ల దళితులు దెబ్బలు తిన్నారు. ఫోన్లు ఎక్కడ వింటున్నారోనని భయం గుప్పిట్లో బతికారు. వ్యక్తిగత స్వేచ్ఛ లేదు. దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బిక్కుబిక్కుమంటూ బతికింది. ఇవన్నీ కళ్లముందు కదలాడుతున్నాయి. బిఆర్ఎస్ పోయి కాంగ్రెస్ వచ్చినా మార్పు రాలేదు. మార్పు తెచ్చామని, స్వేచ్ఛను ఇచ్చామని ప్రకటించుకున్నా.. అది సాకారంకాలేదు. సామాజిక తెలంగాణ అన్నది నినాదంగా మారింది. తెలంగాణలోని 3. 5 కోట్ల మందికి అమ్మగా పరిణతి చెందాలనుకుంటున్న కవిత కష్టపడితే.. ఆ పేరు సంపాదించుకోవచ్చు. కేవలం నినాదాల కోసం కాకుండా ప్రజలను అక్కున చేర్చుకునే అమ్మగా మారితే ప్రజలు బ్రహ్మరథం పడతారు. తెలంగాణ ప్రజలు నమ్మితే ప్రాణం ఇస్తారు. ఉద్యమకారులు పోరాడితేనే కొత్త రాష్ట్రం వచ్చింది. అది గుర్తించి కవిత అడుగుల వేయాల్సి ఉంటుంది. మాటలు చెప్పడం వేరు, అందుకు అనుగునంగా అడుగుల వేయడం వేరు. రాజకీయాల్లో చిరస్థాయిగా నిలవాలంటే నిబద్ధత ముఖ్యం. నిజాయితీ అవసరం. నిలబడే ధైర్యం కావాలి. ప్రజలను ఆకట్టుకునే ప్రసంగాలే కాదు.. పనులు చేసే ధైర్యం కనిపించాలి. కవిత ప్రకటించిన ఐదు సూత్రాలను ఆచరణలో పెడితే అద్భుతాలు సాధించవచ్చు. అందుకు కావాల్సిందల్లా ప్రజల పక్షాన పోరాడడం. ఎన్నికలకు మరో రెండేళ్లు గడువు ఉంది. మహిళా రిజర్వేషన్లు కూడా వస్తున్నాయి. మహిళలను, బడుగు బలహీనవర్గాలను రాజ్యాధికారంలో భాగం చేసేలా ప్రణాళికలు రచిస్తే కవిత తప్పకుండా విజయం సాధిస్తారు. రాజకీయ పార్టీగా ముందు నిలబడతారు.

## తెలుగువారు గర్వించదగ్గ వాగ్గేయకారుడు శ్యామశాస్త్రి

సంగీత త్రిమూర్తులలో మూడవ వాడైన శ్యామశాస్త్రి (ఏప్రిల్ 26, 1763 – ఫిబ్రవరి 6, 1827) ప్రసిద్ధ కర్ణాటక సంగీత విద్వాంసులు. దాక్షిణాత్య



కర్ణాటక సంగీత రత్న త్రయంలో వయసురీత్యా పెద్దవారు శ్యామశాస్త్రి ((క్రీ. శ. 1763 –1827). శ్యామ శాస్త్రి కన్నా త్యాగరాజు కొద్దిగా చిన్నవారు ((క్రీ. శ. 1767–1847). వీరు ఇరువురి కన్నా చిన్నవారు ముత్తుస్వామి దీక్షితులు ((క్రీ. శ. 1776–1835). శ్యామశాస్త్రి తండ్రి విశ్వనాథ శాస్త్రి. ప్రస్తుత ప్రకాశం జిల్లాలోని గిద్దలూరుకు సమీపంలోగల కంభం ప్రాంతీయులు. మహమ్మదీయుల దండయాత్రలకు బెదిరి వారి కుటుంబీకులు 17వ శతాబ్దంలో తమిళనాడుకు వలస వెళ్ళి అక్కడే స్థిరపడ్డారు. శ్యామశాస్త్రి అసలు పేరు వేంకట సుబ్రహ్మణ్యము. అయితే, చిన్నతనంలో ముద్దు పేరుగా శ్యామకృష్ణ గా పిలుస్తూ, ఆ పేరే చివరకు వ్యవహారికంలో సార్థకమైందని ఆయన శిష్యులు పేర్కొంటారు. పుత్రుడు కలుగునని" చెప్పినట్లే ఇతనితల్లి గర్భవతిఅయి క్రీ. శ1763లో చిత్రభాను సంవత్సరంలో మేష రవి కృత్తికా నక్షత్రమునందు శ్రీనగరమను తిరువారూరిలో శ్యామశాస్త్రిలు జన్మించినట్లు పేర్కొంటారు.

తండ్రి విశ్వనాధ శాస్త్రి సంస్కృత, తెలుగు భాషలలొ పండితుడు కావడంతో – శ్యామశాస్త్రి చిన్నతనంలో తండ్రి దగ్గరే సంస్కృతాంధ్ర భాషలు అభ్యసించాడు. సంగీతంలో తన మేనమామ దగ్గర స్వరపరిచయం కల్గినా, ఆ పిదప తంజావూరులో 'సంగీత స్వామి' అనబడే ప్రముఖ తెలుగు సంగీత విద్వాంసుని దగ్గర, తంజావూరులోని రాజాస్థానంలో సంగీత విద్వాంసుడైన శ్రీ పచ్చిమిరియము ఆది అప్పయ్య సహకారంతో సంగీత శాస్త్రాలలో మర్మములు ఎన్నో అధ్యయనం చేశాడు. శ్యామశాస్త్రి రచించిన అనేక కీర్తనలు ఉల్లాసం కలిగించేవి, చక్కని లయ, తాళ ప్రదర్శనలకు అనుగుణంగా ఉండేవి. నాదోపాసన ద్వారా ఆత్మానందం సాధించ వచ్చని ఆయన అభిప్రాయ పడేవారు. శ్యామశాస్త్రి తెలుగు, తమిళ, సంస్కృత భాషలలొ అనేక కృతులు, కీర్తనలు రచించినా అధికభాగం తెలుగులోనే వ్రాశారు. అయితే, త్యాగరాజు తన కీర్తననలో భావ రాగలకు అధిక ప్రాధాన్యత ఇవ్వగా, శ్యామశాస్త్రి కీర్తనలలో క్లిష్టమైన 'తాళ' రచన చేసినట్లు సంగీతాభిమానులు అంటారు. శ్యామశాస్త్రి కీర్తనలలో క్లిష్టమైన రచనతోపాటు, ఆయనకు శిష్యులు అధిక సంఖ్యలో లేకపోవడం వల్ల కూడా, ఈయన కీర్తనలు అధిక ప్రాచుర్యం పొందలేదని వారు భావిస్తారు. శ్యామశాస్త్రి రచించిన "ప్రోవవమ్మ", "మాంజిరాగం" అలాగే 'కల్గడ '(కలగడ ), 'చింతామణి ' రాగాలు, "హిమాద్రిసుతీ " అనే కీర్తన, ఒకే స్వరంతో సంస్కృతం,తెలుగు భాషలలొ వేరు వేరుగా రాసిన ఆయన కీర్తనలు సంగీత కళాకారు లందరికి సుపరిచతమే.. త్యాగరాజాదులచే కొనియాడ బడిన ఆయన లయజ్ఞానము శ్లాఘనీయమైనది. ఆనంద భైరవి రాగమన్న ఆయనకు చాల యిష్టమని చెప్తారు. ఆయన మదురైకు వెళ్లినపుడు మీనాక్షి దేవిని స్తుతించుచూ తొమ్మిది కృతులు ("నవరత్నమాలిక") గానం చేశాడు.

శ్యామశాస్త్రి ప్రసిద్ధి చెందిన ఆనంద భైరవీ, ధన్యాసి, కల్గడ, కళ్యాణి, కాంభోజి, కాపి, చింతామణి వంటి రాగాల్లో కృతులు స్వర పరిచాడు. సంగీత పాఠాల్లో సరళీ స్వరాలు, జంట స్వరాలు, గీతాలు, స్వరజతులు, వర్ణాలు, కృతులు అనేవి ఒక పద్ధతిలో నేర్పుతారు. వీటిలో స్వరజతి రూపకర్త శ్యామశాస్త్రి. తోడి రాగంలో "రావే హిమగిరి కుమారి", భైరవి రాగంలో 'కామాక్షీ అనుదినము'వంటివి కొన్ని ప్రసిద్ధి జెందిన స్వరజతులు.

ఈ స్వరజతులే కాకుండా విలోమ చాపు తాళాన్ని కూడా శ్యామశాస్త్రి బహుళ ప్రాచుర్యం లోకి తెచ్చాడు. సాధారణంగా చాపు తాళం గతి 3 ం 4 పద్ధతిలో ఉంటుంది. ఇలా కాకుండా 4 ం 3 రీతిలో తాళ గతిని మార్చి కొన్ని కీర్తనలు స్వర పరిచాడు. పూర్వి కళ్యాణి రాగంలో 'నిన్ను వినగ మరి', ఫరజ్ రాగంలో 'త్రిలోకమాత నన్ను' అనేవి ఈ విలోమ చాపు తాళంలో ప్రసిద్ధి చెందిన కీర్తనలు.

తంజావూరు జిల్లాలో తిరువాయూరులో ఉన్న కామాక్షి దేవాలయ అర్చకత్వం చేసుకుంటూ, తన గాన కళా పాండిత్యంలో కామాక్షి అమ్మవారి సేవలో, ఆమె సన్నిధానంలోనే ' శ్యామకృష్ణ' అనే ముద్రతో అనేక కీర్తనలు, కృతులు రచించాడయన.

శ్యామశాస్త్రి ఇంటి ఇలవేల్పుగా కామాక్షిదేవిని కీర్తిస్తూ, తమ ఇంటి 'ఆడపడుచుగా' అమ్మవారిని భావిస్తూ – – అపూర్వం, అనన్య సామాన్య కృతులెన్నింటినో శ్యామశాస్త్రి రచించాడని ఆయన శిష్యులు, సంగీత కళారాధకులు పేర్కొంటారు. అందువల్లనే, శ్యామశాస్త్రి తన కీర్తనలలో కొన్నింటిని "శ్యామకృష్ణ – సహోదరి" అని పేర్కొన్నట్లు వారు చెపుతారు.

శ్యామశాస్త్రి కుమారుడు సుబ్బరాయశాస్త్రి కూడా ప్రముఖ వాగ్గేయకారిడిగా ప్రసిద్ధి చెందాడు. శ్రీ అలసూరు కృష్ణయ్య , శ్రీ తలగంబాడి పంచనాదయ్య తదితరులు శ్యామశాస్త్రి శిష్యులలో ప్రముఖులు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...**
**9440595494**

## ప్రేమ సామ్రాజ్ఞి... సేవా తపస్విని మదర్ థెరిసా

**ఆగస్టు 26...**
**మదర్ థెరిసా జయంతి**



మానవ సేవకు మతం, జాతి, కులం, వర్గం, సరిహద్దులు అడ్డంకి కావని తన జీవితాచరణ ద్వారా జగతికి చాటిచెప్పిన కరుణామూర్తి, సేవా శిఖరం మదర్ థెరిసా. ఆధునిక మానవ సమాజంలో స్వార్థం, భోగలాలసత రాజ్యమేలుతున్న తరుణంలో, నిస్వార్థ ప్రేమకు, అపరిమిత త్యాగానికి సజీవ ప్రతిరూపంగా నిలిచిన ధన్యజీవి ఆమె. తెలుగు ప్రాచీన సూక్తి "పరోపకారార్థమిదం శరీరం" అన్న మాటకు, వేమన యోగి ప్రబోధించిన "ఉపకారమే మానవ ధర్మము" అన్న తాత్విక సత్యానికి, మహాకవి గురజాడ అప్పారావు గళమెత్తిన "దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్" అన్న విశ్వ మానవతా దృక్పథానికి మదర్ థెరిసా జీవితం ఒక నిలువెత్తు నిదర్శనమై భాసిల్లింది.

ఆమె అసలు పేరు అగ్నెస్ గోంజా బొజాక్షియు. 1910 ఆగస్టు 26న నాటి ఒట్టోమన్ సామ్రాజ్య పరిధిలోని స్కోప్జే నగరంలో (ప్రస్తుత ఉత్తర మాసిడోనియా) అల్బేనియన్ దంపతులైన నికోలా బొజాక్షియు, డ్రానే దంపతులకు జన్మించారు. చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో తల్లి పెంచిన క్రమశిక్షణ, పేదలకు సాయం చేసే విశాల గుణం బాల్యం నుంచే ఆమెలో ఆధ్యాత్మిక బీజాలు నాటాయి. పన్నెండేళ్ల చిరు ప్రాయంలోనే సేవా దీక్ష వైపు మనసు మళ్లగా, పద్దెనిమిదేళ్ల వయసులో 1928లో ఐర్లాండ్‌లోని 'సిస్టర్స్ ఆఫ్ లోరెటో' సంస్థలో చేరి సన్యాసినిగా మారారు. అనంతరం 1929 జనవరిలో భారతదేశ తీరానికి చేరుకొని, 1931 మే 24న తొలి సన్యాస ప్రమాణాలు స్వీకరిస్తూ 'థెరిసా' అన్న నామకరణం చేసుకున్నారు. కోల్‌కతాలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో దాదాపు రెండు దశాబ్దాల పాటు ఉపాధ్యాయురాలిగా, ప్రధానోపాధ్యాయురాలిగా భూగోళ శాస్త్రం, చరిత్రను బోధిస్తూ ఉన్నత విద్యాసేవలందించారు.

పాఠశాల నాలుగు గోడల మధ్య సుఖవంతమైన జీవితం ఉన్నప్పటికీ, వెలుపల వీధుల్లో రాజ్యమేలుతున్న దారిద్ర్యం, 1943 నాటి భయంకరమైన బెంగాల్ కరవు, 1946 నాటి రక్తసిక్తమైన హిందూ-ముస్లిం మతకల్లోలాల తీవ్రత ఆమె హృదయాన్ని తీవ్రంగా కలచి వేశాయి. 1946 సెప్టెంబర్ 10న డార్జిలింగ్‌కు రైలు ప్రయాణం చేస్తున్న సమయంలో ఆమెకు అంతరాత్మ నుంచి "పిలుపులో మరో పిలుపు" వినిపించింది. సురక్షితమైన కాన్వెంట్ గోడలను వీడి, అత్యంత నిరుపేదలు, అనాథలు, అభాగ్యుల మధ్య నివసిస్తూ వారి సేవకే జీవితాన్ని అంకితం చేయాలనే ఆత్మప్రబోధం కలిగింది. 1948లో వాటికన్ అనుమతితో నీలి అంచుగల తెల్లటి నూలు చీరను ధరించి, కేవలం ఐదు రూపాయల చిల్లరతో కోల్‌కతా మురికి వాడల్లోకి నిస్సహాయురాలిగా అడుగు పెట్టారు. పాట్నాలోని హోలీ ఫ్యామిలీ ఆసుపత్రిలో ప్రాథమిక వైద్య శిక్షణ పొందిన అనంతరం, మోతిఝిల్ మురికివాడలో చెట్ల కింద పేద పిల్లలకు అక్షరజ్ఞానాన్ని నేర్పడంతో ఆమె మహోన్నత సేవా యాత్ర ప్రారంభమైంది.

***1950 అక్టోబర్ 7న వాటికన్ అధికారిక ఆమోదంతో 'మిషనరీస్ ఆఫ్ చారిటీ' అనే సేవా సంస్థను స్థాపించడం ప్రపంచ సేవా చరిత్రలోనే ఒక గొప్ప మలుపు. సమాజం ఛీత్కరించిన కుష్ఠు వ్యాధిగ్రస్తులు, మురుగు కాలువల పక్కన చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న అనాథల కోసం 1952లో కాళీఘాట్ సమీపంలో 'నిర్మల్ హృదయ్' (హోమ్ ఫర్ ది డయింగ్ డెస్టిట్యూట్స్) కేంద్రాన్ని నెలకొల్పారు. కనీసం బతికినంత కాలం ప్రేమకు నోచుకోని మనిషి, చివరి క్షణాల్లోనైనా మానవతా స్పర్శతో, గౌరవప్రదంగా కన్ను మూయాలన్నదే ఆమె ప్రధాన ఆశయం. అనంతరం అనాథ శిశువుల కోసం 'నిర్మలా శిశు భవన్', కుష్ఠు వ్యాధిగ్రస్తుల స్వయం ఉపాధి, పునరావాసం కోసం అసన్సోల్‌లో 'శాంతి నగర్' వంటి ఎన్నో ఆశ్రమాలను నిర్మించారు. 1963లో మిషనరీస్ ఆఫ్ చారిటీ బ్రదర్స్ విభాగం, తదనంతరం వాలంటీర్ల విభాగాలు విస్తరించాయి. 1965లో పోప్ పాల్ 6 ఆమె సేవలకు అంతర్జాతీయ హోదా కల్పించడంతో ఈ కరుణా తరంగాలు ప్రపంచ దేశాలన్నింటికీ వ్యాపించాయి. ఆమె జీవించి ఉన్న కాలంలోనే 120కి పైగా దేశాలలో 600కు పైగా కేంద్రాలు, దాదాపు 4,000 మందికి పైగా సన్యాసినులు నిరంతర సేవల్లో నిమగ్నమయ్యారు.***

ఈ అద్వితీయ త్యాగానికి ప్రపంచం వినమ్రంగా జోహార్లు అర్పించింది. భారత ప్రభుత్వం 1962లో పద్మశ్రీ, 1980లో అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న'తో సత్కరించింది. అంతర్జాతీయంగా 1972లో జవహర్‌లాల్ నెహ్రూ అంతర్జాతీయ అవగాహన పురస్కారం, 1978లో బాల్జాన్ ప్రైజ్, అమెరికా ఇచ్చే అత్యున్నత ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్, పద్మవిభూషణ్ వంటి లెక్కలేనన్ని గౌరవాలు దక్కాయి. 1979లో ఆమెకు ప్రపంచ శాంతికి చేసిన విశేష సేవలకు గాను ప్రతిష్ఠాత్మక 'నోబెల్ శాంతి బహుమతి' లభించింది. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన విందును రద్దు చేయించి, ఆ మొత్తాన్ని పేదల ఆకలి తీర్చడానికే వెచ్చించమనడం ఆమె నిస్వార్థ నిబద్ధతకు నిదర్శనం. ఒక చారిత్రక వ్యక్తిగా ఆమె నిర్వహించిన ఆశ్రమాల్లోని వైద్య పరికరాల నాణ్యత, నొప్పి నివారణ మందుల కొరత, సాంప్రదాయ మతపరమైన భావనలపై క్రిస్టోఫర్ హిచెన్స్ వంటి విమర్శకులు సందేహాలు లేవనెత్తినప్పటికీ, ఎవరూ దగ్గరకు రాని అంటువ్యాధి గ్రస్తులను తన చేతులతో కౌగిలించుకుని సేదతీర్చిన ఆమె ఆచరణాత్మక కరుణ ముందు ఏ విమర్శలూ నిలవలేక పోయాయి.

1997 సెప్టెంబర్ 5న కోల్‌కతాలో మదర్ థెరిసా తుదిశ్వాస విడిచారు. భారత ప్రభుత్వం ఆమెకు సంపూర్ణ అధికారిక లాంఛనాలతో వీడ్కోలు పలికింది. ఆమె పవిత్ర సేవలకు గుర్తింపుగా 2003 అక్టోబర్ 19న పోప్ జాన్ పాల్ 2 ఆమెను 'ధన్యురాలిగా' (బీటిఫికేషన్) ప్రకటించగా, 2016 సెప్టెంబర్ 4న పోప్ ఫ్రాన్సిస్ వాటికన్ నగరంలో ఆమెకు సెయింట్ హుడ్ ప్రదానం చేసి 'కలకత్తా సెయింట్ థెరిసా'గా నామకరణం చేశారు. ఐక్యరాజ్య సమితి ఆమె వర్ధంతి రోజైన సెప్టెంబర్ 5వ తేదీని 'అంతర్జాతీయ దాతృత్వ దినోత్సవం'గా ప్రకటించి శాశ్వత గౌరవాన్ని అందించింది. "ప్రేమ అనేది మాటల్లో కాదు, చేతల్లో చూపించాలి; మనం చేసే పని ఎంత గొప్పదనేది కాదు, ఎంత ప్రేమతో చేశామన్నదే ముఖ్యం" అన్న ఆమె జీవన సందేశం, వేదం పలికిన "మానవసేవే మాధవసేవ" అనే సనాతన ధర్మానికి నిజమైన భాష్యం. భౌతికంగా ఆమె దూరమైనా, ఆపన్నుల కన్నీరు తుడిచే ప్రతి హస్తంలోనూ, ఆకలి తీర్చే ప్రతి ముద్దలోనూ, నిస్సహాయులకు నిలబడే ప్రతి సంకల్పంలోనూ మదర్ థెరిసా కరుణామయ స్ఫూర్తి కలకాలం చిరంజీవిగా వెలుగొందుతూనే ఉంటుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494

# ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- కోటి కుటుంబాలకు సౌరవిద్యుత్ లక్ష్యం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**కరీంనగర్, ఆగస్టు 25(సింగిడి):** పేద, మధ్యతరగతి కుటుంబాలపై విద్యుత్ భారాన్ని తగ్గించడంతో పాటు కర్బన ఉద్గారాలు, వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనను అమలు చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. తెలంగాణలో జైవిక్ కంపెనీ భాగస్వామ్యంతో ఈ పథకాన్ని అమలు చేసేందుకు మారుతి ఏజెన్సీస్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. మంగళవారం మారుతి ఏజెన్సీస్ నిర్వాహకుడు తిప్పారపు ఆంజనేయులు, ప్రతినిధులు దేవోజు వెంకటరమణాచారి, తిప్పారపు రవివర్మతో కలిసి పథకానికి సంబంధించిన పోస్టర్లను బండి సంజయ్ ఆవిష్కరించారు. 2027 మార్చి నాటికి దేశంలోని కోటి కుటుంబాలకు సౌర విద్యుత్ అందించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద పైకప్పు సౌర విద్యుత్ పథకంగా సూర్యఘర్ యోజనను అభివర్ణించారు. పథకం కింద 1 కిలోవాట్‌కు రూ.30 వేల, 2 కిలోవాట్లకు రూ.60 వేల, 3 కిలోవాట్లకు రూ.78 వేల వరకు సబ్సిడీ అందుతుందని వివరించారు. సౌర విద్యుత్‌ను గృహ అవసరాలకు వినియోగించు కోవడంతో పాటు మిగిలిన విద్యుత్‌ను విద్యుత్ పంపిణీ సంస్థలకు విక్రయించి ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. పథకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని మారుతి ఏజెన్సీస్ నిర్వాహకులను కోరారు. ఈ కార్యక్రమం లో మేయర్ కోలగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## వన సంరక్షణ.. మనందరి బాధ్యత





- మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం
- మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్‌కుమార్

**జమ్మికుంట, ఆగస్టు 25 (సింగిడి):** మన సంరక్షణ మనందరి బాధ్యత అని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శ్రీ దుబ్బ మల్లికార్జున స్వామి దేవాలయ ఆవరణంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూడా తమ ఇంటి ఆవరణంలో మొక్కలు నాటాలని తల్లి జన్మనిస్తే చెట్టు పునర్జన్మణిస్తుందని గుర్తు చేశారు. ప్రస్తుత కాలుష్య వాతావరణం లో మన ఇంటి చుట్టూ మొక్కలు ఉంటే అంత గాలివీస్తుందని ,తద్వారా మనం ఆరోగ్యకరంగా ఉంటామన్నారు. ప్రతి ఒక్కరు విధిగా తమ ఇంటి ఆవరణంలో పండ్ల మొక్కలు గాని, పూల మొక్కలు గాని నాటడం వల్ల ఆరోగ్యకరంగా ఉంటామన్నారు. చెట్లు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్,కౌన్సిలర్స్ ఒగ్గు రమేష్ మాచర్ల రాజు కుతాడి తిరుపతి ఏగీత అశోక్ దేవాలయ చైర్మన్ ముద్దమల్ల రవి , మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు, సైదాబాద్ సర్పంచ్ రాజారాం శానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆర్ ఐ భాస్కర్,వార్డు ఆఫీసర్స్,బిల్ కలెక్టర్స్,కార్యాలయ సిబ్బంది, కాంగ్రెస్ నేతలు పిడుగు భాగ్యలక్ష్మి కోడం రజిత తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో భారీగా బిజెపి బీఆర్ఎస్ కార్యకర్తల చేరికలు

నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్, ప్రణవ్‌తోనే సాధ్యం

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ప్రణవ్



**జమ్మికుంట ఆగస్టు 25 (సింగిడి):** కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై జమ్మికుంట మండలం గంద్రపల్లి గ్రామం నుండి గ్రామ ఉపసర్పంచ్ బీరెందర్,50 మంది కార్యకర్తలు, కమలాపూర్ మండలం గూడూరు నుండి బీజేపీ,బిఆర్ఎస్ నాయకులు మండల అధ్యక్షుడు పరశురాం ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ప్రణవ్. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్లు,నూతన రేషన్ కార్డులు,సన్నబియ్యం,రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్ లాంటి అనేక అభివృద్ధి,సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నామని వాటితో మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పరశురాం,కార్తీక్, సీనియర్ నాయకులు సాయిని రవి,పొనగంటి మల్లయ్య, గూడూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు,సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనకు సమిష్టిగా కృషిచేయాలి

జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, ఆగస్టు25(సింగిడి):** మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా మాదకద్రవ్యాల నియంత్రణ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వసతి గృహాల్లో తరచుగా తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి పాలిటెక్నిక్, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో అవగాహన శిబిరాలు నిర్వహించాలని పేర్కొన్నారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నియంత్రణకు పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని, వసతి గృహాల్లో తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి మాట్లాడుతూ, విద్యాసంస్థల్లో వారానికి మూడుసార్లు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల విముక్తి కేంద్రాన్ని క్రమం తప్పకుండా సందర్శిస్తూ అక్కడికి వచ్చే వారికి అవసరమైన సహకారం అందిస్తున్నామని వివరించారు. సమావేశంలో పోలీస్, విద్య, వైద్య ఆరోగ్య, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీనియర్ సివిల్ జడ్జిగా మహతి వైష్ణవి బాధ్యతల స్వీకరణ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (సింగిడి):** జూనియర్ సివిల్ జడ్జి హోదా నుంచి సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొందిన తాడూరు మహతి వైష్ణవి మంగళవారం భూపాలపల్లి సీనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనూరు సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి, సన్మానించారు. బార్--బెంచ్ మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు, కోర్టు కార్యకలాపాలు సజావుగా సాగేందుకు బార్ అసోసియేషన్ తరఫున పూర్తి సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారానికి న్యాయవాదులు తమ వంతు సహకారం అందిస్తారని పేర్కొన్నారు. గత కొన్ని నెలలుగా భూపాలపల్లి కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి స్థానం ఖాళీగా ఉండటంతో కక్షిదారులు, న్యాయవాదులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని సురేష్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం సీనియర్ సివిల్ జడ్జిగా మహతి వైష్ణవి బాధ్యతలు స్వీకరించడం పట్ల కక్షిదారులు, న్యాయ వాదుల్లో ఆనందం వ్యక్తమవుతోం దన్నారు. కేసుల పరిష్కారంలో వేగం పెరిగి, న్యాయ ప్రక్రియ మరింత సజావుగా సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ తరఫున జడ్జి మహతి వైష్ణవికి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆకుల రాములు, కోశాధికారి ఇందారపు శివకుమార్, లైబ్రరీ కార్యదర్శి అకినపల్లి రవికుమార్, స్పోర్ట్స్ కార్యదర్శి సైండ్ల నాగరాజు, కల్చరల్ కార్యదర్శి గార్లపాటి ప్రియాంక, సీనియర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలు కనపర్తి కవిత, లేడీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలు మచ్చ వసంత, న్యాయవాదులు రాజనీకాంత్, అజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# అందరిచూపు కాంగ్రెస్ వైపే..

హస్తం గూటికి చేరుతున్న బిజెపి బీఆర్ఎస్ నేతలు

సాదరంగా ఆహ్వానిస్తున్న ఇన్చార్జి ప్రణవ్



**జమ్మికుంట, ఆగస్టు 25 (సింగిడి) :** గ్రామాల అభివృద్ధి సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమని నమ్మిన హుజురాబాద్ నియోజకవర్గం పరిధిలోని పలువురు బిజెపి బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ గూటికి క్యూ కడుతున్నారు. గత మూడు రోజులుగా నియోజక వర్గంలోని జమ్మికుంట మండల పరిధిలోని వివిధ గ్రామాల నాయకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన కాంగ్రెస్ పార్టీ హుజరాబాద్ నియోజక వర్గం ఇంచార్జ్ ప్రణవ్ బాబు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు విశ్వసిస్తున్నారని ఇప్పటివరకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తూ ప్రజలకు సుస్థిరమైన ప్రజాపాలన అందిస్తుందని దీనికి ఆకర్షితులైన వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీ గూటికి వస్తున్నారని పేర్కొన్నారు. పార్టీని నమ్ముకున్న వాళ్లకు అండగా ఉంటానని కష్టంలో ఉన్న వాళ్లకు బాసటగా నిలుస్తానని రాష్ట్రంలో రాబోయేది మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఆయన తెలిపారు. మంగళవారం మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు ప్రణవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రణవ్ వారిని పార్టీలోకి ఆహ్వానించి సమస్యల పరిష్కారంలో అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాచపల్లి శ్రీనివాస్ మండల నాయకులు రాచపల్లి సాగర్ తో పాటు మండల అధ్యక్షుడు పరశు రామారావు ఉండగా పార్టీలో చేరిన వారు వేల్పుల కుమార్ వేల్పుల ఓదెలు తో సహా సుమారు 15 మంది నాయకులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొన్నగంటి మల్లయ్య గూడెపు సారంగపాణి తదితరులు ఉన్నారు.

# నీట్ పరీక్షకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

కరీంనగర్‌లో 7 కేంద్రాలు, 1,505 మంది అభ్యర్థులు




**కరీంనగర్, ఆగస్టు 25(సింగిడి):** ఆగస్టు 30న నిర్వహించనున్న నీట్, పీజీ 2026 ప్రవేశ పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పరీక్ష ఏర్పాట్లతో పాటు వర్షాభావ పరిస్థితులు, పర్యాటక అభివృద్ధిపై సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా 14 జిల్లాల్లో 56 పరీక్షా కేంద్రాల్లో 17,627 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని సీఎస్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, విద్యుత్, వెలుతురు, గాలి ప్రసరణ, విద్యుత్ అంతరాయాల సమయంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉండేలా ముందస్తు తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. అభ్యర్థుల గుర్తింపు, తనిఖీలను నిబంధనల ప్రకారం నిర్వహిస్తూ నిషేధిత వస్తువులు పరీక్ష కేంద్రాల్లోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రశ్నాపత్రాల భద్రత, గోప్యతకు పూర్తి రక్షణ కల్పించాలని సూచించారు. కరీంనగర్‌లో ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి 1,505 మంది అభ్యర్థులకు పరీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో స్వామి, ఆర్డీవో షర్మిల, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజగోపాలరావు, మెప్మా పీడీ స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు నిస్పాక్షిక సేవలందించాలి

చిట్యాల పోలీస్‌స్టేషన్ వార్షిక తనిఖీ

ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నిస్పాక్షికంగా, పారదర్శకంగా సేవలు అందించాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పోలీసు సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం చిట్యాల సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీకి సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా స్టేషన్ ప్రాంగణంలో మొక్క నాటారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణతో పాటు పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని ఎస్పీ సమీక్షించారు. సీసీటీఎన్ఎస్‌లో కేసుల నమోదు, వివరాల నవీకరణ, బ్లూకోల్ట్ వాహనాల పనితీరు, సీసీ కెమెరాల నిర్వహణపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలోని సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని, లోపాలు గుర్తించిన వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. రిసెప్షన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. రౌడీషీటర్లపై నిరంతరం నిఘా కొనసాగించాలని, ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ పారదర్శకమైన సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహాముత్తారంలో ఘనంగా వన మహోత్సవం





**మహాముత్తారం, ఆగస్టు 25 (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా అజాంనగర్ అటవీ రేంజ్ పరిధిలోని మహాముత్తారం జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో ఇన్‌చార్జ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కోటేశ్వర్ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో అధికారులు, అటవీ శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమానికి స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ రమేష్, ఎంపీడీవో ప్రకాష్ రెడ్డి, జెడ్పీ హెచ్ఎస్ హెచ్ఎం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అడవులను సంరక్షించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా మొక్కలు నాటి, వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని సూచించారు. స్థానిక అధికారులు మాట్లాడుతూ అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని అభినందించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అజాంనగర్ రేంజ్ అటవీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## వావిలాల పిహెచ్సిని ఆకస్మికంగా తనిఖీ చేసిన వొడితల ప్రణవ్



**జమ్మికుంట ఆగస్టు 25 (సింగిడి):** జమ్మికుంట మండల పరిధిలోని వావిలాల పిహెచ్సి నీ ఆకస్మికంగా తనిఖీ చేశారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్. ఆసుపత్రి చుట్టూ తిరుగుతూ పేదలకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. ఆసుపత్రి నిర్వహణపై సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య,వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు వెళు తున్నామని, పేదలకు అందించే వైద్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై జిల్లా కలెక్టర్,సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వావిలాల సర్పంచ్ అర్జున్,మండల అధ్యక్షుడు పరశు రామారావు,పొనగంటి మల్లయ్య,సారంగపాణి,సజ్జు జమ్మికుంట,వావిలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ మున్సిపల్ అభివృద్ధికి నిధులు కేటాయించండి

మంత్రి పొన్నంకు వినతిపత్రం అందజేసిన ప్రణవ్

సానుకూలంగా స్పందించిన మంత్రి



**జమ్మికుంట ఆగస్టు 25 (సింగిడి):** హుజురాబాద్ మున్సిపల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కు హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్,కౌన్సిలర్లు. మంగళ వారం సైదాపూర్ మండల పరిధిలోని ఆకునూరు గ్రామంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి తప్పకుండా నిధులు కేటాయి స్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,వైస్ చైర్ పర్సన్ అంజలి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## పెగడపల్లి ఆశ్రమ పాఠశాలలో ఘనంగా వనమహోత్సవం



**మహాముత్తారం, ఆగస్టు 25 (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం పెగడపల్లి ఆశ్రమ పాఠశాలలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉత్సాహ ంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, పెగడపల్లి సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొని మొక్కలు నాటారు. అలాగే బోర్లగూడెం సర్పంచ్, ఉప సర్పంచ్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది కార్యక్ర మంలో పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

# రైలు మార్గం మార్చొద్దు.. కోదాడను విస్మరించొద్దు

- అలైన్‌మెంట్ మార్చొద్దు.. భవిష్యత్ తరాల కోసం రైలుమార్గం సాధించాలి
- అఖిలపక్ష సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



**కోదాడ, ఆగస్టు 25 (సింగిడి):** హైదరాబాద్--అమరావతి--చెన్నై నగరాలను అనుసంధానించే ప్రతిపాదిత హైస్పీడ్ బుల్లెట్ రైలు అలైన్‌మెంట్‌ను మార్చకుండా గతంలో ప్రతిపాదించిన విధంగానే సూర్యాపేట--కోదాడ మీదుగా రైలుమార్గాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్‌లో ఆయన అధ్యక్షతన బుల్లెట్ రైలు అలైన్‌మెంట్‌పై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ.. కోదాడ మీదుగా బుల్లెట్ రైలు వెళ్లాలనేది తన వ్యక్తిగత డిమాండ్ కాదని, నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష, భవిష్యత్ తరాల అవసరమని స్పష్టం చేశారు. రైల్వే అలైన్‌మెంట్ నిర్ణయించేటప్పుడు ప్రస్తుతం ఉన్న పరిస్థితులతో పాటు రాబోయే 50--100 ఏళ్ల అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. కోదాడ ప్రాంతంలో జనాభా వేగంగా పెరుగుతోందని, పరిశ్రమలు, విద్యాసంస్థలు, వ్యాపార కేంద్రాలు విస్తరిస్తున్న నేపథ్యంలో మెరుగైన రవాణా సౌకర్యం అత్యవసరమని అన్నారు. గతంలో కోదాడ--హైదరాబాద్ మధ్య ప్రయాణానికి సింగిల్ రోడ్డు మాత్రమే ప్రధాన ఆధారంగా ఉండేదని, తరచూ ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోయేవారని గుర్తుచేశారు. అప్పట్లో ప్రజా ఉద్యమాలు, పోరాటాల ద్వారా ఎన్‌హెచ్--65 వంటి మెరుగైన రహదారి సౌకర్యాన్ని సాధించుకున్నామని తెలిపారు. అదే విధంగా రాబోయే తరాల కోసం హైస్పీడ్ రైలు సౌకర్యాన్ని కూడా సాధించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కోదాడ పరిసరాల్లో సిమెంట్ పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు ఉన్నాయని, వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు ఇక్కడికి వస్తున్నారని తెలిపారు. హైస్పీడ్ రైలు అందుబాటులోకి వస్తే విద్య, ఉపాధి, పరిశ్రమలు, వ్యాపారం, పర్యాటకం, ఆర్థిక రంగాలకు మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. "కోదాడకు రైలు అవసరమా?" అనే ప్రశ్నకు రేపటి తరాల కోసం వందకు వంద శాతం అవసరమే అని అన్నారు. కోదాడ మీదుగా బుల్లెట్ రైలు వెళ్లేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రైల్వే శాఖపై ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ అంశంపై భవిష్యత్ కార్యాచరణ రూపొందించి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, వ్యాపార, ఉపాధ్యాయ సంఘాలు, కుల సంఘాలు, మేధావులు, యువత, ప్రజలను కలుపుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అలైన్‌మెంట్ మార్చొద్దు.. కోదాడ మీదుగానే బుల్లెట్ రైలు వెళ్లేలా ఐక్యంగా పోరాడుదాం అని పిలుపునిచ్చారు. అఖిలపక్ష సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, విద్యార్థి, వ్యాపార, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు హాజరై బుల్లెట్ రైలు కోదాడ మీదుగా వెళ్లాలన్న డిమాండ్‌కు మద్దతు తెలిపారు.

## పచ్చదనం పెంపే లక్ష్యంగా వనమహోత్సవం



- ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి
- ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, ఆగస్టు 25 (సింగిడి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ప్రత్యేకంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, డీఎఫ్ఓ కిష్ట గౌడ్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్ పాల్గొని మొక్కలు నాటారు. రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా 16.03 కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని, మొక్కల పెంపకం ద్వారా పచ్చదనం పెరగడంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, అడ్మిన్ ఆర్ఐ రత్నం, వెల్ఫేర్ ఆర్ఐ సంతోష్ కుమార్, ఎంటీఓ ఆర్ఐ పూర్ణచందర్, స్పెషల్ పార్టీ ఆర్ఐ కాశీరాం, తదితరులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ యాప్‌లో యూరియా బుకింగ్



**కోదాడ,ఆగస్టు 25 (సింగిడి):** ఫర్టిలైజర్ యాప్‌లో సోమవారం( నేడు) ఉదయం 6 గంటలకు యూరియా బుకింగ్ ప్రారంభమవుతుందని మండల వ్యవసాయ అధికారి అందే సతీష్ తెలిపారు. అనంతగిరి, అమీనాబాద్ పీఏసీఎస్‌లలో 444 చొప్పున యూరియా బస్తాలు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. రైతులు యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవాలని సూచించారు. దూరాన్ని బట్టి రవాణా ఛార్జీలు వసూలు చేస్తామని తెలిపారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ, ఆగస్టు 25 (సింగిడి):** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగగంగా ప్రజావాణి దరఖాస్తుల పరిష్కార చర్యల గురించి వర్చువల్ గా ఆర్డీవోలు,తహసీల్దారులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ప్రజావాణి పోర్టల్ లో వివిధ శాఖలకు సంబంధించి అర్జీలు పెండింగ్ లో ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులు గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రజావాణి అర్జీలను అత్యవసరంగా పరిగణించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో సరిగ్గా విచారణ చేసి వాటిపై తీసుకున్న చర్యలను అధికారులు తెలియజేయాలన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సమయానికి హాజరు కావాలన్నారు. ప్రజావాణి అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యల నివేదిక ( యాక్షన్ టేకెన్ రిపోర్ట్) సరిగ్గా లేకపోతే చర్యలు ఉంటాయన్నారు. అదేవిధంగా కారుణ్య నియామకాలను భర్తీ చేసేందుకు శాఖల వారీగా వివరాలను తెలియజేయాలన్నారు. మంగళవారం నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేయాలని సూచించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌తో పాటు హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, మండల పరిషత్ అభివృద్ధి కార్యాల యాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మంగళవారం నిర్వహించే వన మహోత్సవం కార్యక్రమం గురించిన వివరాలను అధికారులకు జిల్లా అటవీ శాఖ అధికారి ముకుంద రెడ్డి వివరించారు. అదేవిధంగా జిల్లా స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డీఆర్‌డీఓ మేన శ్రీను, సిపిఓ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

## 16వ డివిజన్‌లో ఘనంగా ఇందిరమ్మ గృహప్రవేశం

- అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం
- కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్



**కరీంనగర్, ఆగస్టు 25(సింగిడి):** నగరంలోని 16వ డివిజన్‌లో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ దంపతుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబాలకు చీర, సారె అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాపాలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటిని అందించడమే లక్ష్యమని తెలిపారు. నూతన గృహాల్లో లబ్ధిదారులు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో 16వ డివిజన్ కార్పొరేటర్ కాంతాల జగన్‌రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, శ్రేయోభిలాషులు పాల్గొని లబ్ధిదారుల కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు.

## జీవో నెంబర్ 97ను రద్దు చేయాలి



**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 25 (సింగిడి):** పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపే జీవో నెంబర్ 97ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని బి ఆర్ ఎస్ వి రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకులు బంటు సందీప్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ విద్యార్థులచే భారీ ర్యాలీని మానవహారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయకపోగా పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును చింద్రం చేసే జీవోలు తీసుకురావడం ఏంటని ప్రశ్నించారు. లండన్ ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం హాస్యాస్పదమని విమర్శించారు. ఈ సి ఈ టి బిటెక్ లెటర్ ఎంట్రీ పొందే అవకాశాలు ఎస్బిఐటిఈటి స్వయం ప్రతిపత్తి డిప్లమా విద్య ప్రాధాన్యత దెబ్బతినే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే 97 జీవోను వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థులతో ధర్నాలు నిర్వహిస్తామని అన్నారు. ఖమ్మం పాటి ఉదయ్,భూక్య శ్రీనాథ్,చింతపల్లి సంపత్, ధరావత్ బబ్లు,వెంకట్, చందు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరి మున్సిపాలిటీలో మురుగు తిప్పలకు ఇక చెక్..

- డ్రైనేజీల నిర్మాణంతో మారనున్న వార్డుల ముఖచిత్రం
- యుజిడి పనులకు శంకుస్థాపన చేసిన చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి



చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, కౌన్సిలర్లు గంజి శ్రీవాణి గణేష్, బెండ స్వరూప లాల్ రాజ్ లతో కలిసి శంకుస్థాపన చేశారు.

**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 25 (సింగిడి):** భువనగిరి మున్సిపాలిటీ అభివృద్ధిపై మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి ప్రత్యేక దృష్టితో దశాబ్ద కాలం నుండి పేరుక పోయిన ప్రధాన సమస్యలను గుర్తించి పట్టణాన్ని సుందరీకరణలో భాగంగా తీర్చిదిద్దుతున్నారు. డ్రైనేజ్ వ్యవస్థలకు ప్రత్యేక నిధులు కేటాయించడంతో పట్టణంలో మురుగు నీటితో ఇబ్బందులు పడుతున్న వార్డుల ముఖచిత్రం ఇక మారనున్నది. యు జి డి నిర్మాణాలతో మురుగు కాలువలకు శుభం కార్డు పడనున్నది. 11, 25 వార్డుల్లో నాలుగు లక్షల ప్రత్యేక నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, కౌన్సిలర్లు గంజి శ్రీవాణి గణేష్, బెండ స్వరూప లాల్ రాజ్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీవాణి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో భువనగిరి మున్సిపాలిటీ అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యం పర్యావరణ పరిరక్షణ గ్రీన్ టౌన్ గా ఏర్పాటు చేయడమే లక్ష్యంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునిక పద్ధతిలో నిర్మిస్తున్నట్లు ఆమె తెలిపారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా పరిశుభ్రత కే తమ మొదటి ప్రాధాన్యత అని చైర్మన్ పేర్కొన్నారు. దశాబ్దాల కాలం నుండి డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న వార్డ్ వాసులకు ఈ యూజీడీ పూర్తి కావడం సమస్యకు పరిష్కారం లభిస్తుందని వివరించారు. కాంట్రాక్టర్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు మరియు మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. ఎమ్మెల్యే, చైర్మన్ ప్రత్యేక శ్రద్ధ చూపిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిధులు కేటాయించడంతో వార్డు ప్రజలు ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో, టీపీసీసీ మెంబర్ తంగళ్ళపల్లి రవికుమార్, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల బాలరాజు, కాంట్రాక్టర్ బుగ్గ కృష్ణమూర్తి, గంగాధర్, శ్రీనివాస్, కూర శివకుమార్, వార్డు ప్రజలు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహా దర్నాను జయప్రదం చేయండి : టీజీఈ జెఏసి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ పిలుపు



**భూపాలపల్లి, ఆగస్టు 25 (సింగిడి):** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా భాగస్వామ్య సంఘాల ప్రతినిధుల సన్నాహక సమావేశం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించబడుతుంది. జిల్లా టీజీఈ జెఏసి చైర్మన్ బూరుగు రవికుమార్, కన్వీనర్ విజయలక్ష్మిల ఆధ్వర్యంలో జరగనున్న ఈ సమావేశంలో, రాబోయే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అవసరమైన కార్యాచరణపై విస్తృతంగా చర్చించనున్నారు. ఉద్యోగులు ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం పలు ప్రధాన అంశాలపై పోరాట ప్రణాళికను రూపొందించనున్నారు. అందులో భాగంగా, రాబోయే నిరసన కార్యక్రమాలకు సంబంధించి జిల్లా కలెక్టర్ , జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కు అధికారికంగా మహాధర్నా నోటీసు అందజేశారు . అలాగే, ఈ నెల 27వ తేదీన కలెక్టరేట్ ముట్టడి , ధర్నా కార్యక్రమంపై స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేసి, ఉద్యోగుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు చర్యలు చేపడతారు. మరోవైపు, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే ప్రధాన డిమాండ్‌తో సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహించే "పెన్షన్ విద్రోహ దినం" నిరసన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తారు. అంతేకాకుండా, సెప్టెంబర్ 10న రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన "మహాధర్నా" కార్యక్రమానికి జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో తరలివెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. ఈ సన్నాహక సమావేశానికి టీజీఈ జెఏసి జిల్లా వైస్ చైర్మన్లు, కో-చైర్మన్లు, కార్యదర్శులు, వివిధ డిపార్ట్‌మెంట్ ఫోరమ్‌ల ప్రతినిధులు మరియు అన్ని సభ్య సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు సమయానికి హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా టీజీఈ జెఏసి నాయకత్వం విజ్ఞప్తి చేసింది.

## చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు




**హన్మకొండ, ఆగస్టు 25 (సింగిడి):** వరంగల్ కమిషనరేట్ పరిధిలో చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగను మిల్స్ కాలనీ, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసారు. అరెస్టుకు సంబంధించిన వివరాలను డీసీపీ ధారా కవిత సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పూర్తి వివరాలను వెల్లడించారు. నిందితుడి నుండి సుమారు రూ 12 లక్షల విలువ గల 70.19 గ్రాముల బంగారు అభరణాలు, 527.9గ్రాముల వెండి, రూ 29,875/- రూపాయలు నగదు, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల జరిగిన వరుస దొంగతనాలకు సంబంధించి మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు కాగా వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత,ఐపీఎస్ అదేశాల ప్రత్యేక దర్యాప్తు బృందాలను నియమించడం జరిగింది. సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో ప్రత్యేక దృష్టిసారించి నేర విచారణ చేయడం జరిగింది. గత కాలంగా జరిగిన చోరీలను విశ్లేషణ చేస్తున్న క్రమంలో ఉదయం ఒక అనుమానిత వ్యక్తిని అదుపులో తీసుకోని విచారించగా మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీలకు సంబందించి కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఆశిష్ శ్రీనివాస్ రెడ్డిమల్ల,(27) నివాసం పెద్దపల్లి, తెలంగాణ రాష్ట్రం, ప్రస్తుతం మహరాష్ట్ర లోని చంద్రపూర్‌లో నివాసం వుంటున్న నిందితుడు సులభంగా డబ్బు సంపాదించాలని తాళం వేసి వున్న ఇండ్లల్లో చోరీలకు పాల్పడినట్లుగా ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ రోజు ఉదయం మిల్స్ కాలనీ పోలీసులు వరంగల్ రైల్వే స్టేషన్‌లో అరెస్టు చేసి నిందితుడి నుండి చోరీ సోత్తును స్వాధీనం చేసుకోని విచారించగా నిందితుడు పగటి సమాయల్లో తాళం వేసివున్న ఇండ్లను గుర్తించి రాత్రి సమయాల్లో చోరీలకు పాల్పడేవాడనీ తెలిపాడు. ఇదే రీతిలో నిందితుడు 2024, 2025 మహారాష్ట్రలో మొత్తం నాలుగు చోరీలకు పాల్పడటంతో నిందితుడిని మహరాష్ట్ర పోలీసులు అరెస్టు చేసి జైలు తరలించగా, బెయిల్‌పై జైలు నుండి విడుదలయ్యాడు. అయినప్పటికీ అతనిలో ఎలాంటి మార్పురాకపోగ మరో మారు మిల్స్ కాలనీ పరిధిలోని శివనగర్, ఎస్.ఆర్.ఆర్ నగర్ ప్రాంతంలో తాళం వేసి వున్న ఇండ్లల్లో వరుస చోరీలకు పాల్పడినట్లుగా నిందితుడు విచారణలో వెల్లడించాడు. చోరీకి పాల్పడిన అంతర్ రాష్ట్ర నిందితుడి పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ ఇన్స్ స్పెక్టర్ రామకృష్ణ,మీల్స్‌కాలనీ ఇన్స్ స్పెక్టర్ స్వామి, ఎస్. ఐ మహేష్, ఏ. ఏ.ఓ సల్మాన్ పాషా తో పాటు క్రైంగ్ సీసీ ఎస్. మిల్స్ కాలనీ సిబ్బందిని కమిషనర్ అభినందించారు.

## స్టేట్ అండర్ 14 క్రికెట్ జట్టుకు జశ్వంత్

మహబూబాబాద్ జిల్లా మరిపెడ విద్యార్థికి అరుదైన అవకాశం



**దోర్నకల్ /మరిపెడ ఆగస్టు 25 (సింగిడి):** ఇటీవల వరంగల్ వేదికగా జరిగిన అండర్-14 జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో వికెట్ కీపర్ కం బ్యాట్స్ మెన్ గా అద్భుత ప్రతిభ కనబరిచిన మేరుగు జశ్వంత్, తెలంగాణ స్టేట్ అండర్-14 జట్టుకు ఎంపికయ్యాడు. అతని ఆటతీరును గుర్తించిన సెలెక్టర్లు తెలంగాణ స్టేట్ అండర్-14 జట్టులో స్థానం కల్పిస్తూ జట్టును ప్రకటించారు. ఈ నెల 26, 27, 28, 29 తేదీల్లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని చంపా జిల్లాలో జరగనున్న అండర్-14 క్రికెట్ టోర్నమెంట్‌లో తెలంగాణ జట్టు తరఫున జశ్వంత్ పాల్గొననున్నాడు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన మెరుగు జశ్వంత్ స్థానిక సెయింట్ అగస్టీన్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. చిన్నప్పటి నుంచి క్రికెట్ పై ఆసక్తి కలిగిన జశ్వంత్ స్టేట్ టీంకు ఎంపిక అవటంతో తల్లి దండ్రులు,పాఠశాల ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,తోటి విద్యార్థులు అభినందిస్తున్నారు.

## వన మహోత్సవ లక్ష్యాలను పూర్తి చేయాలి : మంత్రి కొండా సురేఖ

- రేపు జిల్లావ్యాప్తంగా భారీగా సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించాలి
- అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సమీక్ష



**హన్మకొండ, ఆగస్టు 25 (సింగిడి):** వన మహోత్సవంలో భాగంగా జిల్లాలకు నిర్దేశించిన మొక్కల నాటే లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేసి విధంగా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమంపై మంత్రి కొండా సురేఖ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించగా, హనుమకొండ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. మంగళవారం వన మహోత్సవంలో భాగంగా అన్ని జిల్లాల్లో భారీ స్థాయిలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించి, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు, రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ అనుకూల వాతావరణాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని మంత్రి సూచించారు. ప్రతి మండలం, గ్రామం, పట్టణ ప్రాంతానికి స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి రేపటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులను పెద్దసంఖ్యలో కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని మంత్రి సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించి కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మంత్రి తెలిపారు. ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని, మొక్కల మనుగడను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, చనిపోయిన వాటి స్థానంలో వెంటనే కొత్త మొక్కలను నాటాలని ఆదేశించారు. నాణ్యమైన మొక్కలను మాత్రమే నాటాలని, అవసరమైనవి సకాలంలో తరలించాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూములను గుర్తించి మొక్కలు నాటాలని, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్ట్రీని ప్రోత్సహించాలని అన్నారు. దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల్లో కూడా ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని సూచించారు. బ్లాక్ ప్లాంటేషన్ ప్రాంతాల్లో నీటి సౌకర్యం కల్పించాలని, వన మహోత్సవ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించి మీడియాను కూడా భాగస్వామ్యం చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వన మహోత్సవం కింద జిల్లాలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నిర్దేశిత మొక్కలు నాటి లక్ష్యం చేరుకునే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు,స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, ప్రజల భాగస్వామ్యంతో జిల్లాలో వన మహోత్సవ లక్ష్యాన్ని చేరేవిధంగా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

## లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటాలి

రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



**భూపాలపల్లి ప్రతినిధి, ఆగస్టు 25 (సింగిడి):** వనమహోత్సవం-2026 కార్యక్రమంలో జిల్లాలకు కేటాయించిన మొక్కలు నాటే లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుండి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వినయ్ కుమార్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారులతో వనమహోత్సవం-2026 లక్ష్యసాధనపై మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ భావితరాలకు సమతుల్యమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవంలో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 56 శాతం లక్ష్యాలను సాధించినట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాలను సెప్టెంబర్ చివరి వారం నాటికి నూరు శాతం పూర్తి చేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో లక్ష్యాలను సాధించలేకపోయామని ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుని మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. నాటిన ప్రతి మొక్క జీవించేలా చర్యలు తీసుకోవాలని, పశువులు, జంతువుల నుంచి మొక్కలను రక్షించేందుకు అవసరమైన చోట్ల ట్రీగార్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అర్బన్ ఫారెస్ట్ ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేయాలని సూచించారు. దేవాలయాల ప్రాంగణాల్లో ప్రత్యేకంగా ఎంపిక చేసిన మొక్కలను నాటేలా అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా నుండి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ వనమహోత్సవం-2026లో భాగంగా జిల్లాకు 25.26 లక్షల మొక్కలు నాటే లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు 19.37 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్డీఓ బాలకృష్ణ, ఎఫ్డిఓ అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.



# చల్లని సలాడ్! ఒక్కసారి ట్రై చేయండి!

మండే వేసవి ఎండల్లో శరీరాన్ని చల్లగా, తేలికగా ఉంచుకోవడానికి పండ్లు, కూరగాయలపై ఆధారపడటం చాలా మంచిది. అటువంటి ఆరోగ్యకరమైన, సులభంగా తయారుచేయగల వంటకాల్లో ఒకటి పచ్చి బొప్పాయి సలాడ్.దపులుపు, తీపి, కారం రుచుల సమతుల్యతతో ఇది కేవలం రుచికరమైన సలాడ్ మాత్రమే కాదు, శరీరాన్ని శు ద్ధి చేసే పోషకాహారం కూడా...

**ఈ సలాడ్ ఆరోగ్య ప్రయోజనాలు**

పచ్చి బొప్పాయి ని "సూపర్‌ఫుడ్"గా పరిగణించడానికి కారణం దానిలో ఉండే పాపైన్ (ఋఖజుఖఅఅ) ఎంజైమ్. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఆహారంలోని ప్రోటీన్లను సులభంగా విడగొట్టి, శరీరం పోషకాలను బాగా గ్రహించేందుకు సహాయపడుతుంది.

అదేవిధంగా, పచ్చి బొప్పాయి శరీరంలోని వ్యర్థాలను తొలగించడంలో సహాయపడుతుంది. వేసవిలో కనిపించే ఉబ్బరం (బ్లోటింగ్) తగ్గించడంలో ఇది ఉపయోగకరం. ఇందులో అధికంగా ఉండే పీచుపదార్థం (ఫైబర్) ఆకలిని నియంత్రించి, అనవసరమైన చిరుతిళ్లను తగ్గించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా ప్రేగుల ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది.

**కావలసిన పదార్థాలు**

**ఈ సులభమైన సలాడ్ కోసం సాధారణంగా ఇంట్లో ఉండే పదార్థాలు చాలును:**

తురిమిన పచ్చి బొప్పాయి – 1 కప్పు
తరిగిన పుదీనా ఆకులు – 2 టేబుల్ స్పూన్లు
నిమ్మరసం – 1.5 టేబుల్ స్పూన్లు
వేయించిన జీలకర్ర పొడి – 1/4 టీస్పూన్
ఉప్పు – రుచికి సరిపడా (సుమారు 1/4 టీస్పూన్)
తేనె – 1 టీస్పూన్
దోసకాయ ముక్కలు – 1/4 కప్పు (ఐచ్ఛికం, చల్లదనం కోసం)
వేయించిన వేరుశెనగలు – ఒక గుప్పెడు

**తయారీ విధానం**

పచ్చి బొప్పాయి సలాడ్ తయారీ చాలా సులభం, వేగంగా పూర్తవుతుంది.
మొదటగా పచ్చి బొప్పాయి తొక్క తీసి, సన్నగా తురిమాలి. తురిమిన ముక్కలు సమానంగా ఉండేలా చూసుకోవాలి.
ఒక పెద్ద గిన్నెలో ఈ తురుము వేసి, అందులో తరిగిన పుదీనా ఆకులు కలపాలి. తరువాత నిమ్మరసం, వేయించిన జీలకర్ర పొడి, ఉప్పు వేసి బాగా కలపాలి.
రుచిని సమతుల్యం చేయడానికి తేనెను కలపాలి. కావాలనుకుంటే దోసకాయ ముక్కలు కూడా చేర్చుకోవచ్చు, ఇది మరింత చల్లదనాన్ని ఇస్తుంది.
మిశ్రమాన్ని 2–3 నిమిషాలు అలాగే ఉంచితే రుచులు బాగా కలిసిపోతాయి.
చివరగా పైగా వేయించిన వేరుశెనగలు చల్లి సర్వ్ చేయాలి. ఇవి సలాడ్‌కు మంచి కరకరలాడే టెక్స్చర్‌ను ఇస్తాయి.
పచ్చి బొప్పాయి సలాడ్‌ను సైడ్ డిష్‌గా లేదా తేలికపాటి స్నాక్‌గా తీసుకోవచ్చు.
నిమ్మరసం, పుదీనా కలయిక దీనికి తాజాదనాన్ని ఇస్తూ శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.
ఈ వేసవిలో ఆరోగ్యకరమైన అలవాటును ప్రారంభించాలనుకునే వారు తప్పకుండా ఈ సలాడ్‌ను ప్రయత్నించవచ్చు.



మామిడి vs పుచ్చకాయ: ఎండాకాలంలో

## శరీర వేడిని తగ్గించడానికి ఏది బెస్ట్..?

నీటి శాతం ఎందులో ఎక్కువ: దాహం తీర్చుకోవడంలో పుచ్చకాయకు సాటి ఏదీ లేదు. ఇందులో దాదాపు 90శాతం పైగా నీరు ఉంటుంది. ఎండలో తిరిగే వారికి, శరీరంలో నీటి శాతం తగ్గిపోకుండా చూడటంలో ఇది దిట్ట. మామిడి పండు రసభరితంగా ఉన్నప్పటికీ, దాని సాంద్రత ఎక్కువ. ఇది శరీరానికి తేమను అందిస్తుంది కానీ పుచ్చకాయ అంత వేగంగా బాడీని రీఛార్జ్ చేయలేదు.

శక్తి వర్సెస్ చల్లదనం: మామిడి పండులో సహజ చక్కెరలు ఎక్కువగా ఉంటాయి. ఇది తిన్న వెంటనే మీకు మంచి శక్తిని ఇస్తుంది. నీరసంగా అనిపించినప్పుడు మామిడి పండు తింటే వెంటనే హుషారు వస్తుంది. శరీరంలోని వేడిని తగ్గించి,



తక్షణమే సేదతీర్చడంలో పుచ్చకాయ నెంబర్ వన్. ఇది జీర్ణం కావడానికి కూడా చాలా తేలికగా ఉంటుంది.

పోషకాల పరంగా ఏది టాప్: రెండు పండ్లూ ఆరోగ్య ప్రదాతలే, కానీ వాటి ప్రత్యేకతలు వేరు. మామిడి లో విటమిన్–ూ, విటమిన్–జ పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా చర్మ సౌందర్యానికి మేలు చేస్తాయి. ఇందులో లైకోపీన్ వంటి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి, ఎండ వల్ల చర్మం కాలిపోకుండా రక్షించడానికి తోడ్పడతాయి.





జీర్ణక్రియ – శరీర వేడి: ఇక్కడే అసలైన ట్విస్ట్ ఉంది. మామిడి పండు రుచిగా ఉందని ఎక్కువగా తింటే శరీరంలో వేడి పెరిగే అవకాశం ఉంటుంది. దీనివల్ల కొందరికి వేసవిలో మొటిమలు లేదా వేడి కురుపులు వస్తుంటాయి. అందుకే మామిడి పండును మితంగా తినాలి. అదే పుచ్చకాయ అయితే ఎన్ని తిన్నా శరీరాన్ని చల్లబరుస్తూనే ఉంటుంది.

ఏది ఎప్పుడు తినాలి?: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు పుచ్చకాయ తినడం ఉత్తమం. ఇది మిమ్మల్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. శక్తి కోసం, కడుపు నిండుగా ఉండటం కోసం ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో మామిడి పండును ఎంచుకోవచ్చు. డయాబెటిస్ ఉన్నవారు మాత్రం మామిడి పండు విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

20 ఏళ్ల అప్పు

## 10 ఏళ్లలోనే క్లోజ్..

రూ.30 లక్షలు ఆదా చేసే అద్భుతమైన ట్రిక్..!

స్టాక్ మార్కెట్
Stock Market

సొంతిల్లు అనేది ప్రతి ఒక్కరి జీవిత కల. కానీ, ఆ కల కోసం తీసుకునే హోమ్ లోన్ సుమారు 20 నుండి 25 ఏళ్ల పాటు మనల్ని రుణగ్రస్తులుగా మారుస్తుంది.మనం తీసుకున్న అసలు మొత్తం కంటే వడ్డీ రూపంలోనే బ్యాంకుకు రెండింతలు చెల్లించాల్సి వస్తుంది. అయితే, సరైన ఆర్థిక ప్రణాళికతో ఈ వడ్డీ భారాన్ని భారీగా తగ్గించుకోవచ్చు.

**వడ్డీ మాయాజాలం: ఫ్రంట్–లోడింగ్ అంటే ఏమిటి?**

హోమ్ లోన్ తీసుకున్న మొదటి 5 నుండి 7 సంవత్సరాలు అత్యంత కీలకమైనవి. దీనిని 'ఫ్రంట్–లోడింగ్' అంటారు. అంటే, మీరు కట్టే ప్రతి ఈఎంఐ (జువీ×)లో ఎక్కువ భాగం వడ్డీకే పోతుంది, అసలు మాత్రం చాలా తక్కువగా తగ్గుతుంది. ఉదాహరణకు మీరు రూ.50,000 ఈఎంఐ కడుతుంటే అందులో దాదాపు రూ.40,000 వడ్డీకే వెళ్తుంది. దీనివల్ల లోన్ కాలపరిమితి ముగిసేసరికి మీరు తీసుకున్న అప్పు కంటే చాలా ఎక్కువ మొత్తాన్ని బ్యాంకుకు సమర్పించుకుంటారు. మీ లోన్ కాలాన్ని సగానికి తగ్గించడానికి ఉన్న అత్యంత ప్రభావవంతమైన మార్గం వార్షిక టాప్–అప్. ప్రతి ఏటా మీ జీతం పెరిగినప్పుడు, మీ ఈఎంఐ మొత్తాన్ని కూడా 5% నుండి 10% పెంచుకుంటూ పోవాలి.

**ఉదాహరణకు:**
మీరు 9% వడ్డీతో రూ.50 లక్షల లోన్‌ను 20 ఏళ్ల కాలపరిమితికి తీసుకుంటే మీరు చెల్లించాల్సిన మొత్తం వడ్డీ సుమారు రూ.58 లక్షలు అవుతుంది.

**సింపుల్ ట్రిక్:**
అదే ఈఎంఐని ప్రతి సంవత్సరం కేవలం 10% పెంచుకుంటూ వెళ్తే, అదే లోన్‌ను కేవలం 10 సంవత్సరాల్లోనే పూర్తి చేయవచ్చు. దీనివల్ల మీకు సుమారు రూ.30 లక్షల వడ్డీ ఆదా అవుతుంది.




**మొదటి 5 ఏళ్లలోనే అదనపు చెల్లింపులు**

లోన్ తీసుకున్న తొలి ఐదేళ్లలో చేసే అదనపు చెల్లింపులు (ాతీవ–జూఖఎవఱం) అసలు మొత్తాన్ని వేగంగా తగ్గిస్తాయి. అసలు తగ్గితే, దానిపై పడే వడ్డీ కూడా గణనీయంగా తగ్గుతుంది. సంవత్సరానికి కనీసం ఒక అదనపు ఈఎంఐని చెల్లించడం వల్ల కూడా మీ లోన్ భారం త్వరగా తగ్గుతుంది. ఇలా ఆదా చేసిన లక్షలాది రూపాయలను మీ పిల్లల చదువులకో లేదా మీ రిటైర్మెంట్ కోసమో ఉపయోగించుకోవచ్చు. 20 ఏళ్ల పాటు అప్పుల ఊబిలో ఉండటం కంటే, ప్రారంభంలో కొంచెం అదనంగా కష్టపడి ఈఎంఐని పెంచుకోవడం ద్వారా త్వరగా ఆర్థిక స్వేచ్ఛను పొందవచ్చని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

## చాణక్య నీతి: జీవితంలో దుఃఖాన్ని జయించాలంటే ఈ అలవాట్లు తప్పనిసరి!

చాణుక్యుడు మన జీవితంలో జరిగే ముఖ్య విషయాలను గురించి ముందే చెప్పారు. వీటిని తెలుకోవడానికి ఇప్పటికి ఎంతో మంది ఆసక్తి చూపిస్తున్నారు. అలా మనిషి జీవితం గురించి ముందే ఎన్నో విషయాలను చెప్పాడు.

అయితే, మన జీవితంలో దుఃఖాన్ని జయించాలంటే ఈ అలవాట్లు తప్పనిసరి అంటున్న చాణక్యుడు. మరి, ఆయన విషయాలు ఏంటో ఇక్కడ వివరంగా తెలుసుకుందాం..

దానం చాలా గొప్పదని చాణక్యుడు చెబుతున్నాడు. అయితే, దానధర్మాలు చేసే ఆ మనిషి పేదరికంలో ఉండరు. అలాగే, లక్ష్మీదేవి ఆశీస్సులను కూడా పొందుతారు. ఇంకా డబ్బు మాత్రమే కాకుండా ఆహారానికి కూడా లోటు లేకుండా ఉంటుంది. ఇలా ఇతరులకు చేసే సాయం ఆ వ్యక్తి తన లైఫ్ లో గౌరవం పెరుగుతుందని చాణక్యుడు అంటున్నారు.

మంచి ప్రవర్తన కలిగిన మనుషులు సమాజంలో ఎప్పుడూ కింద పడిపోరు. వారికి అవమానాలు పెద్ద లెక్క కాదు, ఎప్పుడు ఏం చేయాలో వాళ్ళకి బాగా తెలుసు. అలాగే, ధర్మాన్ని గౌరవిస్తూ ముందుకు వెళ్తే కాలమే గొప్ప సహాయం చేస్తుంది. ఇంకా గౌరవం కూడా పెరుగుతుంది. ఇది మాత్రమే కాకుండా జీవితంలో ముందుకు వెళ్తారని చాణక్యుడు అంటున్నారు.

అజ్ఞానం మనిషిని కిందకు లాగేస్తుంది. ఇది పెద్ద అడ్డు గోడ అని చాణక్యుడు అంటున్నారు. జ్ఞానంతో ఉంటే చీకటిలో వెలుగు వైపు వెళ్లొచ్చు. ఇంకా ఎప్పుడూ నేర్చుకునే విధంగా ఉండాలి. అలాగే, తెలివిగా వ్యవహరించే మనుషులు వారి లైఫ్ లో ఎప్పుడూ ముందే ఉంటారని చాణక్యుడు చెబుతున్నారు.

చాణక్యుడి నీతి ప్రకారం, నిత్యం దేవున్నీ పూజిస్తే సానుకూల ఆలోచనతో పాటు భయాలు కూడా పూర్తిగా తొలగిపోతాయి. అలాగే, మనిషి అన్ని కర్మలు ఇక్కడే అనుభవించాల్సి ఉంటుంది.



రష్యా చమురు దిగుమతులు..

## ఆ డేటా వెల్లడించలేం: పీపీఏసీ

రష్యా నుంచి భారత్‌కు చమురు దిగుమతులకు సంబంధించిన సమగ్ర వివరాలను ఆర్టీఐ కింద అందజేయడం కుదరదని పెట్రోలియం శాఖ ఆధ్వర్యంలోని 'పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్' (ప్రాూజ) తెలిపింది. ఇది వాణిజ్యపరమైన, గోప్యమైన అంశం కావడంతో సమాచార హక్కు చట్టం కింద మినహాయింపు ఉందని పేర్కొంది. దేశ వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలను ఉటంకిస్తూ.. కేంద్ర సమాచార కమిషన్ (జ×జ) కూడా దీనిని సమర్థించింది.

2022 జూన్ నుంచి 2025 జూన్ మధ్యకాలంలో రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకున్న ముడి చమురు వివరాలను అందజేయాలని 'పీపీఏసీ'లో ఓ ఆర్టీఐ పిటిషన్ దాఖలైంది. ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఓఎన్‌జీసీ విదేశ్, రిలయన్స్ ఇండస్ట్రీస్, నయారా ఎనర్జీ వంటి సంస్థల వారీగా కూడా డేటా కావాలని దరఖాస్తుదారు కోరారు. అయితే, ఈ సమాచారాన్ని ఇచ్చేందుకు 'సెంట్రల్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్' (సీపీఐవో) నిరాకరించారు.

"దేశాలు, కంపెనీల వారీగా ముడి చమురు దిగుమతులకు సంబంధించిన సమాచారం వాణిజ్యపరమైనది, గోప్యమైనది. ఆర్టీఐ చట్టం కింద ఈ డేటాను వెల్లడించడాన్ని మినహాయించారు. అయితే, ముడి చమురు మొత్తం దిగుమతి పరిమాణం, విలువను పీపీఏసీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు" అని సీపీఐవో తెలిపారు. ఫస్ట్ అప్పీలేట్ అథారిటీ సైతం ఈ సమాధానాన్ని సమర్థించింది.




**దిగుమతులపై ఆధారపడటం తగ్గేదెప్పుడో?**

దీంతో దరఖాస్తుదారు.. సీఐసీని ఆశ్రయించారు. ఇంధన రంగంలో దేశం ఎలా పనిచేస్తుందో తాను తెలుసుకోవాలనుకుంటున్నట్లు చెప్పారు. అయితే.. ఈ సమాచారాన్ని వెల్లడించడం దేశ వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తుందని సీఐసీ పేర్కొంది. ఇతర దేశాలతో సంబంధాలను కూడా ప్రభావితం చేస్తుందని తెలిపింది. ఈ సమాచారం భౌగోళిక రాజకీయ సంబంధాలతో ముడిపడి ఉందని చెప్పింది. ఆర్టీఐ చట్టం కింద మినహాయింపు చెల్లుబాటు అవుతుందని స్పష్టం చేసింది.

## జడ్చర్లలో మిలాద్ -ఉన్-నబీ రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ




**జడ్చర్ల ప్రతినిధి, (సింగిడి):** మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న మిలాద్ డొనేషన్ క్యాంప్ పోస్టర్‌ను నిర్వాహకులు ఆవిష్కరించారు. అనంతరం కె.ఎం. యాసర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా 8వ మిలాద్ బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను కావేరమ్మ పేట జామే మసీదు ప్రాంగణంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముస్లిం మైనార్టీలు ప్రజలు, ముఖ్యంగా యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. మిలాద్ జలూస్(ఊరేగింపు) ఆగస్టు 26న బుధవారం జడ్చర్ల పట్టణం కేంద్రంలోని మైమాన్ మసీదు నుంచి ప్రారంభమై జడ్చర్లలోని ప్రధాన మార్గాలు నేతాజీ చౌరస్తా, గాంధీ చౌరస్తా, సిగ్నల్ గడ్డ,మీదుగా సాగి కావేరమ్మ పేట జామా మసీదు వద్ద ముగుస్తుందని తెలిపారు. అనంతరం జుహర్ నమాజ్ నిర్వహించబడుతుందని, జలూస్‌లో పాల్గొనే వారి కోసం కావేరమ్మపేట లోని దారుల్ ఉలూమ్ మదర్సా ప్రాంగణంలో భోజన ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. అన్ని కార్యక్రమాల్లో ఆశిఖాన్-ఎ-రసూల్ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ షఫీ, మహమ్మద్ సులేమాన్, సోహైల్ ఖాద్రీ, షాహిద్, రఫీక్, ఫర్హాన్ తదితరులు పాల్గొన్నారు.

## పీజీ కాలేజ్ ఆవరణలో మొక్కలు నాటిన మున్సిపల్ చైర్పర్సన్

**-మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రహీం పాషా**



**కోడేరు (సింగిడి):** కొల్లాపూర్ పీజీ కాలేజ్ ఆవరణలో కళాశాల విద్యార్థులు మరియు మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవం గురించి మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి సత్యం మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రహీం పాష పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాదు.. వాటి సంరక్షణకు బాధ్యత వహించాలి. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో పచ్చదనం పెంపు అందరి బాధ్యత అని తెలియజేశారు. వన మహోత్సవాన్ని ఒకరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగించాలి అని తెలిపారు. మొక్కలు భవిష్యత్‌లో వృక్షాలుగా ఎదిగేలా నిరంతర పర్యవేక్షణ చేయాలి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి సత్యం మరియు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రహీం పాష తో పాటుగా మున్సిపల్ కౌన్సిలర్లు పసుల సుజాత వంగ అనూష పెబ్బేటి శేఖర్ మానవపాడు నరసింహ కర్ణి శివ మున్సిపల్ కమిషనర్ శంకర్ మేనేజర్ జగదీష్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మరియు యాజమాన్యం కళాశాల విద్యార్థిని విద్యార్థులు మహిళా సంఘం సభ్యురాలు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా వన మహోత్సవం




**జడ్చర్ల ప్రతినిధి (సింగిడి):** జడ్చర్ల పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జడ్చర్ల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు డబుల్ బెడ్ రూమ్ కాలనీ ప్రాంగణంలో, అలాగే 24వ వార్డు ఎల్లమ్మ దేవాలయం పరిసర ప్రాంతాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ యం. గిరీష్ హాజరై మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించాలని, హరిత జడ్చర్లగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాజేందర్ గౌడ్,అశోక్ యాదవ్. టౌన్ ప్రెసిడెంట్ వంశీ చారి, రఘు ,వార్డు ఆఫీసర్ రమేష్, ఇ,ఇ, అశోక్, కృష్ణయ్య , రాధాకృష్ణ,మున్సిపల్ సిబ్బంది, స్థానిక కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు.

## శాస్త్రీయ సాగుతో అధిక దిగుబడులు సాధించాలి



**చేవెళ్ల, (సింగిడి):** సమతుల్య పోషకాలు అందించి సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సా ధించవచ్చని ఏఓ శంకర్ లాల్ తెలిపారు. ఆత్మ సౌజన్యంతో, వ్యవసాయ సహాయ సంచాల కులు బి. సురేష్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం ఆలూరు, చేవెళ్ల, మల్కాపూర్ గ్రామాల్లో క్షేత్రస్థాయి ప్రదర్శనలు నిర్వహించారు. వరి, కంది పంటల్లో పోషక యాజమాన్యం, సస్యరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. నేల స్వభావానికి అనుగుణంగా ఎరువులు వినియోగిస్తూ శాస్త్రీయ సాగు పద్ధతులను పాటించాలని సూచించారు. తెగుళ్లు, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్షేత్రస్థాయిలో వివరించారు. పంటలకు అవసరమైన పోషకాలను సరైన మోతాదులో అందించి, సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

## రాహుల్ కుటుంబానికి

# తక్షణం న్యాయం జరిగేలా ప్రయత్నిస్తా

**-మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి హామీ**




**జవహర్ నగర్, (సింగిడి):** దివ్యాంగుడైన రాహుల్ కుటుంబానికి తక్షణం న్యాయం జరిగేలా ప్రయత్నిస్తానని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. దివ్యాంగుడైన రాహుల్ కు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు కి కృషి చేస్తానని రాహుల్ కుటుంబానికి తక్షణం న్యాయం జరిగేలా చూస్తానని ఆయన పేర్కొన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సింహాద్రి నగర్ చంద్రగిరి కాలనీకి చెందిన 21 ఏళ్ల దివ్యాంగుడు రాహుల్ పుట్టినప్పటి నుండి అంగవైకల్యంతో బాధపడుతూ వీల్ చైర్ కే పరిమితమై ఉండగా తన కుమారుడి వైద్యం కోసం ఎన్నో సంవత్సరాలుగా తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు ఆర్థిక ఇబ్బందులు గూర్చి స్పందించిన తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర జనరల్ సెక్రటరీ మెరుగు శివకృష్ణ మల్కాజ్గిరి బిఆర్ఎస్ సీనియర్ మహిళ నాయకురాలు లక్ష్మి ఆనంద్ చొరవతో మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ రాహుల్ కుటుంబం ఎదుర్కొంటున్న పరిస్థితులను అర్థం చేసుకున్నానని మానవతా దృక్పథంతో రాహుల్ కు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేసే విషయమై కలెక్టర్ తో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తానని తెలిపారు. అలాగే రాహుల్ కుటుంబానికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో తక్షణమే రిక్వెస్ట్ లెటర్ ను అందజేసి కలెక్టర్ కు ఫోన్ చేసి రాహుల్ గురించి వివరించగా కలెక్టర్ సానుకూలంగా స్పందించాలని తెలిపారు. ఈ సందర్భంగా మెరుగు శివకృష్ణ మాట్లాడుతూ దివ్యాంగులు పేదలు నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచిన వారి సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే ముందుండి పనిచేస్తున్నారని రాహుల్ వంటి దివ్యాంగుడికి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తే అతని కుటుంబానికి ఎంతో ఊరట లభిస్తుంది అన్నారు. రాహుల్ కు ప్రభుత్వం అండగా నిలవాలని వీల్ చైర్ కే పరిమితమైన రాహుల్ అతని కుటుంబ పరిస్థితిని ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణలోకి తీసుకొని మానవతా దృక్పథంతో వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయాలని మెరుగు శివకృష్ణ కోరారు. దివ్యాంగులకు కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా గౌరవంగా జీవించేందుకు అవసరమైన నివాస వసతిని కూడా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఉద్యమకారులు నర్సింగ్, వెంకన్న, రామ్ యాదవ్, పాత్రికేయులు చింతల విజయ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఆకునూరును ప్రకృతి గ్రామంగా తీర్చిదిద్దాలి

**సర్పంచ్ కొమ్ము రవి**

**గ్రామంలో వెయ్యి మొక్కలు నాటిన పాలకవర్గం, విద్యార్థులు**



**చేర్యాల, (సింగిడి):** చేర్యాల మండలం ఆకునూరును ప్రకృతి గ్రామంగా తీర్చిదిద్దాలని, అందుకోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆకునూరు గ్రామ సర్పంచ్ కొమ్ము రవి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆకునూరు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కొమ్ము రవి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటి నీరు పోశారు. 25 మంది విద్యార్థుల తలా రెండు మొక్కల చొప్పున దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామస్తులు ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి పచ్చదనం గ్రామంగా తీర్చిదిద్ది పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. చెట్ల పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు శనిగరం వీరస్వామి, గ్రామపంచాయతీ కార్యదర్శి మహమ్మద్ కరీమద్దీన్, ఉపసర్పంచ్ కడారి పల్లవి-భాస్కర్, వార్డు సభ్యురాలు అందె లక్ష్మి, సూర అనిత-సంపత్, తాటికొండ శేఖర్ యాదవ్, జీవ వైవిధ్య యాజమాన్య కమిటీ సభ్యుడు అందె అశోక్, మాజీ కోఆప్షన్ సభ్యురాలు బక్కోని జయలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ మంతపురి లక్ష్మణ్, గ్రామస్తులు షేక్ ఎక్రమద్దీన్, శెట్టె మల్లయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేత్రదానం చేయండి - చిరంజీవిగా జీవించండి

**ఒకరి నేత్రదానంతో ఇద్దరికి చూపు**



**బిజినపల్లి, (సింగిడి):** బిజినపల్లి మండలం పాలెం గ్రామంలో నేత్రదానం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఒకరి నేత్రదానంతో ఇద్దరికి చూపు కల్పించవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. కృష్ణ అన్నారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు 41వ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం బిజినపల్లి మండలం పాలెం జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో 41వ నేత్రదాన పక్షోత్సవాల అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ కె. కృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, సిబ్బంది, ప్రజలతో నేత్రదాన ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు నేత్రదానం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ.. నేత్రదానం ప్రతి కుటుంబంలో ఒక సంప్రదాయంగా మారాలని, అంధులకు చూపునివ్వడం ద్వారా మరణించిన తర్వాత కూడా చిరంజీవిగా నిలవవచ్చని అన్నారు. కార్నియా దెబ్బతినడం, ఇన్ఫెక్షన్లు, రసాయనాలు కంటిలో పడటం వంటి కారణాలతో చూపు కోల్పోయిన వారికి నేత్రదానం ద్వారా ప్రయోజనం కలుగుతుందని వివరించారు. మరణించిన వ్యక్తి నుంచి ఆరు గంటల్లోపు నేత్రాలను సేకరించాల్సి ఉంటుందని తెలిపారు. నేత్రదానం చేయాలనుకునేవారు వ్యక్తి మరణించిన వెంటనే సమీప ఆరోగ్య సిబ్బందికి లేదా దత్తాత్రేయ రావు -- 781069034, కొట్ర బాలాజీ -- 9440876556, భావండ్ల వెంకటేష్ -- 9440847599 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మరణించిన వ్యక్తి తల కింద దిండును ఉంచి, రెండు కళ్లపై తడిపిన దూది ఉంచాలని, వీలైతే గదిలో ఏసీ లేదా కూలర్‌ను వినియోగించాలని, ఫ్యాన్ వేయరాదని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ బీఎంహెచ్‌వో డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, గ్రామ సర్పంచ్ బోనాసి రామకృష్ణ, డిప్యూటీ సర్పంచ్ గోవింద్ శ్రీనివాసులు, జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాలా చారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నేత్ర వైద్య సహాయకులు దత్తాత్రేయ రావు, కొట్ర బాలాజీ, పర్యవేక్షకులు బాదం రాజేశ్వర్, సుజాత, ఆరోగ్య సహాయకుడు గోవర్ధన్, ఏఎన్ఎంలు సరస్వతి, మల్లికా, ఆశా కార్యకర్తలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు...

## పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలి

**-ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయండి**

**-తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు కర్నె సురేందర్**




**జవహర్ నగర్, (సింగిడి):** విద్యకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలని రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కర్నె సురేందర్ డిమాండ్ చేశారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్‌లో సిపిఎం పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా విద్యా సదస్సు కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం నగర కార్యదర్శి శివన్నారాయణ హాజరై మాట్లాడుతూ ఈనెల 30వ తేదీన జిల్లా విద్యా సదస్సును పుచ్చలపల్లి సుందరయ్య ఫంక్షన్ హాల్ ప్రగతి నగర్ బాచుపల్లి లో జరగనుందని ఈ సదస్సుకు మేధావులు ఉద్యోగులు రాజకీయ నాయకులు కవులు కార్మికులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కర్నె సురేందర్ మాట్లాడుతూ విద్యకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో 30% నిధులు కేటాయించాలని, ప్రభుత్వ పాఠశాలలకు కళాశాలలకు అవసరమైన భవనాలు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను లెక్చరర్స్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రైవేట్ పాఠశాలలో ఫీజులను నియంత్రించాలని ప్రైవేట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్షావలి, నగేష్, సంధ్య, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు టీ. కాలేశా, జావేద్ తదితరులు పాల్గొన్నారు.



## పచ్చదనం పెంపొందించడమే లక్ష్యం

**చేవెళ్ల, (సింగిడి):** ప్రతి ఇంటా ఒక మొక్క నాటి, పర్యావరణ పరిరక్షణలో భాగ స్వాములు కావాలని సర్పంచ్ అశోక్ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా మంగళవారం ఇంద్రారెడ్డి నగర్‌లో రోడ్డుకు ఇరువైపులా పొదలను జేసీబీతో తొలగించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మొక్కలను పిల్లల మాదిరిగా సంరక్షించాలని, గ్రామాన్ని పచ్చగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరిం చాలని కోరారు. భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందించేందుకు చెట్ల పెంపకం ఎంతో అవ సరమన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పూర్ణచందర్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ఘనంగా వన మహోత్సవం



**మల్హర్ (సింగిడి):** మల్లారం పాఠశాల ఆవరణలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల రాజయ్య, ఉపసర్పంచ్ అవిరినేని పురుషోత్తమరావు, వార్డు సభ్యులు కోట చంద్రమౌళి, భోగే సదయ్య, పంచాయతీ కార్యదర్శి సాయి చరణ్, ఫీల్డ్ అసిస్టెంట్ సుమలత, టెక్నికల్ అసిస్టెంట్ భవానితో పాటు ఉపాధి కూలీలు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలను విరివిగా నాటి వాటిని సంరక్షించాలని సర్పంచ్ మేకల రాజయ్య సూచించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## పుట్ట మధుకర్ పరామర్శ



**మల్హర్, (సింగిడి):** చిన్నతుండ్ల మాజీ సర్పంచ్ పులిగంటి మమత నరసయ్య తండ్రి మల్లయ్య అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించిన పుట్ట మధుకర్మల్హర్ మండలం చిన్నతుండ్ల మాజీ సర్పంచ్ పులిగంటి మమత నరసయ్య తండ్రి మల్లయ్య మృతి చెందగా, మంథని మాజీ ఎమ్మెల్యే శ్రీ పుట్ట మధుకర్ గారు వారి అంతిమయాత్రలో పాల్గొని పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా మల్లారం గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు దేనవేన దేవేందర్ తండ్రి దేనవేన రాయమల్లు, గడ్డం పోచమ్మ మృతి చెందగా, వారి కుటుంబాలను పుట్ట మధుకర్ పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గోనే శ్రీనివాస్ రావు, బీఆర్ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షులు జాగరి హరీష్, ఉప సర్పంచులు పులిగంటి రాములు, అవిరినేని పురుషోత్తం రావు, వార్డు సభ్యులు కోట చంద్రమౌళి, భోగె సదానందం, నాయకులు మిరియాల పద్దు రావు, కూర సత్తయ్య, అజ్మీర దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలో వన మహోత్సవం



**కోడేరు, (సింగిడి):** కోడేరు మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారము మంగళవారం నాడు ఘనంగా వనమహోత్సవ కార్యక్రమం నిర్వహిం చారు. ఎంపిక చేసిన మొక్కలు, నిర్ణీత స్థలాల లో కళాశాల ప్రాంగణం లో అధ్యాపకు లు ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు కలిసి మొక్కలు నాటి, వాటి పరిరక్షణ బాధ్యత విద్యార్థులు తీసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రకృతి రమణీయంగా మొక్కలు పెరిగి ఆహ్లాదకరంగా ప్రశాంతంగా వాతావరణాన్ని పెంపొందిస్తాయని కళాశాల ప్రిన్సిపాల్ బగవేణి నర్సింహ్మలు అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకురాలు శ్రీమతి పద్మావతమ్మ, వెంకట్ దాస్, శ్రీధర్ బాబు, ప్రవీణ్ కుమార్, బొజ్జ్యా నాయక్, రమేష్, వెంకన్న, రఫిఖ్ పాష, నాగుల్ మీరా, రాముడు, కళాశాల జూనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణ విద్యార్థులు మాసూం బాబా, యశ్వంత్, సాయికుమార్, వాసుదేవ్ పాల్గొన్నారు.

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
బుధవారం
26-8-2026

# మిలాద్-ఉన్-నబీ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శాంతి కమిటీ సమావేశాలు





**వికారాబాద్ ప్రతినిధి, (సింగిడి):** మిలాద్-ఉన్-నబీ పండుగ నేపథ్యంలో వికారా బాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ పోలీస్ అధికా రులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించి, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు జారీ చేశారు. పండుగలు, ఊరేగింపులు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని, అన్ని వర్గాల ప్రజలతో సమన్వయం చేసుకుంటూ శాంతి, సామరస్యాన్ని కాపాడాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. సున్నితమైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఆదేశాల మేరకు మిలాద్-ఉన్-నబీ పండుగ, ఊరేగింపుల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పోలీస్ అధికారులు శాంతి కమిటీ సమావేశాలు నిర్వహిం చారు. వికారాబాద్, పరిగి, తాండూర్, మోమిన్‌పేట్, నవాబ్‌పేట్, కొటేపల్లి, కుల్కచర్ల, దోమ, ధారూర్, కొడంగల్, కరణ్‌కోట్, చెంగోముల్, బొంరాస్‌పేట్, పెద్దేముల్, దుద్యాల్, బంట్వారం తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో వివిధ వర్గాల పెద్దలు, శాంతి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పండుగ నిర్వాహకులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మిలాద్-ఉన్-నబీ వేడుకలను ప్రశాంతమైన, సామరస్యపూర్వక వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. ఊరేగింపులు, సమావేశాలు, ఇతర కార్యక్రమాలను పోలీసుల సూచనలు, నిబంధనలు, నియమావళి మరియు నిర్దేశించిన సమయాలకు అనుగుణంగా నిర్వహించాలని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకుంటూ సంయమనం, సోదరభావంతో వ్యవహరించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చూడాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలకు ఎవరూ పాల్పడవద్దని, సోషల్ మీడియాలో పుకార్లు, అభ్యంతరకరమైన లేదా రెచ్చగొట్టే సమాచారాన్ని ప్రచారం చేయవద్దని పోలీసులు ప్రజలకు స్పష్టం చేశారు. మిలాద్-ఉన్-నబీ వేడుకలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని శాంతి కమిటీ సభ్యులు, మత పెద్దలు, పండుగ నిర్వాహకులు పోలీసులకు హామీ ఇచ్చారు.

## జామియా నిజామీయ వక్ఫ్ భూముల రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలి

### -తెలంగాణ రాష్ట్ర మైనారిటీ హక్కుల పోరాట సమితి




**కొడంగల్, (సింగిడి):** రాయదుర్గ పాణి ముక్త గ్రామంలోని జామియా నిజామీయ వక్త భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ రాయదుర్గ్ సర్వే నెంబర్ 83/1లో 10.63ఎకరాల టీజీ ఐ ఐ సి నీ నిలిపి వేయాలని, 510 ఎకరాల 35 గుంటలకు బౌండరీ వాల్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాయదుర్గ్ లోని వివాదాస్పద భూముల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోరాదని హెచ్చరించారు. వక్ఫ్, రెవెన్యూ, సర్వే, ఇనాము, రిజిస్ట్రేషన్, గెజిట్ మరియు హెరిటేజ్ రికార్డులను సమగ్రంగా పరిశీలించి చట్టబద్ధమైన హక్కులను నిర్ధారించాలని కోరారు. వక్ఫ్ భూముల ను చట్ట బద్దంగా గుర్తించి, భవిష్యత్ లో విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాలకు ఉపయోగ పడేలా అభివృద్ధిచేయాల న్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాహబ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ వసీం, కో ఆర్డినేటర్ మహమ్మద్ అబ్రార్ హుస్సేన్ ఆజాద్, మహమ్మద్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్లో ఎస్ఐఆర్ నోటీసులు జారీ.. ఓటర్లకు కీలక సూచన



**ఆమనగల్లు, (సింగిడి):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్ ) ప్రక్రియలో భాగంగా అధికారులు ఓట ర్లకు నోటీసులు జారీ చేస్తున్నారు. మున్సి పాలిటీ పరిధిలోని 19 పోలింగ్ స్టేషన్ల పరిధిలో మొత్తం 4,437 ఎస్ఐఆర్ నోటీసులు జారీ చేసినట్లు మున్సి పల్ కమిషనర్ రాఘవేందర్ తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు వివరాలు పరిశీలించి వెనుక సూచించిన 13 రకాల ఆధారాల్లో 3 పత్రాలను సమర్పిం చాలని, కేటాయించిన తేదీ, సమయంలో హాజరైన వివరణ ఇవ్వాలని కోరారు..

## రైతులకు ఇబ్బంది లేకుండా రామగిరి వద్ద రిజర్వాయర్ నిర్మాణం చేయాలి



**బల్మూరు, (సింగిడి):** ఉమామహేశ్వర రిజర్వాయర్ నిర్మాణం రైతుల అభిప్రాయం మేరకే నిర్మాణం చేపట్టాలని బలవంతపు భూసేకరణ చేయరాదని బల్మూరు గ్రామంలో జరిగిన గ్రామసభలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం తహసిల్దార్ కి ఇవ్వడం జరిగింది. ప్రస్తుత డిజైన్లు మార్చి రామగిరి వద్ద లేదా తెగిన చెరువు దగ్గర రిజర్వాయర్ నిర్మాణం చేస్తే రైతులకు ఎలాంటి అభ్యంతరం లేదని వాటిని పరిగణలోకి తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులను సిపిఎం పార్టీగా డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శంకర్ నాయక్ మండల నాయకులు లాల్ మమ్మద్ శ్రావణ్ కుమార్ ఆంజనేయులు కృష్ణయ్య బాలరాజు భారీమం పార్టీ సభ్యులు రైతులు పాల్గొన్నారు

## డిజిటల్ రేషన్ కార్డులు పంపిణీ

### -మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు పిట్ల సత్తయ్య



**తొగుట, (సింగిడి):** మండలంలోని కాన్గల్ గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదేవిధంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు డిజిటల్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్ణయించారు. తొగుట మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు పిట్ల సత్తయ్య మాట్లాడుతూ. డిజిటల్ రేషన్ కార్డుల విధానం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు రేషన్ సరుకులు మరింత సులభంగా పాదదర్శంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అర్థత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రయోజనాలు అందే విధంగా ప్రత్యేక దృష్టి సాధిస్తారని తెలిపారు. మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. మన పేద ప్రజల కోసం గృహ జ్యోతి ద్వారా ఉచిత కరెంట్ బిల్లు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పావలా వడ్డీ రుణాలు 2 లక్షల వం-కు రుణమాఫీ ఇంకెన్నో సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి పేద ప్రజలకు కోసం అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వార్డ్ సభ్యులు కార్యదర్శి ప్రవీణ్ గౌడ్ గ్రామ కమిటీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి బ్రహ్మానంద రెడ్డి కొండల్ రెడ్డి అంజిరెడ్డి తొగుట మండల్స్వామి యాదవ్ మండల్ జనరల్ సెక్రెటరీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వనమహోత్సవ వేడుకలు



**కుత్బుల్లాపూర్, (సింగిడి):** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజుల రామారం సర్కిల్ ఉషో దయ కాలనీ పార్కులో వనమ హోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీ యూబీడీ సుభద్రా దే వి ఐఎఫ్ఎస్, గాజులరామా రం సర్కిల్ ఉప కమిషనర్ యు .వెం కట్ రాములు, కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ సతీష్, డీడీ రమేష్, మేనే జర్ విజయరాణి, డీఈ నిఖిల్ రెడ్డి, లిటిల్ స్టార్ స్కూల్ విద్యార్థులు, ఉపా ధ్యాయులు, కాలనీ వాసులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా వనమహోత్సవం.. భారీగా మొక్కల పెంపకం



**ఆమనగల్లు, (సింగిడి):** వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల గ్రామపంచాయతీల సర్పంచ్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా ఆమనగల్లు పురపాలక సంఘం మరియు అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో వనమహోత్సవం ఘనంగా నిర్వహించారు. పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో జంగారెడ్డిపల్లి రహదారికి ఇరువైపులా, పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ప్రజలు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు పెంచాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్. పత్యానాయక్, వైస్ చైర్‌పర్సన్ టి. గీతా ఆచారి, మున్సిపల్ కమిష నర్ ఎస్. రాఘవేందర్ రెడ్డి, ఆమనగల్లు ఎస్‌హెచ్ఓ వెంకటేశ్వర్లు, అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ ఆఫీసర్ జగన్ మోహన్, సబ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌రెడ్డి, కౌన్సిలర్లు ఆంజనేయులు, సునీత ప్రశాంత్, ధోలి, పాపిశెట్టి రామకృష్ణ, ఎ రమేష్, ఎం వెంకటయ్యలతో పాటు మున్సిపల్ మేనేజర్ ఆంజనేయులు, మున్సిపల్ సిబ్బంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. మొక్కల పెంపకంతోనే భావితరాలకు మనుగడ సాధ్యమవుతుందని, భవిష్యత్ తరాలకు సహజ వనరులను అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు రావిచేడ్ సర్పంచ్ బొప్పిడి గోపాల్ అన్నారు. మంగళవారం వనమహోత్సవం--2026 కార్యక్రమంలో భాగంగా కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామంలో సర్పంచ్ బొప్పిడి గోపాల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోపాల్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని భావితరాలకు అందించాలంటే విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించి చెట్లుగా పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రకృతి సంపదను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.. సకాలంలో వర్షాలు కురవాలన్నా, పర్యావరణ సమతుల్యత కొనసాగాలన్నా మొక్కల పెంపకం అత్యంత అవసరమని ఆయన అన్నారు. ప్రతి పౌరుడు తమ ఇళ్ల పరిసరాలు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. వనమహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బందరి యాదయ్య, మాజీ ఎంపీటీసీ యాదయ్య, నాయకులు బాలకృష్ణ, రమేష్, సాయికుమార్, రాజయ్య, దేవేందర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరుపతి నాయక్, తదితరులున్నారు..

# రాజకీయ ఖైదీలను వెంటనే విడుదల చేయండి

## ఇఫ్టు ప్రధాన కార్యదర్శి షేక్షావలి




**జవహర్ నగర్, (సింగిడి):** అప్రజాస్వామికంగా ఆదివాసీ, ప్రజాసంఘాలు, మేధావులపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేసి రాజకీయ ఖైదీలుగా జైల్లో మగ్గుతున్న వారిని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీపీఐ(ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్షావలి డిమాండ్ చేశారు. జవహర్ నగర్ లోని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఐ(ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్షావలి ఆధ్వర్యంలో రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని కోరుతూ ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని మంగళవారం వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్షావలి మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలతో రాజ్యాంగం కల్పించిన ప్రజా సంక్షేమాన్ని, దేశ అభివృద్ధిని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని మండిపడ్డారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఏళ్ళ తరబడి జైల్లో విచారణలు, బెయిల్ లేకుండా ఏళ్ళ తరబడి ఉంటున్న వారిని చట్టబద్ధమైన చర్యలు తీసుకుకోని విడుదల చేయాలన్నారు. రాజకీయ ఖైదీల విడుదలకై ఈ నెల 29న ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలేషా, సావిత్రి, సునీత, చంద్రమౌళి, మోనార్ దుర్గాప్రసాద్, నర్సింహా, శివన్నారాయణ, అరుణ, వెంకటాచారి, యాకస్వామి, ప్రవీణ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల పొదుపు -మహిళల అభివృద్ధికి బలమైన పునాది



**వెల్దుర్తి, (సింగిడి):** మంగళవారం నాడు వెల్దుర్తి మండలంలోని స్త్రీ సమైక్య భవనంలో వెల్దుర్తి మాసాయిపేట ఉమ్మడి మండలాలకు చెందిన మహిళా సంఘాల జనరల్ బాడీ సమావేశంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళల పొదుపు, ఆర్థిక స్వావలంబన, కుటుంబ ఆర్థిక ప్రగతిపై మహిళా సంఘాల పాత్రను ఎమ్మెల్యే వివరించారు. మహిళలు చిన్న మొత్తాలతో ప్రారంభించే పొదుపు అలవాటు భవిష్యత్తులో పెద్ద ఆర్థిక బలంగా మారుతుందని, సంఘాల ద్వారా మహిళలు ఒకరికొకరు అండగా నిలుస్తూ స్వయం ఉపాధి, చిన్న వ్యాపా రాలు, ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలని సూచించారు. "మహిళ చేతిలో ఆర్థిక బలం ఉంటే... కుటుంబం బలపడుతుంది. మహిళ ఎదిగితే సమాజం అభివృద్ధి చెందుతుంది." అనే సందేశంతో మహిళలందరూ ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళల సాధికారతే సమాజ అభివృద్ధికి అసలైన పునాది. అని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మహిళా సంఘాలకు పేర్కొన్నారు.

## బిచ్చల్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను తీర్చండి



**కొడంగల్ (సింగిడి):** దౌల్తాబాద్ మండలంలోని బిచ్చల్ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, విద్యార్థులు ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బిచ్చల్ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రస్తుతం కేవలం నలుగురు ఉపాధ్యాయులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే సేవలందిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో బోధనా కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతోందని, ముఖ్యమైన పాఠ్యాంశాలను సకాలంలో పూర్తి చేయలేని పరిస్థితి నెలకొందని, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. 150 మందికి పైగా విద్యార్థులు చదువుతున్న పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులను నియమించక పోవడం విద్యార్థుల విద్యా భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని విద్యా ర్థులు వాపోతున్నారు. విద్యార్థుల విద్యా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు పాఠశాలలను తక్షణమే పరిశీలించి, అవసరమైన సంఖ్యలో ఉపాధ్యాయులను వెంటనే నియమించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

## గ్రామ కార్యదర్శిపై సర్పంచ్ భాను ప్రసాద్ దాడి

**నర్సంపేట (సింగిడి):** వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బోటిమీది తండాలో గ్రామ కార్యదర్శి పై సర్పంచ్ చేసిన దాడి గ్రామంలో తీవ్ర కలకలం రేపుతుంది. తనను అసభ్యకర పదజాలంతో దూషిస్తూ, పిడిగుద్దులతో విరుచుకుపడ్డారని బాధితుడు రవి మీడియా ముందు వాపోయారు. అయితే గ్రామపంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనంలో ఉన్న మొక్కలను గ్రామ కార్యదర్శికి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, సర్పంచ్ భాను ప్రసాద్ పంచాయతీ సిబ్బందితో కలిసి నరికించి వేశారు. ఈ అక్రమ ఉదంతంపై కార్యదర్శి ఆవుల రవి ఉన్నతాధికారి అయిన ఖానాపురం ఎంపీడీవోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

తనపై ఫిర్యాదు చేశాడనే కక్షతోనే సర్పంచ్ భాను ప్రసాద్ ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు ఆయన అన్నారు. అయితే ఈ విషయమై ఖానాపురం ఎంపీడీవో, స్థానిక ఎస్సై, నర్సంపేట ఏసీపీలకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వవిధుల్లో ఉన్న తనపై అకారణంగా దాడి చేసి, దుర్భాషలాడిన సర్పంచ్ భూక్య భాను ప్రసాద్‌పై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని, తనకు తన కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన ఉన్నతాధికా రులకు దరఖాస్తులు సమర్పించారు

## జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ నిర్వహించిన ఎస్ శేషాద్రిణి రెడ్డి ఐపీఎస్



**కుత్బుల్లాపూర్, (సింగిడి):** జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో వార్షికతనికి ఎస్ శేషాద్రి రెడ్డి ఐపీఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, ట్రాఫిక్ కిట్ సామగ్రి, ఎన్‌ఫోర్స్‌మెంట్ వివరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడి, వారి విధులకు సంబంధించిన సమస్యలు, ఇబ్బందులను తెలుసుకుని, అవసరమైన మార్గదర్శకాలు, సూచనలు అందించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు , పోలీస్ స్టేషన్ లో వున్న వాహనాలను పరిశీలించి, వాటి శుభ్రత, నిర్వహణ, సక్రమమైన వినియోగంపై అవసరమైన సూచనలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ట్రాఫిక్ నిబంధనల అమలును మరింత కఠినతరం చేయాలని, ప్రమాదాలకు కారణమయ్యే అంశాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచిం చారు. ముఖ్యంగా బ్లాక్ స్పాట్ల వద్ద అవసరమైన రోడ్డు భద్రతా చర్యలు, ఇంజినీరింగ్ పనులను సంబంధిత శాఖల సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు సురక్షితమైన, సజావుగా ట్రాఫిక్ రాకపోకలు ఉండేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డీసీపీ సూచించారు. ఈ వార్షిక తనిఖీ సందర్భంగా ఎ. సి. పి జీడిమెట్ల ట్రాఫిక్ డివిజన్ వై. వెంకటేశ్వరా రావు, ఎస్ఐలు జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన సీఈవో వెంకట్ రెడ్డి



**జడ్చర్ల ప్రతినిధి (సింగిడి):** చెట్లను పెంచడం ప్రతి ఒక్కరి భాధ్యత అని సీఈవో వెంకటరెడ్డి అన్నారు. వన మ హోత్సవ కార్యక్రమంలో భా గంగా సీఈవో వెంకట్ రెడ్డి పోచమ్మగడ్డ తండాను సంద ర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించడంతో పాటు ఫారం పాండ్స్ పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం పోచమ్మగడ్డ తండాలోని మినీ గురుకుల పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, గ్రామస్తులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వా ములు కావాలని, నాటిన మొక్కలను సంరక్షించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బిజినపల్లి బాలికల పాఠశాలలో హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన

### హెచ్ఐవి నియంత్రణపై విద్యార్థినులకు అవగాహన




**బిజినపల్లి, (సింగిడి):** బిజినపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఐవి-ఎయిడ్స్ నియంత్రణపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వైఆర్జీ కేర్ స్వచ్ఛంద సంస్థ లింక్ వర్కర్ పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులకు హెచ్ఐవి వ్యాధి వ్యాప్తి, నివారణ చర్యలు, పరీక్షల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ లింక్ వర్కర్ హేమలత మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాప్తికి సంబంధించిన ప్రధాన మార్గాలపై విద్యార్థినులకు వివరించారు. కలుషితమైన సూదులు, సిరంజిలను ఉపయోగించరాదని, హెచ్ఐవి సోకిన వ్యక్తి రక్తాన్ని పరీక్షిం చకుండా స్వీకరించరాదని సూచించారు. హెచ్ఐవి సోకిన వ్యక్తితో లైంగిక సంబంధాల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉందని, సురక్షితమైన విధానాలను పాటించాలని తెలిపారు. హెచ్ఐవి సోకిన గర్భిణులు తప్పనిసరిగా ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ప్రసవం చేయించుకోవడం ద్వారా శిశువుకు వ్యాధి సంక్రమణను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. అలాగే క్షయ వ్యాధిపై కూడా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ అవసరమైనప్పుడు రక్త పరీక్షలు చేయించుకుని తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు. హెచ్ఐవి సోకిన వారు భయపడా ల్సిన అవసరం లేదని, వైద్యుల సూచనల మేరకు యాంటీ రిట్రోవైరల్ చికిత్స మందులు తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు జీవనకా లాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. హెచ్ఐవి--ఎయిడ్స్ నివారణ చట్టం--2017, ఉచిత సహాయ నంబర్ 1097, స్వీయ నమోదు కోసం సంకేత చిత్ర పద్ధతి, 95-95-95 లక్ష్యంపై కూడా అవగాహన కల్పించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో కూడా సంకేత చిత్ర స్వీయ నమోదు విధానంపై ప్రజలకు వివరిం చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నివేదిత, ఉపాధ్యా యులు పార్వతమ్మ, ప్రసన్నకుమారి, ఉమామహేశ్వరి, వసంత కుమారి, ఉపాధ్యాయ బృందం, సుమారు 50 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రభాతవన
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
బుధవారం
26-8-2026

# బెల్ట్‌షాపుల జోరు.. అధికారుల పర్యవేక్షణ ఏదీ?

-గ్రామాల్లో పుట్టగొడుగుల్లా అక్రమ మద్యం విక్రయ కేంద్రాలు

-ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన రాగుల కనకయ్య

-బెల్ట్‌షాపులపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్




**నంగునూరు, (సింగిడి):** మండలం లోని పలు గ్రామాల్లో బెల్ట్‌షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని, అక్రమ మద్యం విక్రయ కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని నంగునూరు గ్రామానికి చెందిన రాగుల కనకయ్య ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం నంగునూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా బెల్ట్‌షాపులు నిర్వహిస్తూ మద్యం విక్రయాలు సాగిస్తున్నారని కనకయ్య ఆరోపించారు. ఎలాంటి నియంత్రణ లేకుండా మద్యం విక్రయాలు జరుగుతుండటంతో గ్రామాల్లో పరిస్థితి ఆందోళన కరంగా మారుతోందని తెలిపారు. ముఖ్యంగా బెల్ట్‌షా పుల్లో మద్యం కొనుగోలు చేసే వినియోగదారుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారని, దీంతో సామాన్యుల జేబులు గుల్ల అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు రోజురోజుకు పెరుగుతు న్నప్పటికీ సంబంధిత అధికారులు సమర్థవంతంగా పర్యవేక్షించడం లేదనే భావన ప్రజల్లో నెలకొందని కనకయ్య పేర్కొన్నారు. బెల్ట్‌షాపుల నిర్వహణ వెనుక మద్యం విక్రయదారుల వ్యవస్థీకృత కార్యకలాపాలు ఉన్నాయా అనే కోణంలోనూ అధికారులు విచారణ చేపట్టాలని కోరారు. బెల్ట్‌షాపులకు మద్యం ఎలా చేరుతోంది, ఎక్కడి నుంచి సరఫరా అవుతోంది అనే అంశాలపై అధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు నంగునూరు మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి బెల్ట్‌షాపుల వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని కనకయ్య కోరారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్న కేంద్రాలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు కేవలం ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే స్పందించకుండా ముందస్తు పర్యవేక్షణతో గ్రామాల్లో నిరంతర తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటేనే అక్రమ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట పడుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు

## ప్రధాన రహదారి...

## రోడ్డు పనులు వేగవంతం చేయండి

## -మాజీమంత్రి మల్లారెడ్డికి విజ్ఞప్తి



**జవహర్ నగర్, (సింగిడి):** దమ్మాయిగూడ--నాగారం ప్రధాన రహదారి అభివృద్ధి పనులను ఇకపై ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించాలని కోరుతూ మెయిన్ రోడ్ ప్లాట్స్ అసోసియేషన్ సభ్యులు మాజీ మంత్రి మల్లారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ప్రతిపాదించిన 100 అడుగుల రహదారిని 80 అడుగులకు పరిమితం చేసి పనులు చేపడితే ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు తొలగిపోతాయని వారు వివరించారు. రహదారి పనులు పెండింగ్‌లో ఉండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రజల సమస్యను ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి రహదారి పనులు త్వరగా ప్రారంభించేలా కృషి చేయాలని మల్లారెడ్డిని కోరారు. సమస్య పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు మెయిన్ రోడ్డు అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

## వైఆర్‌జికేర్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవిపై ర్యాలీ




**తిరుమలయపాలెం (సింగిడి):** మండలం లోని బీరోలు గ్రామంలోని వై ఆర్ జి కేర్ సంస్థ ఆధ్వర్యంలో పై హెచ్ఐవిఅవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది వై ఆర్ జి కేర్ సంస్థ సూపర్వైజర్ కర్లకుంట నరేష్ మాట్లాడుతూ హెచ్ఐవి ,సుఖ వ్యాధులు, టిబి వ్యాధులు వంటి వ్యాధుల గురించి అవగాహన కల్పించడం జరిగింది . 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క వ్యక్తి సంవత్సరానికి ఒక్కసారైనా హెచ్ఐవి టెస్ట్ చేయించుకోవాలని చెప్పడం జరిగింది హెచ్ఐవి అంటువ్యాధి కాదని చెప్పడం జరిగింది హెచ్ఐవి సోకిన వారి పట్ల వివక్షత భావం లేకుండా చూడాలని వారిని కూడా గౌరవించాలని చెప్పడం జరిగింది ఏఆర్టి మందులు మరియు హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం సమక్షేమ పథకాలు అనగా ఆసరా పెన్షన్ వంటి వాటి గురించి చెప్పటం జరిగింది. గ్రామ సర్పంచ్ గుమ్మడి దేవభిక్షం మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ రక్త పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పడం జరిగింది ప్రధానో పాధ్యాయులు వీర స్వామి ఎంపీ హెచ్ఏ ఎం పద్మ మాట్లాడుతూ హెచ్ఐవి నివారణలో అందరూ భాగస్వాములు కావాలని ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని విద్యార్థులు గ్రామ ప్రజలందరూ అవగాహన పెంచుకో వాలని జాగ్రత్త పాటించాలని చెప్పడం జరిగింది కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మౌనిక, గ్రామ దీపిక మాధురి, ఏ ఎన్ ఎం, ఉపాధ్యాయులు అన్వర్ పాషా, వెంకటేశ్వర్లు వై. ఆర్ జి కేర్ సంస్థ లింక్ వర్కర్ ఉషారాణి, ఆశా కార్యకర్తలు ఊర్మిళ సరిత రేణుక గ్రామ ప్రజలు తదితరులు ఈ కార్యక్రమాలు పాల్గొన్నారు

## వీధి వ్యాపారుల వద్ద అక్రమ వసూళ్లపై

## విచారణ జరపాలి: ది సిటిజన్స్ కౌన్సిల్




**రాజేంద్రనగర్, (సింగిడి):** మణికొండ ప్రాంతంలో పేద వీధి వ్యాపారుల వద్ద మధ్యవర్తులు చేస్తున్న అక్రమ వసూళ్లపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు విచారణ జరిపి, బాధ్యులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని 'ది సిటిజన్స్ కౌన్సిల్' నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కౌన్సిల్ ప్రతినిధులు మాట్లాడుతూ... గతంలో మణికొండ మున్సిపాలిటీ పరిధిలో థాయ్ బజార్ పేరిట టెండర్లు పిలిచి అక్రమ వసూళ్లకు పాల్పడగా, తాము తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి ఆ వసూళ్లను నిలిపివేయించామని గుర్తుచేశారు. తద్వారా వీధి వ్యాపారుల 'జీవనోపాధి పరిరక్షణ, వ్యాపార నియంత్రణ చట్టం-2014' అమలుకు కృషి చేశామన్నారు. మణికొండను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసిన తర్వాత వ్యాపారులకు సరైన ప్రత్యామ్నాయ మార్కెట్ సౌకర్యం కల్పించకుండా తొలగించగా, కౌన్సిల్ విజ్ఞప్తి మేరకు నార్సింగి డిప్యూటీ కమిషనర్ కొన్ని షరతులతో వీధి వ్యాపారానికి అనుమతి ఇచ్చారని తెలిపారు. వారపు సంత ముగిశాక పారిశుధ్య నిర్వహణ కోసం ?50 రుసుముగా నిర్ణయించారన్నారు. ప్రస్తుతం కొందరు మధ్యవర్తులు అక్రమంగా చెత్త ఉందనే నెపంతో ఒక రసీదు ఇచ్చి 1,000 రూపాయలు,, రసీదు లేకుండా అనధికారికంగా మరో 1,000 రూపాయల చొప్పున మొత్తం ?2,000 బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ అక్రమ వసూళ్లు 2014 వీధి వ్యాపారుల చట్ట స్ఫూర్తికి విరుద్ధమని, పేదల జీవనోపాధిని దెబ్బతీస్తున్న ఇటువంటి ఘటనలపై నార్సింగి డిప్యూటీ కమిషనర్ తక్షణమే స్పందించి విచారణ జరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ది సిటిజన్స్ కౌన్సిల్ చైర్మన్ సితారాం ధూళిపాల, అధ్యక్షుడు ఉపేంద్రనాథ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు అందే లక్ష్మణ్ రావు, కార్యదర్శి ఆరీఫ్ మహమ్మద్, సభ్యులు రామసుబ్బా రెడ్డి,సాగర్, మాజీ కోశాధికారి,దిలీప్ కక్కడ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరంగాపూర్‌లో వైభవంగా బోనాలు



**శ్రీరంగాపూర్ (సింగిడి):** మండల కేంద్రంలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను నెత్తిన ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. డప్పుల మోతలు, భక్తుల నృత్యాలు, అమ్మవారి నామస్మరణలతో శ్రీరంగాపూర్ పండుగ శోభను సంతరించు కుంది. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభి షేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు, పోలీసులు తగిన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# ఎదురెదురుగా రెండు బైకులు ఢీ



**చేవెళ్ళ, (సింగిడి):** రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.. షాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండల పరిధిలోని మాచనపల్లి గ్రామానికి చెందిన చంద్ర శివకుమార్ తండ్రి నర్సింలు వయసు 22 సంవత్సరాలు, వృత్తి డ్రైవింగ్ పనిచేసుకుంటూ జీవనం గడిపేవాడు. అదే గ్రామం, మాచన్పల్లికి చెందిన సురేష్ తండ్రి సత్తయ్య వయసు 20 సంవత్సరాలు . శివకుమార్ తేదీ 24-08-2026 నాడు రాత్రి సుమారు 11:00 గంటల సమయంలో మాచనపల్లి గ్రామం నుంచి హైతాబాద్ వైపు వెళ్తున్న సమయంలో మార్గమధ్యంలో వెల్‌స్పన్ కంపెనీ సమీపానికి చేరుకున్న సమయంలో, హైతాబాద్ వైపు నుండి మాచనపల్లి వైపు వస్తున్న ప్యాషన్ ప్లస్ ద్విచక్ర వాహనం వీరి బైక్‌ను ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలపై ఉన్న వ్యక్తులు తీవ్రగాయలతో పడిపోయారు. ఈ ప్రమాదంలో శివకుమార్ తలకు తీవ్ర రక్త గాయం కాగా, సురేష్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. ఎదురుగా వచ్చి ఢీకొన్న ప్యాషన్ ప్లస్ ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తికి కూడా గాయాలు అయినట్లు తెలిసింది. తీవ్రంగా గాయపడిన శివకుమార్‌ను చికిత్స నిమిత్తం షాద్‌నగర్‌కు తరలించిగా, అనంతరం మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 25-08-2026 నాడు మధ్యాహ్నం సుమారు 2:30 గంటల సమయంలో శివకుమార్ మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు..

# బాధితకుటుంబానికి మిత్రుల ఆర్థిక సాయం



**నంగునూరు, (సింగిడి):** నంగునూరు మండల కేంద్రానికి చెందిన భోజనకారి నాగరాజు ఇటీవల ఆకస్మికంగా గుండె పోటుతో మృతి చెందారు. దీంతో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉంది. ఈ నేపథ్యంలో నాగరాజు మిత్రులు మానవత్వంతో ముందుకు వచ్చి ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. నాగరాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో ఆ కుటుంబం ఎదుర్కొంటున్న పరిస్థితిని తెలుసుకున్న 1987--88 సంవత్సరంలో నాగరాజుతో కలిసి పదో తరగతి చదువుకున్న ఆయన మిత్రులు స్పందించారు. తమ వంతు సహాయంగా రూ. 31,000లను సేకరించారు. ఈ డబ్బులను నంగునూరుకు చెందిన వల్లపురెడ్డి రాంరెడ్డి, జాగీరు ఎల్లాగౌడ్, దేవులపల్లి నర్సింగరావు మంగళవారం నాగరాజు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపద సమయంలో తోటి మిత్రుడి కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. నాగరాజుతో తమకున్న స్నేహబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబానికి భవిష్యత్తులోనూ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్న 1987--88 పదో తరగతి బ్యాచ్ మిత్రులను పలువురు అభినందించారు

# రూ.3 లక్షలతో అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభించిన సర్పంచ్



**ఇబ్రహీంపట్నం, (సింగిడి):** మంచాల మండలం దాత్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర్ల తండాలో అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను సర్పంచ్ శాంతి రాజు నాయక్ ప్రారంభం చేశారు. తండాలో మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ఇండ్లు సిమెంటు రోడ్లు మంచినీటి సమస్యతో పాటు ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని సర్పంచ్ శాంతి రాజా నాయక్ తెలిపారు. అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేయడంతో తండా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పి లక్ష్మణ్ హిరాలాల్ రమేష్ లక్ష్మీపతి అంజి, సపవట్ లచ్చు, లక్ష్మణ్, శంకర్, వెంకటేష్, మారు జంగమ్మ పంత్య తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్ల ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన




**గద్వాల ప్రతినిధి, (సింగిడి):** జోగులాంబ గద్వాల జిల్లా మున్సిపాలిటీ కేంద్రంలో ఆటో డ్రైవర్లకు పోలీసు వారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు కల్పించారు ఈ సందర్భంగా ఎస్సై గురు స్వామి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లందరూ తప్పనిసరిగా వాహన ఆర్‌సీ (=జ), డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వంటి అన్ని చెల్లుబాటు అయ్యే వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలపకూడదని, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని పేర్కొన్నారు. అవసరమైన అన్ని వాహన పత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవడం యొక్క ప్రాధాన్యతను డ్రైవర్లకు వివరించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# 60 రోజుల బయలాట నాటక శిక్షణ ముగింపు



**నారాయణపేట, (సింగిడి):** నారాయణపేట జిల్లా మద్దూర్ మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన 60 రోజుల బయలాట నాటక శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. జూన్ 25న ప్రారంభమైన ఈ శిక్షణ శిబిరంలో కళాకారులకు రెండు నెలల పాటు బయలాట నాటకంపై శిక్షణ అందించారు. అంతరించిపోతున్న జానపద కళలను పరిరక్షించి, వాటిని పల్లె ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, బీజీఏ థియేటర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజీఏ థియేటర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీకాంత్ కాడం ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగగా, ట్రైనర్ కాడం బుగ్గప్ప కళాకారులకు శిక్షణ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళలకు ఆదరణ పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు.

## చెత్తను డంపింగ్ యార్డులోనే

## వేయాలి : కౌన్సిలర్ కృష్ణనాయక్



**చేవెళ్ల (సింగిడి):** చెత్తను డంపింగ్ యార్డులోనే వేయాలని 17వ వార్డు కౌన్సిలర్ కృష్ణనాయక్ సూచించారు. చేవెళ్ల మున్సిపల్ 17వ వార్డులో ఎనిమిదేళ్లుగా పేరుకుపోయిన చెత్తను తన సొంత ఖర్చులతో తొలగించారు. చెత్తతో దోమలు, ఈగలు పెరిగి అనారోగ్య సమస్యలు వస్తాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. సొంత ఖర్చులతో చెత్త తొలగించిన కౌన్సిలర్ కృష్ణనాయక్‌ను వార్డు ప్రజలు అభినందించారు.

## ఖానాపూర్‌లోనే 'చేయూత' పింఛన్ల పంపిణీ

### పెద్దపులి కిషన్ చొరవతో తీరిన వృద్ధులు, దివ్యాంగుల తిప్పలు



**రాజేంద్రనగర్, (సింగిడి):** ఖానాపూర్ లోనే చేయూత పింఛన్ల పంపిణీ, పెద్దపులి కిషన్ చర్వతో క్రిమిన వృద్ధులు, దివ్యాంగుల తిప్పలు ఖానాపూర్ గ్రామంలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, కంటి చూపు లేని పింఛన్‌దారులు గత మూడు, నాలుగు నెలలుగా ఎదుర్కొంటున్న సుదీర్ఘ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఇకపై గ్రామంలోనే చేయూత పింఛన్లను అందించేలా అధికారులు తగిన చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు పింఛన్ దారులు సుమారు 3 నుండి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న గండిపేట్‌కు ఆటోల్లో వెళ్లాల్సి వచ్చేది. దీనివల్ల వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర అవస్థలు పడటంతో పాటు, ఆటో చార్జీల రూపంలో పింఛను డబ్బుల్లో కొంత మొత్తాన్ని కోల్పోవాల్సి వచ్చేది. ఈ సమస్యపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్దపులి కిషన్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గండిపేట్ ఎస్‌పీఎం నుంచి చీఫ్ పోస్టుమాస్టర్ కార్యాలయం, అడ్మినిస్ట్రేషన్ అధికారులు, ఉస్మానియా యూనివర్సిటీ పోస్టాఫీసు ఉన్నతాధికారుల వరకు వరుసగా వినతిపత్రాలు అందజేసి, నిరంతరం ఫాలోఅప్ చేశారు. ఈ ప్రయత్నాల ఫలితంగా సమస్య తీవ్రతను గుర్తించిన పోస్టల్ అధికారులు, మంగళవారం ఖానాపూర్ గ్రామంలోనే నేరుగా పింఛన్ల పంపిణీ చేపట్టారు. స్వగ్రామంలోనే పింఛను అందుకోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఆనందం వ్యక్తం చేస్తూ నాయకులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా పింఛన్లు అందని అర్హులైన లబ్ధిదారుల కోసం ఈనెల 31 వరకు దరఖాస్తుకు అవకాశం. అర్హులంతా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని పెద్దపులి కిషన్ సూచించారు. దరఖాస్తు ప్రక్రియపై అవగాహన లేని వారికి బీఆర్ఎస్ తరఫున తగిన సహాయ సహకారాలు అందిస్తామని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు తలారి కృష్ణ,, రామేశ్వరం దేవదాసు, గొల్ల తుకారం, తప్పు రవీందర్, ఎర్రోళ్ల ప్రకాష్, డప్పు రాకేష్, పసుల బాలరాజ్, మహమూద్ పాషా, మస్కూరి అర్జున్, కొండకర్ల అరుణ్, దాకురి వంశీ, మిర్చిగూడెం వెంకటయ్య, శంకరి యాదయ్య పాల్గొన్నారు.

## వన మహోత్సవంలో మొక్కలు నాటిన

## పర్వేద సర్పంచ్ సురేందర్ గౌడ్



**చేవెళ్ల (సింగిడి):** పర్వేద గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న మాస్ ప్లాంటేషన్ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సురేందర్ గౌడ్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా పర్వేద గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కూడా సర్పంచ్ సురేందర్ గౌడ్ మొక్కలు నాటారు. పాఠశాల ఆవరణలో పచ్చదనాన్ని పెంపొందించేం దుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కల సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి SINGIDI తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi బుధవారం 26-8-2026

# ప్రజల ఆర్థికాభివృద్దే లక్ష్యంగా బ్యాంకులు పనిచేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**





**మేడ్చల్ (సింగిడి):**
ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం, బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన డిసిసి డిఎల్ఆర్సి సమావేశానికి అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఆర్థిక చేయూతను అందిస్తూ వారి అభ్యున్నతికి బ్యాంకులు సహకరించాలని సూచించారు బ్యాంకులు నిర్దేశిత లక్ష్యాలను సాధించడమే కాకుండా ఆర్థికంగా వెనుకబడిన వారికి చేయూత అందించాలన్నారు. డిసిసి సమావేశానికి హాజరయ్యే బ్యాంకర్లందరూ పూర్తి సమాచారంతో రావాలని ఆదేశించారుఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గారు మాట్లాడుతూ పేద మరియు బలహీన వర్గాలకు బ్యాంకులు చేయూతనివ్వాలని కోరారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సభ్యులకు అందించే రుణాలు సకాలంలో మంజూరు చేసి వారి ఆర్థికాభివృద్ధికి దోహదం చేయాలని బ్యాంకర్లకు సూచించారు. ఎలాంటి అదనపు ఛార్జీలు విధించకూడదని స్పష్టం చేశారు. బ్యాంకుల వద్ద ఎదురయ్యే ఇబ్బందులను తొలగించి లబ్ధిదారులకు సౌకర్యవంతమైన విధానం అమలు చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు ఇతర బలహీన వర్గాలకు వివిధ రుణ పథకాలపై విస్తృత అవగాహన కల్పించి వారి ఆర్థికాభివృద్ధిని బలోపేతం చేయాలని సూచించారు. ముఖ్యంగా ముద్ర, పీ.ఎం. విశ్వకర్మ, పి ఎం ఈ జి పి, పీఎం ఎఫ్ఎంఈ, ఎంఎస్ఎమ్ఈ, ఆర్ఏఎంపి వంటి పథకాల ద్వారా యువత, మహిళలు, స్వయం ఉపాధి దారులకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళా సంక్షేమం మరియు సాధికారత కోసం ప్రత్యేక దృష్టి పెట్టాలని, రుణాలపై ఉన్న సందేహాలను లబ్ధిదారులతో నేరుగా సంప్రదించి నివృత్తి చేయాలని బ్యాంకు అధికారులను కోరారు. బ్యాంకింగ్ సేవల విషయంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలపై ఎమ్మెల్యే గారు సంబంధిత అధికారులను నిలదీశారు. సంబంధిత అధికారులు త్వరలో పూర్తి వివరాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు

## పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

**పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి**



**వికారాబాద్ ప్రతినిధి, (సింగిడి):** జిల్లా పరిధిలోని పరిగి పట్టణంలోని సంకల్ప విద్యాపీఠ్ పాఠశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (సర్ ) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన సూచించారు. పచ్చదనం పెంపొందించడం, పర్యావరణాన్ని కాపాడటంలో వనమహోత్సవ కార్యక్రమాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రూ. 19,80 లక్షలతో ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణం



**రాజేంద్రనగర్, (సింగిడి):**
ఉప్పరపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చుట్టూ రూ. 19,80లక్షల అంచనా వ్యయంతో ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు హైదర్‌గూడ-ఉప్పరపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సమ ఇంద్రపాల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల రక్షణ, పాఠశాల ఆస్తుల పరిరక్షణే ధ్యేయంగా ఈ నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి అయ్యేలా అధికారులు చొరవ చూపాలని అన్నారు. ఉప్పరపల్లి సమగ్ర అభివృద్ధిలో భాగంగా ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు, పాలన అందించేందుకు పలు ప్రభుత్వ భవనాల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నట్లు వెల్లడించారు. పాఠశాల భవనానికి ఆనుకుని, ప్రధాన రహదారి పక్కనే ఉండటం గ్రామానికి ఎంతో కలిసివచ్చే అంశమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలన్నింటికీ ప్రజలందరూ పూర్తి స్థాయిలో సహకరించి విజయవంతం చేయాలని ఇంద్రపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## శ్రీరంగాపూర్‌లో నీటి పొదుపు, సామూహిక మొక్కలు నాటే కార్యక్రమం




**శ్రీరంగాపూర్ (సింగిడి):** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పర్యావరణ పరిరక్షణ, నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమంతో పాటు సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి శ్రీరంగాపూర్ గ్రామ సర్పంచ్ మద్దిలేటి, సబ్‌ఇన్‌స్పెక్టర్ హిమబిందు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై హిమబిందు మాట్లాడుతూ భవిష్యత్ తరాల మనుగడకు పర్యావరణ పరిరక్షణ ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, నీటి వృథాను అరికట్టి భూగర్భ జలాలను కాపాడుకోవాలని సూచించారు. సర్పంచ్ మద్దిలేటి మాట్లాడుతూ గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. విద్యార్థులు, అధ్యాపకులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యత, ప్రకృతి పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నీటి పొదుపు, సంరక్షణ పద్ధతులపై ప్రసంగించారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దిలేటి, ఎస్సై హిమబిందు, 4వ వార్డు మెంబర్ భాస్కర్‌ను కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు సన్మానించారు. అనంతరం అతిథులు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు కలిసి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, అధ్యాపకేతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఫీజు బకాయి - బీజేపీ లడాయి

**-రూ. 15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి:-బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచంద్రరావు**



**రాజేంద్రనగర్, (సింగిడి)::** రాష్ట్రంలోని దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేస్తున్న రూ. 15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పోరు బాట పట్టింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు చీ. రాంచంద్రరావు చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షకు రాజేంద్రనగర్ నియోజకవర్గ కంటె స్టెడ్ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూర్తి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లా డుతూ “ఇది కేవలం ఒక రాజకీయ పోరాటం కాదు... మన పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం చేస్తున్న ధర్మపోరాటం. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి విద్యార్థుల హక్కుల కోసం అందరం ఒక్కటై నిలబడాల్సిన సమయం ఇది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే బకాయిపడ్డ రూ.

## ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు సమర్థవంతంగా అమలు చేయాలి

**-ప్రజా సంక్షేమం సంఘం అధ్యక్షులు**



**చేవెళ్ల (సింగిడి):** సమాజంలో ఎన్నో ఏళ్లుగా అణచివేతకు, వివక్షకు గురైన ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు అనేక హామీలు, విధానాలు ప్రకటిస్తున్నాయి. అయితే హామీలు ప్రకటించడం మాత్రమే కాకుండా, వాటిని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం అత్యంత అవసరమని ప్రజా సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చోక్కంపేట ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం చేవెళ్లలో డిక్లరేషన్ చేసిన మైదానంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఎస్సీ--ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించిన విద్య, ఉపాధి, భూమి, గృహాలు, ఆర్థిక సాధికారత, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక భద్రత వంటి అంశాలు,బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించి, ఆ నిధులు నిజంగా అర్హులైన ప్రజలకు చేరేలా పారదర్శకమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రత్యేకంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య, స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ సదుపాయాలు అందించాలి. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని,భూమిలేని కుటుంబాలకు భూమి, పేద కుటుంబాలకు గృహ వసతి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని అన్నారు. ఎస్సీ--ఎస్టీ వర్గాల హక్కులు కేవలం ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలుగా మిగిలిపోకుండా, ప్రభుత్వ విధానాల్లో శాశ్వత భాగంగా మారాలి. డిక్లరేషన్ అమలుపై నిరంతర పర్యవేక్షణ, సామాజికంగా ఎస్సీ ఎస్టీల హక్కులు ఆత్మగౌరవాని కాపాడండి స్పష్టం చేశారు... ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు..

## మొక్కలు ప్రాణకోటికి జీవనాధారం

**-పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి**



**చేవెళ్ల, (సింగిడి):**-మొక్కలు పర్యావరణానికి ప్రాణకోటికి జీవనాధారం అని,పర్యావరణ పరిరక్షణతో పాటు భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా మంగళవారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటికీ తిరిగి ప్రజలకు మొక్కలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మొక్కల పెంపకంతో స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రాములు గౌడ్, కమిషనర్ యాదగిరి, కౌన్సిలర్లు, కో.ఆప్షన్ సభ్యులు, మహిళా సంఘాల నాయకులు , పార్టీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### పట్టా భూములను 22లో చేర్చి

## ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం దుర్మార్గం



అమీన్‌పూర్, **(సింగిడి):**
ప్రభుత్వ భూములు ప్రభుత్వానికి, పట్టా భూములు ప్రజలకు చెందాలని హైకోర్టు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కావాలనే ఉద్దేశపూర్వకంగా పట్టా భూములను సైతం 22-ూ నిషేధిత జాబితాలో చేర్చి సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అమీన్‌పూర్‌లో గత 30 ఏళ్ల క్రితం వేసిన హెచ్ఎండిఏ (ఎవీణూ) లేఅవుట్ భూములతో పాటు ఇతర నివాస ప్రాంతాలను 22-ూ లో చేర్చడం అత్యంత దారుణమన్నారు. అప్పట్లో హెచ్ఎంటీ ఉద్యోగులు కష్టపడి ప్లాట్లు కొనుగోలు చేస్తే, ఇప్పుడు రిజిస్ట్రేషన్ల కోసం సీసీఎల్ఏ (జజూూ) కార్యాలయానికి వెళ్తే అవి 22-ూ లో ఉన్నాయని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దీనికోసం కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వాలంటూ సామాన్య ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుతూ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమీన్‌పూర్ పరిధిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలు జీవితాంతం 20 నుండి 30 ఏళ్లు కష్టపడి ఒక ఇల్లు కట్టుకుంటే, అత్యవసర సమయాల్లో వాటిని అమ్ముకుందామన్నా 22-ూ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విచిత్రంగా అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ ఉన్న హెచ్ఎంటీ లేఅవుట్ స్థలాన్ని, ఇక్రిశాట్ (×జ=×ూాు) పక్కన ఉన్న లేఅవుట్లను, పటేల్‌గూడలోని పీపీహెచ్ కాలనీ లేఅవుట్‌లను కూడా 22-ూ లో పెట్టడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. పీపీహెచ్ కాలనీలో గతంలో హెచ్ఎండీఏ అనుమతులు ఇచ్చిందని, అక్కడ అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇప్పటికే 24 ప్లాట్లలో 20 ప్లాట్లు రిజిస్ట్రేషన్లు పూర్తయినా, మిగిలిన వాటిని ఇప్పుడు 22-ూ లో పెట్టి ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. అధికారుల వద్ద, ప్రభుత్వ రికార్డుల్లో ఏది పట్టా భూమి, ఏది ప్రభుత్వ భూమి అనే స్పష్టమైన వివరాలు ఉన్నప్పటికీ, ప్రజలను మళ్లీ దరఖాస్తులు చేసుకోమనడం వెనుక ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రజలను క్షోభకు గురిచేస్తున్న 22-ూ నిషేధాన్ని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై పెద్ద ఎత్తున అమీన్‌పూర్ నుంచి ధర్నా చేపట్టి ప్రజా పోరాటాన్ని ఉధృతం చేస్తామని, బాధిత ప్రజలందరికీ అండగా ఉంటామని అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ స్పష్టం చేశారు.

# ఏళ్ళనాటి నుంచి బురదే

**-పట్టించుకునే నాథుడే లేడు**
**-ఊరిలోకి వెళ్ళాలంటే బురద తొక్కాల్సిందే**



**కొడంగల్, (సింగిడి):**
కొడంగల్ పట్టణానికి సమీపంలో గల ఎన్కేపల్లి గ్రామంలో ఆటో స్టాండ్ దగ్గర ప్రాంతమంతా బురద ఉంటుందని, పట్టించుకునే నాథుడే లేదని గ్రామ ప్రజలు, యువకులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి రావాలన్నా, గ్రామం నుంచి బయటకు వెళ్లాలన్న ఈ బురద తొక్కాల్సిందేనని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆటో స్టాండ్ దగ్గర ప్రాంతం వర్షాకాలంలో ప్రతి సంవత్సరం బురదమయంగా ఉంటుందని, ఈ బురదను తొలగించరా అని యువకులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి అధికారులైన సరే ఈ బురద దాటుకుని రావాల్సిందేనని, ఎన్నాళ్లు ఈ బురద దాటుకొని వస్తారని, యువకులు ప్రశ్నిస్తున్నారు.

**ఎస్సీ కాలనీలో సైతం ఇదే తీరు**

గ్రామంలోని ఎస్సీ కాలనీలో సైతం ఆటో స్టాండు దగ్గర ఉన్న బురద మాదిరిగానే ఎస్సీ కాలనీలోని మైసమ్మ గుడి ప్రాంతంలో కూడా బురదమయం అవుతుందని యువకులు ఆరోపిస్తున్నారు. ఎస్సీ కాలనీ ఊరుకు దిగువ భాగంలో ఉండడంతో వరద నీరు, డ్రైనేజీ నీరు, ఎక్కువ మొత్తంలో ఎస్సీ కాలనీ గుండా పారుతోందని ఎస్సీ కాలనీలలో బురద బురద అవుతుందని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు చెబుతున్నారు. వర్షాకాలం అంటేనే బురద, ఈగలు, దోమలకు ఆనవాలుగా ఉండే పరిస్థితి. ఈ విధంగా బురద పేరుకు పోతే ఈగలు దోమల బారిన పడి రోగాల పాలవక తప్పదని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు.

## ఉప్పర్పల్లి ప్రాథమిక పాఠశాల కాంపౌండ్ వాల్ కొలతలు తీసిన మున్సిపల్ అధికారులు



**రాజేంద్రనగర్, (సింగిడి):**
ఉప్పర్పల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణం చుట్టూ రక్షణ గోడ (కాంపౌండ్ వాల్) నిర్మాణానికి సంబంధించి మున్సిపల్ డిఇ, ఎఇ అధికారులు మంగళవారం స్థలాన్ని పరిశీలించి సరిహద్దు కొలతలు తీశారు. పాఠశాల ఆస్తులను పరిరక్షించడం సహా విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కాంపౌండ్ వాల్ నిర్మాణం వేగవంతం చేయాలని అధికారులను స్థానిక నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో హైదర్‌గూడ డివిజన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సామ ఇంద్రపాల్ రెడ్డి, మాజీ ప్రెసిడెంట్ ధర్మా రెడ్డి, టిడిపి నాయకులు సిహెచ్. వెంకట్ రెడ్డి పాల్గొని పాఠశాల అవసరాలను అధికారులకు వివరించారు. పాఠశాల చుట్టూ పక్కాగా కాంపౌండ్ వాల్ నిర్మించడం వల్ల ఆక్రమణలకు తావులేకుండా ఉంటుందని, త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నాయకులు ఈ సందర్భంగా కోరారు. స్పందించిన అధికారులు త్వరలోనే నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

## ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి చొరవతో బాధితుడికి రూ.2.50 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి



**బిజినపల్లి (సింగిడి):**
నాగర్‌కర్నూల్ జిల్లా మహాదేవ్‌పేటకు చెందిన నల్లపోతుల నాగయ్యకు వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 2.50 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి చొరవతో ఈ సాయం మంజూరైంది. నల్లపోతుల నాగయ్య థైమెక్టమీ శస్త్రచికిత్స కోసం హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందించాలని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ విజ్ఞప్తికి స్పందించిన ముఖ్యమంత్రి బాధితుడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 2,50,000లను వైద్య ఖర్చుల అనుమతి పత్రం రూపంలో మంజూరు చేశారు. ఎమ్మెల్సీ ఆదేశాల మేరకు మహాదేవ్‌పేట మాజీ ఉప సర్పంచ్ బాలపిరు, కుటుంబ సభ్యులు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి బాధిత కుటుంబానికి సహాయానికి సంబంధించిన పత్రాన్ని అందజ ేశారు. వైద్య చికిత్సకు ఆర్థిక సాయం అందేలా చొరవ చూపిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ద

## ఈద్ మిలాద్ ఉన్ నబీ ర్యాలీల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలి




**సంగారెడ్డి బ్యూరో, (సింగిడి):**
ఈద్ మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే ర్యాలీలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని సూచిస్తూ, ముస్లిం మత పెద్దలు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులతో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పీస్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఈద్ మిలాద్ ఉన్ నబీ ర్యాలీలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముస్లిం మత పెద్దలు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులకు సూచించారు. ఒకరి మత సంప్రదాయాలను మరొకరు గౌరవించుకున్నప్పుడే మత సామరస్యం నెలకొంటుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించామని, ర్యాలీల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా తగిన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. వాట్సాప్ గ్రూపుల్లో సర్క్యులేట్ అయ్యే ఫేక్/ఫార్వర్డ్ మెసేజ్‌లను నమ్మవద్దని, తమకు వచ్చిన మెసేజ్‌లో వాస్తవం ఎంత ఉందో నిర్ధారించుకున్న తర్వాతే ఇతరులకు ఫార్వర్డ్ చేయాలని సూచించారు.

singidinews@gmail.com

# బికినీలో కృతిసనన్ రక్షాబంధన్ సెలబ్రేషన్స్

## ఏకి పడేసిన నటి, ఎంపి కంగనా రనౌత్

కృతి సనన్ ఇటీవల నటించిన ఓ యాడ్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఇప్పటికే నెట్టింట విమర్శలు రాగా.. బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ తాజాగా మండిపడ్డారు. రక్షా బంధన్ అంటే ప్రతి సోదరికీ ఎంతో ప్రత్యేకమైన రోజు. అంత గొప్ప సమయంలో హుందాగా కనిపించాలి. ఈ సాంప్రదాయ పండగకు సంబంధించిన ప్రకటనలో ఇలాంటి దుస్తులా ధరించేది. ఈ రోజుల్లో మహిళలకు లెహంగాలు, జీన్స్, సల్వార్ కమీజ్, చీరలు, పంజాబీ డ్రెస్‌లు.. ఇన్ని రకాలు ఉన్నాయి. ఇన్ని ఉన్నా.. ఇలాంటి బికినీ ధరించి రాఖీ ఎందుకు కడతారు?. ఈ యాడ్ చేసిన స్టైలిష్ట్‌కు ఈ ఆప్షన్లు కనిపించలేదా? ఈ యాడ్ ఉద్దేశపూర్వకంగా చేసినట్లుంది. చాలా అసహ్యంగా కనిపిస్తోందని తన ఇన్‌స్టాలో రాసుకొచ్చారు. ఇటీవల విడుదలైన ఈ యాడ్‌పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా కృతిని ట్రోల్ చేస్తున్నారు. డ్రెస్‌తో పాటు.. ఈ యాడ్‌లో పెంపుడు కుక్కకు రాఖీ కడుతూ కృతి కనిపించడంతో విమర్శలు మరింత ఎక్కువ య్యాయి. ఈ యాడ్‌పై ఇప్పటి వరకూ యాజమాన్యం, కృతి సనన్ స్పందించలేదు.



### నటనను నీ నుంచి
## నేర్చుకోవాల్సిందే
### బేబీ నక్షత్రకు నటుడు ధనుష్ ప్రశంసలు



'ఇరుముడి' చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ అందుకుంటోంది. ముఖ్యంగా సినిమాలోని కథ, భావోద్వేగ సన్నివేశాలు, నటీనటుల ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాలో రవితేజ నటనతో పాటు ఆయన కుమార్తె పాత్రలో నటించిన బాలనటి బేబీ నక్షత్ర నటనకు విశేష ప్రశంసలు దక్కుతున్నాయి. తండ్రి–కూతుళ్ల మధ్య ఉండే అనుబంధాన్ని తెరపై ఎంతో భావోద్వేగంగా చూపించడంలో ఈ ఇద్దరి నటన కీలక పాత్ర పోషించిందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. 'ఇరుముడి' సక్సెస్ మీట్ తర్వాత దర్శకుడు శివ నిర్వాణ బేబీ నక్షత్రకు ఒక ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ఇచ్చారు. జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ నటుడు ధనుష్‌తో నక్షత్రకు వీడియో కాల్ ఏర్పాటు చేశారు. సినిమాలో ఆమె నటనను చూసిన ధనుష్ చిన్నారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ వీడియో కాల్‌లో ధనుష్ మాట్లాడిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నక్షత్ర నటనను ప్రశంసిస్తూ, ఎప్పుడైనా ఇద్దరం కలిసినప్పుడు 'నేను నీ దగ్గర నటన నేర్చుకోవాలి' అంటూ సరదాగా చెప్పారు.. ఒక స్టార్ హీరో, జాతీయ అవార్డు విజేత నుంచి ఇలాంటి ప్రశంసలు రావడంతో నక్షత్ర ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ధనుష్‌తో జరిగిన ఈ ప్రత్యేక సంభాషణను బేబీ నక్షత్ర తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. దీంతో ఈ వీడియో నెటిజన్ల దృష్టిని ఆకర్షించి వైరల్‌గా మారింది. చిన్నారి నటనకు ధనుష్ లాంటి స్టార్ నుంచి ప్రశంసలు రావడంపై అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇరుముడిలో నక్షత్ర నటన నిజంగానే అద్భుతం , ధనుష్ ప్రశంసలు ఆమెకు మరింత ప్రోత్సాహం ఇస్తాయి అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో బేబీ నక్షత్ర పాత్ర కథలో కీలకంగా నిలిచిందని ప్రేక్షకులు చెబుతున్నారు.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737